మంగళవారం 22-8-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 152

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'



పురుగులకూ కుటుంబ నియంత్రణ!

-11లో



తిలక్‌కు లక్కీ చాన్స్...

ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికైన హైదరాబాద్ క్రికెటర్

-12లో



అప్పుడు అంతా అవినీతే..

దేశంలో 2014కు ముందు మొత్తం అవినీతి, కుంభకోణాలే రాజ్యమేలాయని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



క్షిపణుల నుంచి సంగీతం దాకా..

అవాంతరాలను అధిగమిస్తూ మహిళలు క్షిపణుల నుంచి సంగీతం వరకు ఎంతో సాధించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు.

వివరాలు 6లో ▸



మణిపూర్ మళ్లీ దిగ్బంధం

మణిపూర్‌లోని కాంగ్‌పోక్పిలో జాతీయ రహదారులపై కుకీలు తిరిగి నిరవధిక దిగ్బంధనం చేపట్టారు.

వివరాలు 6లో ▸



హిల్లరీ తుపాను బీభత్సం

అమెరికాలోని పలు రాష్ట్రాల్లో హిల్లరీ తుపాను తీవ్ర ప్రభావం చూపుతోంది. తుపాను ధాటికి దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

వివరాలు 6లో ▸

సిట్టింగులకే సై!

ఒకేసారి 115 మందితో బీఆర్‌ఎస్ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన కేసీఆర్



- ఏడు నియోజకవర్గాల్లో మాత్రం సిట్టింగులు మార్పు
- నాలుగు చోట్ల కొత్తవారికి.. కోరుట్ల, సికింద్రాబాద్ కంటోన్మెంట్లలో వారసులకు చాన్స్.. పెండింగ్‌లో జనగాం, నర్సాపూర్, గోషామహల్, నాంపల్లి స్థానాలు
- గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలోనూ కేసీఆర్ పోటీ
- మొత్తంగా బీఆర్‌ఎస్ జాబితాలో ఏడుగురు మహిళలు
- కమ్యూనిస్టులతో ఎలాంటి పొత్తూ లేదని ప్రకటించిన కేసీఆర్
- సర్దుబాటులో భాగంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి!
- ఒకట్రెండు రోజుల్లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తా: మహేందర్‌రెడ్డి

2లో

టికెట్ దక్కని సిట్టింగ్‌లు..

ఆత్రం సక్కు (ఆసిఫాబాద్-ఎస్టీ), రాథోడ్ బాపూరావు (బోథ్-ఎస్టీ), రేఖానాయక్ (ఖానాపూర్-ఎస్టీ), బేతి సుభాష్‌రెడ్డి (ఉప్పల్), తాటికొండ రాజయ్య (స్టేషన్‌ఘన్‌పూర్-ఎస్సీ), రాములు నాయక్ (వైరా-ఎస్టీ), చెన్నమనేని రమేశ్‌బాబు (వేములవాడ-జనరల్)

వీరి స్థానంలో టికెట్లు పొందినవారు

కోవ లక్ష్మి (ఆసిఫాబాద్), అనిల్ జాదవ్ (బోథ్), భూక్యా జాన్సన్ రాథోడ్ నాయక్ (ఖానాపూర్), బండారు లక్ష్మారెడ్డి (ఉప్పల్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), బానోత్ మదన్‌లాల్ (వైరా), చల్మెడ లక్ష్మీకాంతరావు (వేములవాడ).

ఏడుగురు మహిళలకు టికెట్లు

ఎమ్మెల్యేలు సబితా (మహేశ్వరం), పద్మా దేవేందర్ రెడ్డి (మెదక్), గొంగిడి సునీత (ఆలేరు), బానోత్ హరిప్రియనాయక్ (ఇల్లందు)తోపాటు కోవ లక్ష్మి (ఆసిఫాబాద్), బడే నాగజ్యోతి (ములుగు), లాస్య నందిత (కంటోన్మెంట్)కు టికెట్ ఇచ్చారు

ధిక్కారమా.. వేటే

ముందు నుంచీ చెప్తున్నట్టే సిట్టింగ్‌లకే టికెట్లు..

పార్టీ కేడర్‌కు సీఎం కేసీఆర్ స్పష్టీకరణ

- అసంతృప్తులు ఏవైనా ఉంటే పరిష్కరిస్తాం.. అక్టోబర్ 16న వరంగల్‌లో సింహగర్జన.. అదే రోజు మేనిఫెస్టో విడుదల
- **జాబితా ప్రకటించేశాం.. లెఫ్ట్‌తో పొత్తు మాట ఇంకెక్కడిది?**
- చూద్దాం.. బీసీలకు ఎవరెన్ని సీట్లు కేటాయిస్తారో?
- కాంగ్రెస్, బీజేపీ పాగల్ పార్టీలంటూ కేసీఆర్ ఫైర్

- వివరాలు 2లో▶

ఆత్మ విశ్వాసమా.. బలహీనతా?

- ఒకేసారి 115 మందితో బీఆర్‌ఎస్ జాబితాపై చర్చ
- ప్రజల్లో వ్యతిరేకత ఉన్న సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇచ్చారంటూ విస్మయం
- సామాజికవర్గ సమతుల్యత పాటించలేదనే విమర్శలు.. సర్వేలు, పనితీరు ఆధారంగా టికెట్లు ఏవని ఆశావహుల ఆవేదన
- కొందరు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని స్వయంగా చెప్పి అవకాశం ఇవ్వడమేంటనే ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలలకుపైగా గడువున్నా.. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ముందస్తుగా ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల్లోనూ దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముందుగా, ఒకేసారి అభ్యర్థులను వెల్లడించడంలో కేసీఆర్ ఆత్మవిశ్వాసం కనిపిస్తోందని ఓవైపు హర్షం కనిపిస్తుండగా.. ప్రజల్లో వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న దాదాపు 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వడం బలహీనతేనని మరోవైపు

మిగతా 3వ పేజీలో ▶

నర్సాపూర్‌లో నువ్వా నేనా?

- అక్కడ బీఆర్‌ఎస్ టికెట్ కోసం సిట్టింగ్ మదన్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మధ్య పోటీ

- వివరాలు 3లో

జనగామపై వీడని పీటముడి!

- హరీశ్‌రావు, కవితలను కలసిన 'ముత్తిరెడ్డి'.. తనకే అవకాశం ఉందంటున్న యాదగిరిరెడ్డి
- తమ వంతు ప్రయత్నాలు చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

'పల్లా'కు ఇస్తే అగ్నిగుండమే!

- జనగామ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతల హెచ్చరిక.. హైదరాబాద్‌లో హరీశ్‌రావుతో భేటీ

- వివరాలు 3లో

కంగుతిన్న కామ్రేడ్లు...!

- పొత్తుపై బీఆర్‌ఎస్ స్పందించకపోవడం, సీట్లు కేటాయించకపోవడంపై ఆగ్రహం
- నేడు భవిష్యత్ కార్యాచరణపై చర్చ
- విడివిడిగా, కలివిడిగా వామపక్షాల సమీక్షలు.. కాంగ్రెస్‌తో దోస్తీకి ప్రయత్నం

- వివరాలు 5లో

మైనంపల్లిపై వేటుకు రంగం సిద్ధం!

హరీశ్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్న బీఆర్‌ఎస్ అధిష్టానం

- మెదక్‌లో మంత్రి హరీశ్‌రావు పెత్తనం ఏమిటన్న మైనంపల్లి
- మల్కాజిగిరి ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన కేటీఆర్, కవిత
- తాము హరీశ్‌కు సంఘీభావంగా ఉంటామన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్
- బీఆర్‌ఎస్ ముఖ్య స్తంభంగా హరీశ్ కొనసాగుతారని స్పష్టీకరణ
- పోటీ చేయడం, చేయకపోవడం మైనంపల్లి ఇష్టమన్న సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మంత్రి హరీశ్‌రావుపై మల్కాజిగిరి శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు చేసిన తీవ్ర వ్యాఖ్యలను పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ఆయనను మల్కాజిగిరి అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, పార్టీ గీత దాటారనే కారణంతో వేటు వేసేందుకు రంగం సిద్ధం చేసింది. తన కుమారుడికి మెదక్ అసెంబ్లీ టికెట్ నిరాకరించిన నేపథ్యంలో మంత్రి హరీశ్‌పై హన్మంతరావు తిరుమలలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'మెదక్‌లో ఆయన పెత్తనం ఏమిటి..ఆయనకు బుద్ధి చెప్తా. సిద్దిపేటలో ఆయనకు అడ్రస్ లేకుండా చేస్తా. ఆయన దుకాణం బంద్ చేసేవరకు నిద్రపోను..'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనంపల్లి వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర కలకలం రేపాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ వీటిపై స్పందించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

టికెట్ దక్కని నేతలకు ఇతర పదవులు

'తన కుటుంబసభ్యుడికి టికెట్ నిరాకరించడంతో మా పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే సహనం కోల్పోయి మంత్రి హరీశ్‌రావుపై కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే వైఖరిని

మిగతా 2వ పేజీలో ▶

మహిళలకు ఆరు సీట్లేనా?



బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాపై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు

- ఢిల్లీలో మహిళా రిజర్వేషన్లపై చేసినవి దొంగ దీక్షలేనా?..
- బీజేపీకి పెరుగుతున్న ఆదరణతో కేసీఆర్‌లో ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బంగారు కుటుంబసభ్యులు చేసినవన్నీ దొంగ దీక్షలేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 33 శాతం రిజర్వేషన్లు అంటూ డిమాండ్ చేసి.. 3+3 కలిసి 6 సీట్లే మహిళలకు కేటాయించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. 'ఇదేనా మీ బంగారు కుటుంబానికి వచ్చే లెక్కలు? ఇదేనా మహిళలకు మీరు చేయాలనుకున్న న్యాయం?'అంటూ పరోక్షంగా ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ప్రశ్నించారు. సోమవారం బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన అనంతరం కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. 'బీఆర్‌ఎస్ పార్టీ విడుదల చేసిన జాబితా చూస్తుంటే.. మరోసారి అధికారంలోకి రాలేమని కేసీఆర్‌కు అర్థమైనట్లుగా తెలుస్తోంది. రోజురోజుకూ ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి కేసీఆర్‌లో ఆందోళన మొదలైంది. గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయాలని కేసీఆర్ నిర్ణయించుకోవడం ఆయనలో నెలకొన్న భయానికి నిదర్శనం..'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

దోస్తుకు కేసీఆర్ మద్దతు

'మతోన్మాద మజ్లిస్ అభ్యర్థులను గెలిపించేందుకు, ఆ పార్టీ వ్యతిరేక ఓట్లు చీలేందుకు, ఆయా ప్రాంతాల్లో ఒవైసీ చెప్పిన అభ్యర్థులను బరిలో దించుతూ..కేసీఆర్ దోస్తుకు మద్దతుగా నిలుస్తున్నారు..'అని కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ ప్రాంతంలో బీఆర్‌ఎస్, మజ్లిస్ కలిసి 29 సీట్లు గెలవాలని కేసీఆర్ మీడియా సమావేశంలోనే ప్రకటించారని పేర్కొన్నారు. మెజారిటీ ఎమ్మెల్యేలకు మళ్లీ సీట్లు ఇవ్వడం ద్వారా.. కేసీఆర్ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని వ్యాఖ్యానించారు.

ఓటమి ఒప్పుకున్న కేసీఆర్!



టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలు

- రెండు నియోజకవర్గాల్లో పోటీతో ఇది స్పష్టమైంది
- కానీ ఆయన రెండు స్థానాల్లోనూ ఓడిపోతారు
- ముఖ్యమంత్రి గొంతులో భయం, ఓటమి కనిపించింది
- మూడింట రెండొంతుల మెజారిటీతో కాంగ్రెస్ గెలుస్తుంది

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ స్వయంగా తన ఓటమిని ఒప్పుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయడం ద్వారా ఈ విషయం స్పష్టమైందని అన్నారు. అభ్యర్థుల ప్రకటన సమయంలో ముఖ్యమంత్రి గొంతులో ఓటమి భయం స్పష్టంగా కనిపించిందని, ఆయన పోటీ చేస్తున్న గజ్వేల్, కామారెడ్డి రెండింటిలో ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. మొత్తం సిట్టింగులకు సీట్లివ్వాలన్న తన సవాల్‌ను స్వీకరించకుండా కొందరిని మార్చారని అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

మైనారిటీలను అవమానించడమే..

ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డికి పారిపోతున్నారని తాను మొదటి నుంచి చెప్పిన మాటలు నిజమయ్యాయని రేవంత్ అన్నారు. బీఆర్‌ఎస్ జాబితా చూసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలిపోయిందని, మూడింట రెండొంతుల మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'కేసీఆర్ పారిపోవాలనుకుంటే సిద్దిపేట ఉంది.. సిరిసిల్ల ఉంది..కానీ ఒక మైనారిటీ నేత బరిలో ఉన్న కామారెడ్డికి వెళ్లడం.. మైనారిటీలను అవమానించడమే. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ ఎనలేని సేవ చేశారు. కాంగ్రెస్ అంతా షబ్బీర్ అలీకి అండగా ఉండి కేసీఆర్ పని పడుతుంది. అసలు కేసీఆర్ సొంత జిల్లా సిద్దిపేటకు వెళ్లకుండా కామారెడ్డికి ఎందుకు వెళ్తున్నారో ప్రజలకు చెప్పాలి..'అని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ ఓటమి సూర్యాపేట సభలోనే

మిగతా 5వ పేజీలో ▶



హైకోర్టు విచారణలు ప్రత్యక్ష ప్రసారం

- 29 కోర్టుల్లో ప్రారంభించిన సీజే జస్టిస్ అలోక్ అరాధే
- న్యాయవ్యవస్థ ప్రజలకు మరింత చేరువవుతుందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులోని 29 కోర్టు హాళ్లలో విచారణల ప్రత్యక్ష ప్రసారాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సోమవారం ప్రారంభించారు. ఉదయం 10.15 గంటలకు హైకోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో

మిగతా 10వ పేజీలో ▶

ఓట్ల పండుగ.. ఉపాధి మెండుగా

వచ్చే ఆరు నెలల్లో దేశంలో 7 లక్షల ఉద్యోగాలు

- యువతకు భారీగా తాత్కాలిక ఉపాధి అవకాశాలు
- కేపీఎంజీ, టీమ్‌లీజ్ సంస్థల అంచనాల్లో వెల్లడి
- ఐటీ ప్రొఫెషనల్స్, అనలిస్టుల నుంచి డిజిటల్ మీడియా దాకా ఆఫర్లు.. ఓటర్ల నాడి గుర్తించేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్లు
- కొత్త యాప్‌ల రూపకల్పన, నిర్వహణలో ఐటీ కంపెనీలు
- ఎన్నికలకు తోడు పండుగలతో ఈ-కామర్స్‌లోనూ ఉద్యోగాలు



సాక్షి, హైదరాబాద్: మరికొన్ని నెలల్లో జరగనున్న పార్లమెంటు, వివిధ రాష్ట్రాల శాసన సభల ఎన్నికలు.. కొత్త ఉపాధిని కల్పించనున్నాయి. యువతకూ ఉద్యోగాలు రానున్నాయి. కానీ ఈ రెండూ తాత్కాలికమే కానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉన్నప్పటికీ.. మన దేశంలో మాత్రం ఎన్నికలతో భారీ ఎత్తున తాత్కాలిక ఉద్యోగాలు రాబోతున్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆగస్టు చివరి వారం నుంచి ఆరేడు నెలల పాటు పలు సెక్టార్లలో నిపుణులైన యువతకు అవకాశాలు రాబోతున్నాయని.. మార్కెట్ సర్వేలు, సిబ్బంది సేవల సంస్థలు మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా, టీమ్‌లీజ్, లింక్డ్‌ఇన్ వంటి సంస్థలు చెప్తున్నాయి.

ఐటీ.. డిజిటల్.. : దేశంలో ఎన్నికల సీజన్ ఇప్పటికే మొదలైంది. దేశవ్యాప్తంగా డిజిటల్ వినియోగం పెరిగిన నేపథ్యంలో.. రాజకీయ పార్టీలు సరికొత్త విధానాలను అనుసరిస్తున్నాయి. ఐటీ, సోషల్ మీడియాను తమ అవసరాలకు వినియోగిస్తున్నాయి. ఈ క్రమంలో ఐటీ నిపుణుల అవసరం పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. దీనికితోడు ఆగస్టు నుంచి పండుగల సీజన్ మొదలవుతోందని, కొనుగోళ్ల సందడితో ఈ-కామర్స్ జోరందుకుంటుందని అంటున్నాయి. ఇవన్నీ కూడా యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచుతాయని వివరిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో దేశవ్యాప్తంగా 7 లక్షల మందికిపైగా

మిగతా 5వ పేజీలో ▶



రేపే చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్

ప్రపంచమంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న చంద్రయాన్-3 ల్యాండర్ అంతిమ గమ్యానికి సమయం సమీపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే బుధవారం సాయంత్రం 6.04 గంటలకు ల్యాండర్ 'విక్రమ్' చందమామ దక్షిణ ధ్రువ ఉపరితలంపై కాలు మోపనుంది. సాయంత్రం 5.20 గంటల నుంచే ప్రత్యక్ష ప్రసారం ప్రారంభం కానుంది.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్


కాంగ్రెస్‌లోకి రేఖా నాయక్!



బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా రాజకీయ సమీకరణాలను మారుస్తోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లకు ఆ పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకొన్నారు.

- వివరాలు 5లో▶

రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3,06,42,333



రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,06,42,333కు చేరింది. అందులో 1,53,73,066 మంది పురుషులు, 1,52,51,797 మంది మహిళలు, 2,133 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు.

- వివరాలు 14లో▶

గురుకుల పరీక్షలకు రేపటితో ముగింపు!



గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి నిర్వహిస్తున్న అర్హత పరీక్షల ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. 9,231 ఉద్యోగాల భర్తీకి గాను ఈనెల ఒకటో తేదీన పరీక్షలు ప్రారంభమయ్యాయి.


- వివరాలు 14లో▶

వరిసాగు పైపైకి.. పప్పు ధాన్యాలు కిందకి

దేశ వ్యాప్తంగా ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలు, పెరిగిన భూగర్భ జలాల లభ్యత కారణంగా వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

- వివరాలు 6లో▶

ఇదండీ మాట



కాళేశ్వరం అవినీతిపై చర్యలు మొదలు

ప్రకాశ్ జవదేకర్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట సీఎం కేసీఆర్ భారీ అవినీతికి పాల్పడ్డారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ ఆరోపించారు. ఈ అవినీతిపై చర్యలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అదనంగా 18 లక్షల ఎకరాలకు నీరు అందిస్తారన్న ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి వేగంగా అనుమతులు ఇచ్చామని.. కానీ కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే నీరు ఇస్తున్నారని చెప్పారు. ''కేంద్రం నిబంధనల ప్రకారమే కాళేశ్వరానికి అనుమతులు ఇస్తే.. అందుకు భిన్నంగా పనులు జరిగాయి. రూ.40 వేల కోట్ల అంచనాతో ప్రాజెక్టును చేపట్టి రూ.1.2 లక్షల కోట్లు ఖర్చు చూపించారు. ఇందులో అవినీతికే అధిక మొత్తం పోయింది..'' అని జవదేకర్ ఆరోపించారు.

కేసీఆర్‌ది విశ్వాస ఘాతుకం

తెలంగాణ ఏర్పాటు ప్రాథమిక లక్ష్యాలైన నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు విశ్వాస ఘాతుకం చేశారని జవదేకర్ విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలను స్వప్రయోజనాలకు వినియోగించుకున్నారని.. తెలంగాణను రూ.5 లక్షల కోట్లకు పైగా అప్పులపాలు చేశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో చాలా మంది నేతలు బీజేపీలో చేరబోతున్నారని చెప్పారు.

మంత్రివర్గంలోకి 'పట్నం'

- రేపు ఉదయం 11.30కు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం
- తాండూరులో పైలట్‌తో రాజీ ఫార్ములాలో భాగంగా పదవి



సాక్షి, హైదరాబాద్: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ టికెట్ కేటాయింపులో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ సయోధ్య కుదిర్చారు. తాండూరు టికెట్‌పై రాజీఫార్ములాలో భాగంగా శాసనమండలి సభ్యుడిగాఉన్న పట్నం మహేందర్‌రెడ్డి ఈ నెల 23న బుధవారం రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఉదయం 11.30కు రాజ్‌భవన్‌లో పట్నం రాష్ట్ర మంత్రివర్గంలో చేరతారు. 2014 ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేరిన మహేందర్‌రెడ్డి తాండూరు నుంచి గెలిచి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత రోహిత్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరిన నాటి నుంచి ఇద్దరు నేతల నడుమ విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకుని పలుమార్లు బహిరంగంగా విమర్శలకు పూనుకున్నారు. 2023లో తాండూరు అసెంబ్లీ టికెట్ కోసం ఇద్దరు నేతలు తీవ్రంగా పోటీ పడుతున్న నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్యవర్తిత్వం వహించారు. రోహిత్ రెడ్డికి టికెట్ ఇస్తే సహకరించాలని మహేందర్‌రెడ్డిని కోరడంతో పాటు ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్త్‌లో అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే మండలి నుంచి కేబినెట్‌లోకి తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 2021 మే నెలలో ఈటలను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేసిన నాటి నుంచి కేబినెట్ బెర్త్ ఖాళీగా ఉంది. ప్రస్తుతం కుదిరిన రాజీ ఫార్ములామేరకు కేబినెట్‌లో ఖాళీగాఉన్న బెర్త్‌లో పట్నం మంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తారు. మహేందర్‌రెడ్డి సుమారు 3 నెలలపాటు మంత్రిగా అధికారిక హోదాలో పనిచేస్తారు.

టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం: జాజుల

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించిన అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల టికెట్లలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల జాబితాలో 20% టికెట్లు, ఐదు శాతం ఉన్న రెడ్లకు 33%, అరశాతం ఉన్న వెలమలకు 16% టికెట్లు కేటాయించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు బీసీల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు.

సిట్టింగులకే సై!

ఒకేసారి 115 మందితో బీఆర్‌ఎస్ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్

టీఆర్‌ఎస్ భవనం వద్ద పార్టీ శ్రేణుల కోలాహలం..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి రాజుకుంది. ఊహించినట్టుగానే బీఆర్‌ఎస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. సిట్టింగ్‌లకే ప్రాధాన్యమిస్తూ, పెద్దగా మార్పు చేర్పులేవీ లేకుండానే.. వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం విడుదల చేశారు. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకుగాను.. నాలుగు సీట్లు మినహా మిగతా 115 నియోజకవర్గాల టికెట్లను ప్రకటించారు. మిగతా నాలుగు చోట్ల స్థానిక పరిస్థితులను మరోసారి మదింపు చేశాక అభ్యర్థులను ఖరారు చేస్తామన్నారు. కేసీఆర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తోపాటు కామారెడ్డి నుంచి కూడా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. సర్వేలు, ఎమ్మెల్యేల పనితీరు, స్థానిక పరిస్థితుల మేరకు ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించగా.. 4 చోట్ల కొత్త ముఖాలకు చోటు కల్పించారు. మూడు చోట్ల వారసులకు అవకాశమిచ్చారు.

ఇద్దరు మినహా 'చేరిన' అందరికీ..

➤ 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుంచి 12 మంది, టీడీపీ నుంచి ఇద్దరు, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి గెలిచిన కోరుకంటి చందర్ (రామగుండం), ఇండిపెండెంట్‌గా గెలిచిన రాములు నాయక్ (వైరా) తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరిలో కాంగ్రెస్ నుంచి వచ్చిన ఆత్రం సక్కు (ఆసిఫాబాద్), రాములు నాయక్ (వైరా) మినహా.. మిగతా అందరికీ కేసీఆర్ మళ్లీ పోటీ చేసే అవకాశం ఇచ్చారు.

సామాజిక వర్గాల వారీగా టికెట్ల సంఖ్య

వర్గం	సీట్లు
ఓసీ	58
బీసీ	22
ఎస్సీ	20
ఎస్టీ	12
మైనారిటీ	03

కులాల వారీగా లెక్క ఇదీ..

కులం	సీట్లు	కులం	సీట్లు
రెడ్డి	40	ముస్లిం	03
వెలమ	11	వైశ్య	01
మాదిగ	11	బ్రాహ్మణ	01
మున్నూరుకాపు	10	పద్మశాలి	01
మాల	07	గంగపుత్ర	01
లంబాడా	07	వంజర	01
కమ్మ	05	బైండ్ల	01
యాదవ	05	నేతకాని	01
గౌడ	04	గోండు	01
కోయ	04	మొత్తం	115

అభ్యర్థుల విశేషాలు ఇవీ..

- ➤ తాజాగా ప్రకటించిన బీఆర్‌ఎస్ జాబితాలో నలుగురు.. అనిల్ జాదవ్ (బోథ్), భూక్యా జాన్సన్ రాథోడ్ నాయక్ (ఖానాపూర్), లాస్య నందిత (కంటోన్మెంట్), కల్వకుంట్ల సంజయ్ (కోరుట్ల) తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.
- ➤ చాలామంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమ వారసులకు టికెట్ ఇవ్వాలని కోరినా.. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కుమారుడు సంజయ్‌కు మాత్రమే అవకాశమిచ్చారు. ఇక సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న ఇటీవల మృతి చెందడంతో.. ఆయన కుమార్తె లాస్య నందితకు టికెట్ ఇచ్చారు.
- ➤ దుబ్బాక నుంచి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పోటీ చేయనున్నారు.
- ➤ గత ఎన్నికల్లో ఆసిఫాబాద్‌లో కోవ లక్ష్మి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలవడంతో.. ఆమె గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకుని సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ నిరాకరించారు.
- ➤ పౌరసత్వ వివాదం నేపథ్యంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబును తప్పించి.. చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు అవకాశం ఇచ్చారు.
- ➤ మెదక్ జిల్లా నర్సాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని తప్పించి మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డికి అవకాశం ఇస్తారని భావించారు. అయితే ఇద్దరూ టికెట్ కోసం గట్టిగా పట్టుబట్టడంతో పెండింగ్‌లో పెట్టారు. ఏకాభిప్రాయం సాధించాకే ఇక్కడ అభ్యర్థిని ప్రకటించనున్నారు.
- ➤ నాలుగైదు రోజులుగా చర్చనీయాంశంగా మారిన జనగామ స్థానం కూడా పెండింగ్‌లో పడింది. వాస్తవానికి ఇక్కడ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరును ఖరారు చేశారని.. కానీ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఒత్తిడి నేపథ్యంలో పెండింగ్‌లో పెట్టారని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. ముత్తిరెడ్డి సోమవారం ఉదయం టికెట్ల ప్రకటనకు ముందే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలసి.. తనకే టికెట్ వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.
- ➤ ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో ఎలాంటి పొత్తు లేదని ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎంఐఎం పార్టీతో మాత్రం స్నేహపూర్వక పోటీ కొనసాగుతుందని ప్రకటించారు. ఎంఐఎం ప్రాబల్యం కలిగిన నాంపల్లి, గోషామహల్ అభ్యర్థుల పేర్లను పెండింగ్‌లో పెట్టారు.

ముందుగా నిర్ణయించిన సమయానికే

➤ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ఇతర పార్టీల కంటే ముందే ప్రకటిస్తామని ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్.. ముందుగా నిర్ణయించుకున్న సమయానికే అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఆయన వెంట పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు, మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, గోపీనాథ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు వచ్చారు. తాండూరు టికెట్ ఆశిస్తున్న మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి పరస్పరం సహకరించుకునేందుకు అంగీకరించారని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇక మంత్రి హరీశ్‌పై మైనంపల్లి చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.. మైనంపల్లికి ఇష్టముంటే పోటీ చేస్తారని, లేదంటే వారేవాళ్ల పోటీ చేస్తారని పేర్కొన్నారు. ఇక మైనంపల్లి వ్యాఖ్యలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుపట్టారు. మంత్రి హరీశ్‌రావుకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. కాగా తాను ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పట్నం మహేందర్‌రెడ్డి మీడియాకు చెప్పారు.

పార్టీ ధిక్కారానికి పాల్పడితే వేటే..

- ముందు నుంచీ చెప్తున్నట్టే సిట్టింగ్‌లకే టికెట్లు..
- పార్టీ కేడర్‌కు సీఎం కేసీఆర్ స్పష్టీకరణ



సోమవారం అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో తలసాని, మధుసూదనాచారి, నిరంజన్‌రెడ్డి, హరీశ్‌రావ్, కేకే, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులు

సాక్షి, హైదరాబాద్: ముందు నుంచీ చెప్తున్నట్టుగానే సిట్టింగ్‌లకే పార్టీ టికెట్లు కేటాయించామని.. పార్టీ ధిక్కార చర్యలకు ఎవరు పాల్పడినా వేటు తప్పదని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ హెచ్చరించారు. ధిక్కారానికి పాల్పడేవారు ఏ స్థాయిలో ఉన్నా క్రమశిక్షణ చర్యలు సాదాసీదాగా ఉండవని, పార్టీ నుంచి పంపించేస్తామని స్పష్టం చేశారు. ఒకట్రెండు చోట్ల అసంతృప్తులుంటే.. పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు అధ్యక్షతన త్రిసభ్య కమిటీని నియమిస్తామని, ఆ కమిటీ సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకెవరూ పోటీయే కాదని.. 95 నుంచి 105 సీట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో 115 మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులతో జాబితాను కేసీఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పార్టీలో పూర్తి స్థాయి అవగాహన, సర్దుబాట్లతోనే ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటిస్తున్నామన్నారు. పార్టీ నిర్ణయం మేరకు తాను రెండు చోట్ల పోటీ చేస్తున్నట్టు తెలిపారు. శ్రావణమాసం మంచి ముహుర్తం ధనుర్లగ్నంలో అభ్యర్థులను ప్రకటించామని.. వీరిని గెలిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేలా ఆశీర్వదించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 16న వరంగల్‌లో సింహ గర్జన బహిరంగ సభ నిర్వహిస్తామని, అదే రోజున బీఆర్‌ఎస్ మేనిఫెస్టో విడుదల చేస్తామని ప్రకటించారు.

తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని మార్పులు

తప్పనిసరి పరిస్థితుల్లో ఏడుగురు సిట్టింగ్‌లను మార్చామని సీఎం కేసీఆర్ చెప్పారు. ఎవరినైనా వదులుకోవాలంటే తమకు కూడా బాధగానే ఉంటుందన్నారు. అవకాశం రానివారు చిన్నబుచ్చుకోవాల్సిన అవసరం లేదని.. ఎమ్మెల్సీ, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్లుగా పార్టీ అవకాశాలు కల్పిస్తుందని హామీ ఇచ్చారు. పార్టీలోనే ఉండి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. మిగిలిపోయిన 4 సీట్లలో అభ్యర్థులను రెండు మూడు రోజుల్లో ఖరారు చేస్తామని చెప్పారు. వేములవాడ అభ్యర్థి మంచివాడే అయినా ఆయన పౌరసత్వం సమస్య కోర్టుల్లో ఉందని చెప్పారు. భూపాలపల్లి నుంచి గండ్ర వెంకటరమణారెడ్డికి పోటీచేసే అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినందున మధుసూదనాచారి సహకారంతో టికెట్ కేటాయించామన్నారు. తాండూరు నుంచి మహేందర్‌రెడ్డి కూడా యువకుడికి అవకాశం ఇవ్వడానికి పూర్తిగా సహకరించి ఆశీర్వదించారని చెప్పారు.

వ్యతిరేకులకు ఇళ్ల స్థలాలివ్వం: కేసీఆర్

''రాష్ట్రానికి వ్యతిరేకంగా, అభివృద్ధికి విఘాతం కలిగించేలా కథనాలు ప్రచురించే పత్రికల్లోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వం. వాళ్లను పాలు పోసి పోషించాల్సిన అవసరమేముంది? ఎవరికి ఇవ్వాలన్నది ప్రభుత్వ విచక్షణ. కీలుబొమ్మలాంటి వారు జర్నలిస్టులు ఎలా అవుతారు? వాళ్లకు ఐడియా ఉండాలి కదా.. దేశంలో ఎవరూ మాతో పోల్చుకోవడానికి కూడా సాహసం చేయని పరిస్థితులు ఉంటే.. ఇక్కడ వేతనాలు ఇవ్వడానికి డబ్బుల్లేవంటూ కథనాలు రాస్తున్నారు. ఒకే దెబ్బకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశాం. ఆ పత్రిక తల ఎక్కడ పెట్టుకుంటుంది? ఆర్‌బీఐ రాష్ట్రాన్ని బెస్ట్ స్టేట్ అంటోంది. కేంద్రం, కేంద్ర మంత్రులు తెలంగాణ అభివృద్ధిని చెబుతూ అవార్డులిస్తుంటే.. అవేవీ పట్టించుకోకుండా పనికి మాలిన రాతలు రాస్తున్నారు. ఇదేం జర్నలిజం? ఉద్యమ సమయంలోనే చెప్పా.. కొన్ని కుల పత్రికలు, గుల పత్రికలు ఉన్నాయని.. న్యూస్‌పేపర్ కాదు వ్యూస్ పేపర్, చానెల్స్ ఉన్నాయి..''అని సీఎం ఘాటుగా స్పందించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు అంశంపై మీడియా ప్రశ్నించగా ఇలా స్పందించారు.

వామపక్షాలతో పొత్తు మాటే రాదు

బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాను విడుదల చేశాక వామపక్షాలతో పొత్తు మాటే ఉత్పన్నం కాదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 34 సీట్లు బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, బీఆర్‌ఎస్ బీసీలకు తక్కువ సీట్లు కేటాయించిందేమని మీడియా ప్రశ్నించగా.. 'చూద్దాం.. ఎవరెన్ని సీట్లు కేటాయిస్తారో?'అని బదులిచ్చారు. మహిళలకు తక్కువ సీట్లపై స్పందిస్తూ.. పార్లమెంటు చట్టం చేస్తే ప్రతీపార్టీ కూడా మహిళలకే అవకాశాలు ఇస్తాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అన్నీ ఆలోచించి టికెట్లు కేటాయించామని వివరించారు.

కర్ణాటకకు, తెలంగాణకు పోలికే లేదు

ఇటీవలి కర్ణాటక అసెంబ్లీ ఫలితాలకు, తెలంగాణకు పోలికే లేదని కేసీఆర్ పేర్కొన్నారు. అలవిగాని హామీలిచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తోందని విమర్శించారు. బెంగళూరుకు విద్యుత్ సరఫరా చేయలేక లోడ్ షెడ్డింగ్ చేస్తున్నారన్నారు. తెలంగాణలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నా.. బీఆర్‌ఎస్ లక్ష రూపాయలే, అదీ విడతల వారీగా మాఫీ చేస్తామని, ప్రజలు తమనే నమ్మి గెలిపించారని చెప్పారు.

జవదేకర్ ఓ పాగల్..!

సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి బీజేపీ సీనియర్ నేత ప్రకాశ్ జవదేకర్ చేసిన విమర్శలను ప్రస్తావించగా.. ''జవదేకర్ మాట్లాడేది ఏంది? కాళేశ్వరం గురించి తొండం తెల్వదు.. తోక తెల్వదు. ఎన్నిసార్లు చెప్పిందే చెప్తారు. ఆయనో ఓ పాగల్. బీఆర్‌ఎస్‌ను ఒకరికొకరు ఏ టీమ్, బీ టీమ్ అంటున్న కాంగ్రెస్, బీజేపీలు కూడా పాగల్ పార్టీలు..''అని కేసీఆర్ మండిపడ్డారు.

మైనంపల్లిపై వేటుకు రంగం సిద్ధం!

▶ మొదటి పేజీ తరువాయి

తీవ్రంగా ఖండిస్తున్నాం. మేము హరీశ్‌రావుకు సంఘీభావంగా ఉంటామని తెలియజేస్తున్నా. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి అంతర్భాగంగా ఉంటున్న హరీశ్.. పార్టీకి ముఖ్య స్తంభంగా ఇకముందు కూడా కొనసాగుతారు..'అని కేటీఆర్ పేర్కొన్నారు. 'రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంపికైన బీఆర్‌ఎస్ అభ్యర్థులకు అభినందనలు. నన్ను సిరిసిల్ల నుంచి మరోమారు అభ్యర్థిగా ప్రకటించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. ప్రజా జీవితంలో కొన్నిసార్లు నిరాశ ఎదురవుతుంది. అన్ని అర్హతలు, సమర్థత కలిగిన మన్నె క్రిషాంక్ వంటి నేతలకు దురదృష్టవశాత్తూ అవకాశం దక్కలేదు. క్రిషాంక్‌తో పాటు టికెట్ దక్కని ఇతరులకు.. ఇతర పదవులకు ఎన్నికయ్యే అవకాశం ఇవ్వడం ద్వారా ప్రజా సేవలో పాల్గొనే అవకాశం కల్పిస్తాం..'అని కేటీఆర్ హామీ ఇచ్చారు.

గెలుపు మాత్రమే కేసీఆర్ చిరునామా

ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుండటంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'సుమారు 40 ఏళ్లుగా ఎక్కడ, ఎప్పుడు పోటీ చేసినా గెలుపు మాత్రమే తన చిరునామాగా మల్చుకున్న నేత కేసీఆర్. ఎమ్మెల్యేగా ఓడితే రాజకీయ సన్యాసం అని శపథం చేసి నిస్సిగ్గుగా తెల్లారే తుంగలో తొక్కి వెంటనే ఎంపీగా పోటీ చేసిన వ్యక్తి కూడా కేసీఆర్ గురించి మాట్లాడడం విడ్డూరం'అంటూ రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఓటమి భయం అంటే అమేథీ ఎన్నిక అయిన తరువాత జరిగిన మిగతా దశల ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ నుంచి పోటీ చేయడమా? (అమేథీలో రాహుల్ ఓటమి తెలిసిందే). బళ్ళారి, అమేథీలో పోటీ చేసిన వ్యక్తి గురించి ఏమంటారు? (సోనియాను ఉద్దేశించి)'అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. వడోదర, వారణాసిలో మోదీ పోటీ ఎందుకు చేశారో బాండ్ పేపర్ వీరుడు (ధర్మపురి అర్వింద్) చెప్పగలరా?'అని ప్రశ్నించారు.

నిబద్ధత కలిగిన నాయకుడు హరీశ్

'తెలంగాణ ప్రజలకు, బీఆర్‌ఎస్ పార్టీకి సీనియర్ నాయకుడు హరీశ్‌రావు చేసిన సేవలు అనిర్వచనీయం. హరీశ్‌రావుపై ఎమ్మెల్యే మైనంపల్లి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా'అంటూ ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. మరోవైపు.. 'మైనంపల్లికి టికెట్ ఇచ్చాం. పోటీ చేస్తారా? లేదా? అనేది ఆయన ఇష్టం. మేం చేయగలిగింది ఏమీ లేదు'అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా ఇదీ..

నియోజకవర్గం	అభ్యర్థి	కులం	సామాజిక వర్గం
సిర్పూర్	కోనేరు కోనప్ప	కమ్మ	ఓసీ
చెన్నూర్ (ఎస్సీ)	బాల్క సుమన్	మాల	ఎస్సీ
బెల్లంపల్లి (ఎస్సీ)	దుర్గం చిన్నయ్య	నేతకాని	ఎస్సీ
మంచిర్యాల	నడిపెల్లి దివాకర్‌రావు	వెలమ	ఓసీ
ఆసిఫాబాద్(ఎస్టీ)	కోవ లక్ష్మి	గోండు	ఎస్టీ
ఖానాపూర్ (ఎస్టీ)	భూక్యా జాన్సన్ రాథోడ్ నాయక్	లంబాడ	ఎస్టీ
ఆదిలాబాద్	జోగు రామన్న	మున్నూరుకాపు	బీసీ
బోథ్ (ఎస్టీ)	అనిల్ జాదవ్	లంబాడ	ఎస్టీ
నిర్మల్	అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
ముధోల్	గడ్డిగారి విఠల్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
ఆర్మూర్	ఆశన్నగారి జీవన్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
బోధన్	మహ్మద్ షకీల్	ముస్లిం	ఓసీ
జుక్కల్(ఎస్సీ)	హన్మంత్ షిండే	మాల	ఎస్సీ
బాన్సువాడ	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
ఎల్లారెడ్డి	జాజాల సురేందర్	మున్నూరుకాపు	బీసీ
కామారెడ్డి	కె.చంద్రశేఖర్‌రావు	వెలమ	ఓసీ
నిజామాబాద్(అర్బన్)	బిగాల గణేశ్‌గుప్తా	వైశ్య	ఓసీ
నిజామాబాద్(రూరల్)	బాజిరెడ్డి గోవర్ధన్	మున్నూరుకాపు	బీసీ
బాల్కొండ	వేముల ప్రశాంత్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
కోరుట్ల	కల్వకుంట్ల సంజయ్	వెలమ	ఓసీ
జగిత్యాల	సంజయ్‌కుమార్	వెలమ	ఓసీ
ధర్మపురి	కొప్పుల ఈశ్వర్	మాల	ఎస్సీ
రామగుండం	కోరుకంటి చందర్	మున్నూరుకాపు	బీసీ
మంథని	పుట్ట మధు	మున్నూరుకాపు	బీసీ
పెద్దపల్లి	దాసరి మనోహర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
కరీంనగర్	గంగుల కమలాకర్	మున్నూరుకాపు	బీసీ
చొప్పదండి (ఎస్సీ)	సుంకే రవిశంకర్	మాదిగ	ఎస్సీ
వేములవాడ	చల్మెడ లక్ష్మీనరసింహారావు	వెలమ	ఓసీ
సిరిసిల్ల	కె. తారకరామారావు	వెలమ	ఓసీ
మానకొండూరు(ఎస్సీ)	రసమయి బాలకిషన్	మాదిగ	ఎస్సీ
హుజూరాబాద్	పాడి కౌశిక్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
హుస్నాబాద్	ఒడితెల సతీశ్‌కుమార్	బ్రాహ్మణ	ఓసీ
సిద్దిపేట	టి.హరీశ్‌రావు	వెలమ	ఓసీ
మెదక్	పద్మా దేవేందర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
నారాయణఖేడ్	మహారెడ్డి భూపాల్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
ఆందోల్ (ఎస్సీ)	చంటి క్రాంతి కిరణ్	మాల	ఎస్సీ
జహీరాబాద్	మాణిక్‌రావు	మాదిగ	ఎస్సీ
సంగారెడ్డి	చింతా ప్రభాకర్	పద్మశాలి	బీసీ
పటాన్‌చెరు	గూడెం మహిపాల్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
దుబ్బాక	కొత్త ప్రభాకర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
గజ్వేల్	కె.చంద్రశేఖర్‌రావు	వెలమ	ఓసీ
మేడ్చల్	చామకూర మల్లారెడ్డి	రెడ్డి	ఓసీ
మల్కాజిగిరి	మైనంపల్లి హన్మంతరావు	వెలమ	ఓసీ
కుత్బుల్లాపూర్	కేపీ వివేకానంద్	గౌడ	బీసీ
కూకట్‌పల్లి	మాధవరం కృష్ణారావు	వెలమ	ఓసీ
ఉప్పల్	బండారు లక్ష్మారెడ్డి	రెడ్డి	ఓసీ
ఇబ్రహీంపట్నం	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
ఎల్బీ నగర్	దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
మహేశ్వరం	సబితా ఇంద్రారెడ్డి	రెడ్డి	ఓసీ
రాజేంద్రనగర్	టి.ప్రకాశ్‌గౌడ్	గౌడ	బీసీ
శేరిలింగంపల్లి	అరికెపూడి గాంధీ	కమ్మ	ఓసీ
చేవెళ్ల(ఎస్సీ)	కాలె యాదయ్య	మాదిగ	ఎస్సీ
పరిగి	కొప్పుల మహేశ్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
వికారాబాద్(ఎస్సీ)	మెతుకు ఆనంద్	మాదిగ	ఎస్సీ
తాండూరు	పైలట్ రోహిత్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
ముషీరాబాద్	ముఠా గోపాల్	గంగపుత్ర	బీసీ
మలక్‌పేట	తీగల అజిత్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
అంబర్‌పేట	కాలేరు వెంకటేశ్	వంజరి	బీసీ
ఖైరతాబాద్	దానం నాగేందర్	మున్నూరుకాపు	బీసీ
జూబ్లీహిల్స్	మాగంటి గోపీనాథ్	కమ్మ	ఓసీ
సనత్‌నగర్	తలసాని శ్రీనివాస్‌యాదవ్	యాదవ	బీసీ
కార్వాన్	ఐందాల కృష్ణయ్య	మాదిగ	ఎస్సీ
చార్మినార్	ఇబ్రహీం లోడీ	ముస్లిం	ఓసీ
చంద్రాయణగుట్ట	సీతారాంరెడ్డి	రెడ్డి	ఓసీ
యాకుత్‌పుర	సామ సుందర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
బహదూర్‌పుర	అలీ బాక్రీ	ముస్లిం	ఓసీ
సికింద్రాబాద్	టి.పద్మారావుగౌడ్	గౌడ	బీసీ
కంటోన్మెంట్	లాస్య నందిత	మాల	ఎస్సీ
కొడంగల్	పట్నం నరేందర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
నారాయణపేట	ఎస్.రాజేందర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
మహబూబ్‌నగర్	వి.శ్రీనివాస్‌గౌడ్	గౌడ	బీసీ
జడ్చర్ల	చర్లకోల లక్ష్మారెడ్డి	రెడ్డి	ఓసీ
దేవరకద్ర	ఆళ్ల వెంకటేశ్వరరెడ్డి	రెడ్డి	ఓసీ
మక్తల్	చిట్టెం రామ్మోహన్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
వనపర్తి	సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
గద్వాల	బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
అలంపూర్	వీఎం ఇబ్రహీం	మాదిగ	ఎస్సీ
నాగర్‌కర్నూల్	మర్రి జనార్దన్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
అచ్చంపేట	గువ్వల బాలరాజు	మాదిగ	ఎస్సీ
కల్వకుర్తి	జైపాల్ యాదవ్	యాదవ	బీసీ
షాద్‌నగర్	అంజయ్య యెలగనమోని	యాదవ	బీసీ
కొల్లాపూర్	బీరం హర్షవర్ధన్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
దేవరకొండ(ఎస్టీ)	రవీంద్రకుమార్	లంబాడ	ఎస్టీ
నాగార్జునసాగర్	నోముల భగత్	యాదవ	బీసీ
మిర్యాలగూడ	ఎన్. భాస్కర్‌రావు	కమ్మ	ఓసీ
హుజూర్‌నగర్	శానంపూడి సైదిరెడ్డి	రెడ్డి	ఓసీ
కోదాడ	బొల్లం మల్లయ్య యాదవ్	యాదవ	బీసీ
సూర్యాపేట	జి.జగదీశ్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
నల్లగొండ	కంచర్ల భూపాల్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
మునుగోడు	కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
భువనగిరి	పైళ్ల శేఖర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
నకిరేకల్	చిరుమర్తి లింగయ్య	మాదిగ	ఎస్సీ
తుంగతుర్తి	గ్యాదరి కిషోర్ కుమార్	మాల	ఎస్సీ
ఆలేరు	గొంగిడి సునీత	రెడ్డి	ఓసీ
స్టేషన్ ఘన్‌పూర్(ఎస్సీ)	కడియం శ్రీహరి	బైండ్ల	ఎస్సీ
పాలకుర్తి	ఎర్రబెల్లి దయాకర్‌రావు	వెలమ	ఓసీ
డోర్నకల్	డీఎస్ రెడ్యా నాయక్	లంబాడ	ఎస్టీ
మహబూబాబాద్ (ఎస్టీ)	శంకర్ నాయక్	లంబాడ	ఎస్టీ
నర్సంపేట	పెద్ది సుదర్శన్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
పరకాల	చల్లా ధర్మారెడ్డి	రెడ్డి	ఓసీ
వరంగల్(పశ్చిమ)	దాస్యం వినయభాస్కర్	మున్నూరుకాపు	బీసీ
వరంగల్(తూర్పు)	నన్నపనేని నరేందర్	మున్నూరుకాపు	బీసీ
వర్ధన్నపేట(ఎస్సీ)	ఆరూరి రమేశ్	మాదిగ	ఎస్సీ
భూపాలపల్లి	గండ్ర వెంకటరమణారెడ్డి	రెడ్డి	ఓసీ
ములుగు(ఎస్టీ)	బడే నాగజ్యోతి	కోయ	ఎస్టీ
పినపాక(ఎస్టీ)	రేగా కాంతారావు	కోయ	ఎస్టీ
ఇల్లందు	హరిప్రియ నాయక్	లంబాడ	ఎస్టీ
ఖమ్మం	పువ్వాడ అజయ్‌కుమార్	కమ్మ	ఓసీ
పాలేరు	కందాల ఉపేందర్‌రెడ్డి	రెడ్డి	ఓసీ
మధిర(ఎస్సీ)	లింగాల కమల్‌రాజు	మాల	ఎస్సీ
వైరా(ఎస్టీ)	బానోతుమదన్‌లాల్	లంబాడ	ఎస్టీ
సత్తుపల్లి(ఎస్సీ)	సండ్ర వెంకటవీరయ్య	మాదిగ	ఎస్సీ
కొత్తగూడెం	వనమా వెంకటేశ్వరరావు	మునూరుకాపు	బీసీ
అశ్వారావుపేట(ఎస్టీ)	మెచ్చా నాగేశ్వర్‌రావు	కోయ	ఎస్టీ
భద్రాచలం(ఎస్టీ)	తెల్లం వెంకట్రావు	కోయ	ఎస్టీ

ఆత్మ విశ్వాసమా.. బలహీనతా?

▶ మొదటి పేజీ తరువాయి



అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్పులు చేయడానికి అవకాశమున్నా మెజారిటీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి అవకాశం ఇవ్వడంపై పార్టీ శ్రేణుల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. దళితబంధులో 30శాతం ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారంటూ స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పిన నేపథ్యంలో.. ఇప్పుడు అందరికీ టికెట్ కేటాయించడం ఏమిటనే సందేహాలు వస్తున్నాయి. గెలుపు గుర్రాలు కాని వారికి కూడా ఒత్తిళ్లు, లాబీయింగ్‌కు తలొగ్గి టికెట్లు కేటాయించి కేసీఆర్ బలహీనత చాటుకున్నారనే విమర్శలూ వస్తున్నాయి.

సామాజిక సమతుల్యతపై..

బీఆర్ఎస్ టికెట్ల కేటాయింపులో సామాజిక సమతుల్యతను పాటించలేదని, మహిళలకు కనీసం పది సీట్లయినా కేటాయించకపోవడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో 54శాతానికిపైగా ఉన్న బలహీనవర్గాలకు కేవలం 20శాతం సీట్లు కేటాయించడం సరికాదని ఆయా సామాజిక వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇదే సమయంలో 15శాతం కూడా లేని అగ్రవర్ణాలకు ఏకంగా 50శాతానికిపైగా సీట్లను కేటాయించడం ఏ విధంగా సమంజసమని ప్రశ్నిస్తున్నాయి. గతంలో బీసీలకు కేటాయించిన హుజూరాబాద్, కామారెడ్డి స్థానాలను సైతం ఈసారి అగ్రవర్ణాలకు కేటాయించడమేంటని మండిపడుతున్నాయి. వందల సంఖ్యలో ఉన్న బీసీ కులాల్లో కేవలం ఆరు కులాలకే ప్రాతినిధ్యం దక్కడం, ఇందులోనూ మున్నూరు కాపు మినహా మిగతా కులాలకు నామమాత్రంగానే టికెట్లు ఇవ్వడంపై పెదవి విరుస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలను కేవలం రిజర్వుడు స్థానాలకే పరిమితం చేశారని విమర్శలు వస్తున్నాయి. ముస్లింలకు మూడు సీట్లు ఇచ్చినట్టు కనిపిస్తున్నా.. బోధన్ మినహా మిగతా రెండు స్థానాలను పార్టీకి ఏమాత్రం పట్టులేని హైదరాబాద్ పాతబస్తీలో కేటాయించారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఇక టికెట్ తిరస్కరణకు గురైన వారిలో ఎస్టీలే ఎక్కువగా ఉండటంపైనా విమర్శలు వస్తున్నాయి.

అసంతృప్తిలో 'బహుళ'నాయకత్వం!

రాష్ట్ర ఏర్పాటు తర్వాత విపక్షాలకు చెందిన కొందరు ముఖ్య నేతలు బీఆర్ఎస్ గూటికి చేరుకున్నారు. 2014 ఎన్నికల తర్వాత 20 మందికిపైగా కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గూటికి చేరుకోగా.. 2018 ఎన్నికల తర్వాత ఇలా 15 మంది ఎమ్మెల్యేలు వచ్చి చేరారు. ఉద్యమ సమయంలో మొదలుకుని ఇప్పటిదాకా.. వివిధ పార్టీల నుంచి వచ్చిన చేరిన నేతలతో 40కి పైగా నియోజకవర్గాల్లో బహుళ నాయకత్వ సమస్య మొదలైంది. చాలా మంది ఎమ్మెల్యే టికెట్లు ఆశించి వచ్చిన వారు ఉన్నారు. కానీ 2018లో, ఇప్పుడు కూడా దాదాపుగా సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇవ్వడం.. ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేతల్లో నిరాశను మిగిల్చింది. 40కిపైగా స్థానాల్లో టికెట్లు ఆశించిన నేతలు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ప్రయోజనాల పేరిట తమ రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇక 30మందికిపైగా నేతలు తమ వారసులకు టికెట్లు ఇవ్వాలని కోరినా బీఆర్ఎస్ పెద్దలు స్పందించకపోవడంపై అసంతృప్తితో ఉన్నారు.

మహిళలకు కేటాయింపులు ఇంతేనా?

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్.. ప్రస్తుత జాబితాలో నాలుగు శాతమే సీట్లు కేటాయించిందని రాజకీయవర్గాలు, మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి. 115 మంది జాబితాలో ఏడుగురే మహిళలకు చోటు కల్పించడం ఏ విధమైన పురోగతి అని మండిపడుతున్నాయి. చట్టసభల్లో 33శాతం సీట్లు కేటాయించాలంటూ బీఆర్ఎస్ ఢిల్లీలో ధర్నా, నిరసనలు నిర్వహించిందని గుర్తు చేస్తున్నాయి.

సర్వేల ఆధారంగానే టికెట్లేవి?

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లకు ప్రాధాన్యతనిస్తామని కేసీఆర్ చెప్పినా.. పనితీరు, సర్వేల ఆధారంగానే టికెట్లు కేటాయిస్తామని పలుమార్లు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేస్తామని కూడా ప్రకటించారు. ఈ ఏడాది మార్చి నుంచే ఎన్నికల సన్నద్ధతను ప్రారంభించి.. నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పార్టీ ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేస్తున్నట్టు ప్రకటించారు. పలుమార్లు పార్టీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై కేసీఆర్ స్వయంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. కీలక నేతలు, కేడర్‌ను కలుపుకొనిపోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఎమ్మెల్యేల బంధుప్రీతి, అవినీతి, సొంత పార్టీ కేడర్‌పైనే వేధింపులు, పోలీసు కేసులు వంటి ఫిర్యాదులూ వెల్లువెత్తాయి. ఇలాంటిది సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇవ్వడమంటే.. సర్వేలు, పనితీరును పక్కనపెట్టేసినట్టేనా అని బీఆర్ఎస్‌లోని ఆశావహులు ప్రశ్నిస్తున్నారు.

మద్యం దుకాణాలకు డ్రా ప్రక్రియ పూర్తి

సాక్షి, హైదరాబాద్/ పాలమూరు: రాష్ట్రవ్యాప్తంగా 34 ఎక్సైజ్ జిల్లాల పరిధిలో మద్యం దుకాణాలకు లక్కీ డ్రా ప్రక్రియ సోమవారం ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో జరిగింది. మొత్తం 2,620 మద్యం దుకాణాలకుగాను 2,598 దుకాణాలకు లక్కీడ్రా ప్రక్రియను ఎక్సైజ్‌శాఖ అధికారులు పూర్తి చేశారు. ఆదిలాబాద్‌లో 9, ఆసిఫాబాద్‌లో ఐదు, నిర్మల్‌లో నాలుగు, భూపాలపల్లిలో 3, కామారెడ్డిలో ఒక మద్యం దుకాణానికి రీటెండర్ పిలవనున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. కాగా, పాలమూరు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ డ్రాను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు ఉండగా 22 దుకాణాలకు తక్కువ దరఖాస్తులు వచ్చాయని వాటిని పక్కన పెట్టామని తెలిపారు.

నర్సాపూర్‌లో నువ్వా నేనా?

- అక్కడ బీఆర్ఎస్ టికెట్ కోసం సిట్టింగ్ మదన్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మధ్య పోటీ
- టికెట్ హామీతోనే సునీత బీఆర్ఎస్‌లో చేరారంటున్న అనుచరులు
- ఎవరికి వారే గట్టి ప్రయత్నాలు.. కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామంటూ ప్రకటనలు
- సీఎం మెదక్ పర్యటన తర్వాత అభ్యర్థిత్వం ఖరారయ్యే అవకాశం

సీఎం కేసీఆర్‌పై నమ్మకం ఉంది



''సీఎం కేసీఆర్ కుటుంబంతో నాకు ఎప్పటినుంచో అనుబంధం ఉంది. ఆయన నర్సాపూర్ టికెట్ నాకే కేటాయిస్తారు. కేసీఆర్‌పై పూర్తి భరోసా ఉంది. ఈ స్థానాన్ని ఎందుకు పెండింగ్‌లో పెట్టారో తెలియదు. దీనిపై నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు బాధపడుతున్నారు. సీఎం కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటా..''

– చిలుముల మదన్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా..



''నాకు టికెట్ ఇవ్వాలని మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలను కలసి విజ్ఞప్తి చేశాను. నర్సాపూర్ టికెట్ ఎందుకు ప్రకటించలేదో మాకు తెలియదు. పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటా..''

– సునీతా లక్ష్మారెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ నర్సాపూర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ టికెట్లను ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్.. నర్సాపూర్ టికెట్‌ను పెండింగ్‌లో పెట్టడం ఆ నియోజకవర్గంలో ఉత్కంఠ రేపుతోంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి ఇద్దరూ పార్టీ టికెట్ కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. ఇప్పుడీ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టడంపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మెదక్ జిల్లా పర్యటన తర్వాత..

నర్సాపూర్ టికెట్ తనకంటే తనకే ఇవ్వాలంటూ మదన్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి ఇప్పటికే పార్టీ పెద్దలపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. మదన్‌రెడ్డి రెండు రోజుల కింద మంత్రి హరీశ్‌రావును కలసి తనకు టికెట్ ఖరారు చేసేలా చూడాలని కోరారు. సునీత కూడా హరీశ్‌రావుతోపాటు, ఎమ్మెల్సీ కవితను కలసి టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. పార్టీలో సీనియర్ నాయకుడైన మదన్‌రెడ్డికి సీఎం కేసీఆర్‌తో స్నేహ సంబంధాలు ఉన్నాయని, అయితే ఆయన వయోభారం, ఆయన అనుచరులపై అక్రమ దందాల ఆరోపణలు ఇబ్బందికరంగా మారాయని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. సునీతకు టికెట్ ఇస్తే బీఆర్ఎస్‌ను వీడుతామని మదన్‌రెడ్డి వర్గీయులు అంటున్నారు. మరోవైపు నర్సాపూర్ టికెట్ ఇస్తామనే హామీతోనే సునీతా లక్ష్మారెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని ఆమె అనుచరులు పేర్కొంటున్నారు. ఈ నెల 23న సీఎం కేసీఆర్ మెదక్ జిల్లాలో పర్యటించనుండటంతో.. త్వరలోనే నర్సాపూర్ టికెట్ ఖరారు చేస్తారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

ఇద్దరూ కలిసే టీవీ చూస్తూ..

సోమవారం మదన్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి ఇద్దరూ నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూర్చునే.. బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటనను టీవీలో వీక్షించడం గమనార్హం. వీరితోపాటు ఎమ్మెల్సీ యాదవరెడ్డి మరికొందరు నేతలూ అక్కడ ఉన్నారు. నర్సాపూర్ టికెట్ ఎవరికి ప్రకటిస్తారోనని ఉత్కంఠతో అంతా ఎదురుచూశారు. కానీ పెండింగ్‌లో పెట్టడంతో టెన్షన్‌లో పడ్డారు.

'పల్లా'కు టికెట్ ఇస్తే అగ్నిగుండమే..!

- జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు
- హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలసిన నాయకులు

జనగామ: జనగామ బీఆర్ఎస్ టికెట్‌ను పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఇస్తే నియోజకవర్గం అగ్నిగుండంగా మారే పరిస్థితి ఉంటుందని ఈ ప్రాంతానికి చెందిన పలువురు నేతలు మంత్రి హరీశ్‌రావుతో అన్నట్లు తెలుస్తోంది. జనగామ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మసిఉర్ రెహమాన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, ముఖ్య నేతలు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిశారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తీసుకుని, అవసరమైతే రీసర్వేలు చేయించి 'పల్లా'కు కాకుండా.. గెలుపొందే అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని వారు మంత్రిని కోరారు. జనగామ టికెట్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కేటాయించినట్లు వస్తున్న ప్రచారంతో తామంతా అయోమయంలో ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ స్థానిక నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, 'పల్లా'కు టికెట్ కేటాయిస్తే బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న జనగామను విపక్షాలకు అందించే అస్త్రంగా మారిపోతుందని వారు సూచించినట్లు తెలిసింది. పార్టీ హైకమాండ్ ఆచితూచి జనగామ టికెట్‌ను ప్రకటించాలని వారు కోరారు. లేని పక్షంలో ఆందోళనలు ఆపడం ఎవరితరం కాదని ఆ నేతలు హరీశ్‌రావుకు చెప్పినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది.

ఆత్మాభిమానాలు దెబ్బతింటాయి

దయచేసి మా అందరితో సంప్రదించి, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి. లేనిపక్షంలో ఆత్మాభిమానాలు దెబ్బతింటాయి. ప్రజల ఆమోదం లభించదు. ఇది మనందరం తెలంగాణ ఉద్యమంలో నేర్చుకున్న మొదటిపాఠం. 'రాజకీయాలు ప్రజల కోసమే చేయాలి. పదవుల కోసం కాదు'అని మా నాన్న చెప్పిన మాటలు ప్రతీసారి స్మరించుకుంటున్నాను. నా తుదిశ్వాస వరకు ఆ పని చేస్తానని నా సన్నిహితులకు భరోసా ఇస్తున్నాను.

– చెన్నమనేని రమేశ్, వేములవాడ ఎమ్మెల్యే (సోషల్ మీడియాలో పోస్టు)

గులాబీ జెండానే నా అజెండా

సీఎం కేసీఆర్ గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించి మేలు చేశారు. ఇంకా ఎన్నో పథకాలు అమలుచేశారు. టికెట్ వచ్చినా, రాకున్నా గులాబీ జెండానే నా అజెండా. సీఎం కేసీఆర్ ప్రకటించిన మదన్‌లాల్ గెలుపు కోసం కృషి చేస్తా.. – రాములు నాయక్, వైరా ఎమ్మెల్యే

జనగామపై వీడని పీటముడి!

- హరీశ్‌రావు, కవితలను కలసిన 'ముత్తిరెడ్డి'.. తనకే అవకాశమనే ధీమా
- తమ వంతు ప్రయత్నాలు చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- కేటీఆర్ అమెరికా నుంచి వచ్చాకే స్పష్టత వస్తుందంటున్న బీఆర్ఎస్ వర్గాలు





ముత్తిరెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్: జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేదానిపై పీటముడి ఇంకా వీడలేదు. ఉమ్మడి వరంగల్‌లో 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్.. ఆ ఒక్క స్థానంపై కమిటీ మరోసారి సమావేశమై 25న నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. దీంతో జనగామ నుంచి బరిలో నిలిచే బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థిత్వం ఖరారుపై గడువు పెరిగిన నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు ఎవరికి వారుగా ప్రయత్నాలు మరింత ముమ్మరం చేశారు. వాస్తవానికి ఉమ్మడి వరంగల్‌లో స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారుస్తారనే ప్రచారం గత కొద్ది రోజులుగా సాగుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి పేరు వినిపించగా.. జనగామకు ఏడాదిన్నరగా పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేరే వినిపించింది. అయితే హఠాత్తుగా జనగామ నుంచి పోటీ చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అధిష్టానం హామీ ఇచ్చిందన్న ప్రచారం గందరగోళానికి దారితీసింది. ఇదే సమయంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అనుచరులు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో రహస్యభేటీ నిర్వహించగా.. అక్కడికి వెళ్లిన యాదగిరిరెడ్డి ఇది కరెక్టు కాదని పార్టీ నాయకులకు నచ్చజెప్పారు. ఆ తర్వాత ముత్తిరెడ్డి హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించి బలప్రదర్శన చేశారు. కాగా, సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం కేసీఆర్ అభ్యర్థుల పేర్లు ప్రకటించనున్నారన్న సమాచారం మేరకు ఉదయమే హైదరాబాద్‌కు వెళ్లిన ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితలను కలసినట్లు సమాచారం. అలాగే పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిల అనుచరులు సైతం హరీశ్‌రావును కలసి పరిస్థితిని వివరించినట్లు తెలిసింది. మరోవైపు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు కూడా వేర్వేరుగా పార్టీ పెద్దలను కలసినట్లు సమాచారం. దీంతో కేసీఆర్ ఈ స్థానంపై నిర్ణయాన్ని వాయిదా వేశారు. 25న ఎన్నికల కమిటీ మరోసారి భేటీ అయి అభ్యర్థి పేరును ఖరారు చేస్తుందని ప్రకటించారు. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.. ఫైనల్‌గా తనకే ఛాన్స్ ఉంటుందని చెపుతుండగా, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు సైతం ధీమాగా ఉన్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే అమెరికా పర్యటనలో ఉన్న పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ వచ్చాకే ఈ వివాదం పరిష్కారం అవుతుందన్న మరో వాదన పార్టీ ముఖ్యనేతల నుంచి వినిపిస్తోంది. 25న అభ్యర్థుల ఎంపిక కమిటీ భేటీ అయినప్పటికీ.. సెప్టెంబర్ 1న కేటీఆర్ వచ్చాకే ఈ ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉందని అంటున్నారు.

ఇకనైనా గుసగుసలు ఆపండి

- లేకపోతే ఊరుకోను.. ఇదే ఫైనల్ వార్నింగ్
- కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటన తరువాతనైనా తనపై గుసగుసలు ఆపాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సొంత పార్టీ నాయకులకు, సోషల్ మీడియాకు విజ్ఞప్తి చేశారు. తాను పార్టీ మారుతున్నానని, బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్నానని కొందరు పనిగట్టుకొని ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటన తరువాత అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గత కొన్నేళ్లుగా తనను అవమానాలకు గురి చేస్తున్నారని జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను సీతమ్మ లెక్క నిందలు ఎదుర్కొంటున్నా.. రాముల వారు పడ్డన్ని కష్టాలు పడుతున్నా. నాలుగేండ్ల వయసులోనే మా నాన్న చనిపోయాడు. అమ్మ జీతంతో రాజకీయాలు చేశా. అంతకు మించి నాకేం లేదు. మీడియా సమావేశంలో క్లారిటీగా చెప్పిన తరువాత కూడా కొందరు గుసగుస లాడుతున్నారు. వాళ్ళు ఈ విషయం తెలుసుకోవాలి. ఇప్పటికైనా అన్నీ బంద్ చేయాలి. ఇదే ఫైనల్ వార్నింగ్. ఇకపై ఊరుకోను. ఈసారి ఎవరైనా నన్ను నెగెటివ్ చేస్తే..పార్టీ అధిష్టానానికి, పీసీసీ, సీఎల్పీలకు కూడా ఫిర్యాదు ఇస్తా. లీగల్‌గా కూడా చర్యలు తీసుకుంటా. పరువునష్టం దావా వేస్తా..'అని జగ్గారెడ్డి హెచ్చరించారు. అప్పటికీ మారకపోతే తన అనుచరులకు అప్పగిస్తానని అన్నారు.



మనం వినే ప్రతిదీ ఒక అభిప్రాయమే. వాస్తవం కాదు.
మనం చూసే ప్రతిదీ ఒక దృక్కోణమే. సత్యం కాదు.
– మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 22 ఆగస్టు 2023

సమర సన్నాహాలు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎట్టకేలకు ప్రతిపక్ష పార్టీ సొంత గూటిలో సర్దుబాట్లతో సమరానికి సన్నద్ధమవుతున్నట్టుంది. పది నెలల నిరీక్షణ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆదివారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన తీరు చూస్తే అదే అనిపిస్తుంది. నిరుడు జాతీయ అధ్యక్షుడైన మల్లికార్జున ఖర్గే ఆచితూచి వ్యవహరిస్తూ, ఇన్నాళ్ళకు పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ' (సీడబ్ల్యూసీ)ని పునర్వ్యవస్థీకరించారు. సరికొత్త సీడబ్ల్యూసీపై గాంధీ కుటుంబ ముద్ర సుస్పష్టం. అయితే, ఒకపక్క విశ్వాసపాత్రులైన పాత కాపుల్ని కదిలించకుండానే, మరోపక్క కొత్త వారికీ, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారికీ, వివిధ సామాజిక వర్గాలకూ స్థానం కల్పించారు. ఇలా పార్టీలో నవనవోత్సాహాన్ని నింపేందుకు ప్రయత్నించడం స్వాగతనీయం. సోనియా కుటుంబానికి వీరవిధేయుడైనప్పటికీ, కేవలం డూడూబసవన్నలా ఖర్గే ఉండిపోలేదు. కొత్త కార్యవర్గంలో గాంధీ శిబిరం వారితో పాటు తన సొంత శిబిరం వారికీ చోటిచ్చారు. వివిధ సామాజిక వర్గాలకు చోటిస్తూ సమ తూకం సాధించడంతో ఈ కొత్త కార్యవర్గం రానున్న ఎన్నికల టీమ్ అని అర్థమవుతోంది.

సోనియా అధ్యక్ష కాలంలోని 2020 సెప్టెంబర్ తర్వాత సీడబ్ల్యూసీ ప్రక్షాళన మళ్ళీ జరగడం ఇప్పుడే! అనేక విడతల చర్చల తర్వాత కొత్త కమిటీ కొలువు తీరింది. 39 మంది శాశ్వత సభ్యులు, 18 మంది శాశ్వత ఆహ్వానితులు, 14 మంది రాష్ట్ర ఇన్–ఛార్జ్‌లు, నలుగురు సంస్థాగత ఇన్–ఛార్జ్‌లు, మరో 9 మంది ప్రత్యేక ఆహ్వానితులు – ఇలా మొత్తం 84 మంది సభ్యులతో మునుపెన్నడూ లేనంతటి అతి పెద్ద సీడబ్ల్యూసీ ఇది. పాత, కొత్తల మేలు కలయికగా ఏర్పాటైన వర్కింగ్ కమిటీలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంచడం హర్షణీయం. రాజస్థాన్‌లో సొంత పార్టీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి 2020లో పార్టీ రాష్ట్ర అధ్యక్షపదవి, ఉప ముఖ్యమంత్రి పదవి పోగొట్టుకున్న సచిన్ పైలట్‌కు కార్యవర్గంలో స్థానమివ్వడం, అలాగే నిరుడు పార్టీ అంతర్గత ఎన్నికల్లో అధ్యక్ష పీఠానికి ఖర్గేతో పోటీపడిన శశి థరూర్‌కు సైతం చోటివ్వడం ఆశ్చర్యకరమే. అలాగే, పార్టీకి సోనియా నాయకత్వాన్ని ప్రశ్నించిన జి–23 బృందంలోని అసమ్మతి నేతల్లో భాగమైన ఆనంద్ శర్మ, ముకుల్ వాస్నిక్‌లను సైతం కొత్త సభ్యులుగా తీసుకోవడం గమనార్హం. ఇది అవసరమైన రాజకీయ చాణక్యమే.

విభిన్న స్వరాలు వినిపించేవారిని సైతం విధాన నిర్ణయాలు తీసుకొనే వేదికలో భాగస్వాముల్ని చేయడం అంతర్గత ప్రజాస్వామ్యానికి సూచిక. 138 ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర గల ఒక పార్టీ సమకాలీన చైతన్యశీల ప్రస్థానానికీ, పురోగతికీ దీర్ఘకాలంలో అది కీలకం కూడా! ముఖ్యంగా ఈ ఏడాది చివరి కల్లా మిజోరమ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికలున్న వేళ ఆ ప్రాంతాలకూ ప్రాముఖ్యం, ప్రాతినిధ్యం ఇస్తూ ఈ పునర్వ్యవస్థీకరణ సాగడం గమనార్హం. ఎన్నికలున్న రాజస్థాన్‌లో అసమ్మతి నేత సచిన్ పైలట్‌కూ, అలాగే ఛత్తీస్‌గఢ్‌లో బలమైన ఫ్యాక్షన్ నాయకుడూ, ఓబీసీ అయిన మంత్రి తామ్రధ్వజ్ సాహూకూ పార్టీ అత్యున్నత వేదికలో చోటివ్వడం తక్షణ ప్రయోజనాలకు తప్పక పనికొస్తుంది. అలా చూస్తే, ఆలస్యమైనా ఖర్గే ఆలోచించి పావులు కదిపారనుకోవాలి. గత కమిటీలో ఒక్క ఓబీసీయే ఉంటే, ఈసారి ఆరుగురికి స్థానం దక్కడం, 9 మంది ఎస్సీలకూ, ఒక గిరిజన నేతకూ సీటివ్వడం... ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కూ, సామాజిక న్యాయానికీ కట్టుబడి ఉన్నామనే భావన కలిగించడానికీ కాంగ్రెస్‌కు ఉపకరిస్తుంది. అయితే, 15 మంది స్త్రీలకు స్థానం కల్పించినా, మహిళా సాధికారత మంత్రం పఠిస్తున్న పార్టీ ఈ సంఖ్యను మరింత పెంచుకోవడం అవసరం.

నిజానికి, సీడబ్ల్యూసీలో 50 ఏళ్ళ లోపు వారు 50 శాతమైనా ఉండాలన్నది లక్ష్యమని కాంగ్రెస్ కొంతకాలంగా చెబుతోంది. గత ఏడాది మేలో ఉదయ్‌పూర్‌లో జరిగిన చింతన్ శిబిర్‌లో, ఈ ఏడాది ఫిబ్రవరిలో రాయ్‌పూర్‌లో సాగిన పార్టీ ప్లీనరీలో ఆ మేరకు సంకల్పం కూడా చెప్పుకుంది. తాజా పునర్వ్యవస్థీకరణ ఆ లక్ష్యాన్ని చేరుకోలేదు. అయితే, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనతే లాంటి యువ నాయకత్వాన్ని సైతం ప్రత్యేక ఆహ్వానితులుగా చేర్చడం పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించే ప్రయత్నంగా భావించవచ్చు. సీడబ్ల్యూసీలో శాశ్వత సభ్యుల సంఖ్యను 23 నుంచి 35కు పెంచుతామని రాయ్‌పూర్ ప్లీనరీలో చెప్పిన పెద్దలు ఆ అవధిని మరింత పెంచి, 39 మంది శాశ్వత సభ్యులను తీసుకోవడమూ అనేక రాజకీయ అనివార్యతలకు అద్దం పడుతోంది. సీడబ్ల్యూసీకి ఎన్నికలు జరపకుండా, ఖర్గేయే నామినేట్ చేస్తారని నిర్ణయించిన పార్టీ ఇప్పటికి ఈ ఘట్టాన్ని పూర్తి చేసింది. వెరసి, కొత్త కార్యవర్గం కూర్పు కొంత సృజనాత్మక ధోరణిలో, మరికొంత రాజీ మార్గంలో పయనించిందని చెప్పక తప్పదు.

శశిథరూర్ పేర్కొన్నట్టు, సిద్ధాంతాలకు కట్టుబడిన కార్యకర్తలే ఏ పార్టీకైనా జీవనాడి. వారితో నిండిన పార్టీలు, కార్యవర్గాలే ప్రజాకాంక్షలను నెరవేర్చడంలో ముందడుగు వేయగలవు. సీడబ్ల్యూసీ కూర్పులో ఆ సంగతి ఖర్గే బాగానే గ్రహించారు. కానీ, సవాళ్ళు ముగిసిపోలేదు. అద్వానీ తర్వాత స్వతంత్ర భారతావనిలో ఏకకాలంలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా, లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతగా ఉన్న 81 ఏళ్ళ ఖర్గే ఎన్నికల బరిలోనూ కాంగ్రెస్‌ను తీరానికి చేర్చాలి. ఆ మధ్య దాకా నీరసించిన పార్టీ నిరుడు హిమాచల్‌లో, ఈ ఏడాది కర్ణాటకలో దక్కిన విజయాలతో తెరిపిన పడింది. ఆ విజయ పరంపరను కొనసాగించాలంటే అభ్యర్థుల ఎంపిక, ప్రచారవ్యూహాలు, 'ఇండియా' కూటమిలో ఇతర ప్రతిపక్షాలతో సంప్రతింపులు – ఇలా ఖర్గే చేతి నిండా పని ఉంది. సోనియా కుటుంబంతో సమన్వయం చేసుకుంటూనే ఆ పనిని ఆయన ఎంత సమర్థంగా నిర్వహిస్తారో చూడాలి. ఒక్కమాటలో అసలు ఆట ఇప్పుడే మొదలైంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.10.12 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** స్వాతి తె.4.37 వరకు (తెల్లవారితే బుధవారం), **వర్జ్యం:** ఉ.9.26 నుండి 11.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.40 వరకు, **అమృతఘడియలు:** రా.7.23 నుండి 9.05 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

మార్పు కోసం మార్పా?



విశ్లేషణ
అభిషేక్ సింఘ్వీ

భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య సంహిత పేర్లతో కేంద్ర ప్రభుత్వం మూడు బిల్లులను ప్రవేశపెట్టింది. క్రిమినల్ కేసుల విచారణలో జాప్యానికి దివ్యౌషధమని హోమ్ మంత్రి చెబుతున్న ఈ కొత్త చట్టాలు అసలుకే మోసం తెచ్చే ప్రమాదం ఉంది. పైగా పోలీస్ కస్టడీకి సంబంధించిన మార్పులు ఈ నాగరిక కాలానికి చెందినవి కావు. ఇంత భారీ మార్పులకు శ్రీకారం చుడుతున్న ఈ ముసాయిదా బిల్లులపై విస్తృత సంప్రదింపులు జరపలేదు. బ్రిటిష్ కాలపు చట్టాలను సంస్కరించాలంటే పారదర్శకత అవసరం. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న బిల్లులు చూస్తే అది సంస్కరణల కోసం కాకుండా... ఏదో కొత్తది చేయాలి కాబట్టి చేస్తున్నట్లు కనిపిస్తోంది.

భారతీయ శిక్షా స్మృతి, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రాసీజర్(నేర విచారణ ప్రక్రియ చట్టం), ఎవిడెన్స్ యాక్ట్‌ల సమూల ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మూడు బిల్లులను ఒక్క వారం వ్యవధిలో సంపూర్ణంగా విశ్లేషించామని ఎవరైనా అంటే వారు అత్యంత మేధావులైనా కావాలి లేదా మోసకారులైనా(ఫ్రాడ్) అయివుండాలి. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో 356 సెక్షన్లు ఉండగా, ఇరవై రెండింటిని రద్దు చేస్తున్నారు, 175 సెక్షన్లలో మార్పులు/చేర్పులు చేస్తున్నారు, కొత్తగా ఎనిమిది సెక్షన్లను చేరుస్తున్నారు. ఇక భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ ఎస్ఎస్)లో ఏకంగా 533 సెక్షన్లు ఉన్నాయి. మార్పులు/చేర్పులు చేస్తున్న సెక్షన్ల సంఖ్య 160, రద్దు చేస్తున్నవి తొమ్మిది, కొత్తగా ప్రవేశపెడుతున్నవి తొమ్మిది. భారతీయ సాక్ష్య సంహితలో 170 సెక్షన్లు ఉండగా, 23 సెక్షన్లలో మార్పులు/చేర్పులు చేస్తున్నారు, తొమ్మిదింటిని రద్దు చేస్తున్నారు, ఒక సెక్షన్ కొత్తగా చేరుస్తున్నారు. నేనైతే మేధావిని కాదు, మోసకారిని కూడా కాదని అనుకుంటున్నా. కాబట్టి, ఈ మూడు కొత్త బిల్లుల సంపూర్ణ విశ్లేషణ చేసే సాహసాన్ని ఇతరులకు వదిలేసి, కొన్ని అసాధారణ విషయాలు, మంచి అంశాలు మాత్రం ప్రస్తావిస్తాను.

అన్నింటికంటే ముందుగా... అత్యంత విచిత్రమైన అంశం గురించి చూద్దాం. దేశంలోని క్రిమినల్ కేసుల విచారణలో జాప్యానికి (ఐదు కోట్ల పెండింగ్ కేసుల్లో మూడింట రెండొంతులు క్రిమినల్ కేసులే) దివ్యౌషధమని హోమ్ మంత్రి చెబుతున్న కొత్త చట్టాలు అసలుకే మోసం తెచ్చే ప్రమాదం ఉండటం. ఈ మూడు చట్టాల్లోని మొత్తం 505 సెక్షన్లలో చేసిన మార్పులను దృష్టిలో పెట్టుకుంటే వీటిపై వాద ప్రతివాదనలు పెరిగిపోతాయి. ఇప్పటికే కేసుల భారంతో కునారిల్లుతున్న న్యాయస్థానాలకు ఇది అదనపు భారమవుతుంది. కొత్త సెక్షన్ల నేపథ్యంలో వాదనలను కొత్తగా వినిపించాల్సిన పరిస్థితి వస్తుంది. కొత్తవాటికి అలవాటు పడేంత వరకూ ఇది కొనసాగుతుంది కాబట్టి విలువైన కోర్టు సమయం వృథా అవడం గ్యారెంటీ. బహుశా కొత్త చట్టాల తయారీ కమిటీలో ఉన్న న్యాయవాదులు గానీ, నిపుణులు గానీ దీన్ని గమనించలేదేమో.

రెండో విషయం... చట్టాల్లో చేపట్టదలచిన మార్పుల గురించి విస్తృత స్థాయిలో చర్చించి ఉంటే సమస్య చాలావరకూ పరిష్కారమయ్యేది. పద్దెనిమిది నెలల కాలం పాటు పనిచేసిన ఈ కమిటీ ఇలాంటి చర్చలేవీ చేపట్టిన దాఖలాలు లేవు. మూడు లా కమిషన్ల నివేదికలపై, పలు సంస్థల సంప్రదింపులపై మాత్రమే కమిటీ ఆధారపడింది. కమిటీ సభ్యుల ప్రాతినిధ్యం కూడా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు తగిన విధంగా లేదు. పైగా ఇలాంటి ప్రక్రియలో అతి ముఖ్యమైన పారదర్శకత, జవాబుదారీతనం అన్నవి అస్సలు లేకుండా పోయాయి.



మూడో విషయానికి వద్దాం... ఈ కొత్త ప్రతిపాదనల్లో దేశద్రోహ నేరం ప్రభుత్వ మోసం మినహా మరోటి కాదు. గత ఏడాది సుప్రీం కోర్టు సెడిషన్ చట్టాల్లోని నిబంధనలపై దాదాపుగా స్టే విధించింది. అయితే కేంద్రం ఒక అఫిడవిట్ దాఖలు చేసి... సెడిషన్ చట్టాన్ని సమీక్షిస్తున్నాము కాబట్టి, ఆ ప్రక్రియ సాగుతున్నంత కాలం స్టే విధించవద్దని కోరింది. సర్వోన్నత న్యాయస్థానం ఈ ప్రకటనను నమోదు చేసింది. సెడిషన్ చట్టం తాలూకూ తీవ్రతను గణనీయంగా తగ్గించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు చర్యలు చెప్పకనే చెప్పాయి. అయితే కొత్త ప్రతిపాదనల్లో జరిగింది మాత్రం దీనికి పూర్తిగా విరుద్ధం.

ఈ ఏడాది జూన్‌లో న్యాయ కమిషన్ దేశద్రోహ చట్టాన్ని కొనసాగించాల్సిందిగా సిఫారసు చేసింది. ఆ వెంటనే ప్రభుత్వం భారత న్యాయ సంహితకు సంబంధించిన 150వ సెక్షన్‌ను ప్రవేశ పెట్టింది. మాటల గారడీతో పాత చట్టం కంటే మరింత నిరంకుశమైన చట్టాన్ని ప్రతిపాదించింది. సార్వభౌమత్వానికి, భారత ఐక్యతలకు భంగం కలిగించడం అన్న విషయాలకు మరింత విస్తృతమైన నిర్వచనాలను ఇచ్చింది. "ప్రభుత్వంపై ప్రేమ లేకపోవడం" అన్నదాన్ని మాత్రం తొలగించింది. దేశద్రోహ నేరాన్ని మోపేందుకు 1960లో సుప్రీంకోర్టు పెట్టిన పరీక్షను స్పష్టంగా తప్పించింది. కేవలం మాటలు మాత్రమే దేశద్రోహానికి కారణం కాజాలవనీ, హింసను ప్రేరేపించడం, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం కూడా ఉన్నప్పుడు మాత్రమే దేశద్రోహం చట్టం అమలవుతుందని సర్వోన్నత న్యాయస్థానం తెలిపిన విషయం గమనార్హం. కొత్త చట్టంలో వీటిని విస్మరించడం మాత్రమే కాకుండా... ఎలక్ట్రానిక్, ఆర్థికాంశాలను చేర్చింది. పైగా మాటలు, పుస్తకాలు, నాటకం, కథనం వంటి అంశాలకూ దేశద్రోహ నిర్వచనాన్ని అన్వయించింది.

నాలుగో అంశాన్ని చూస్తే... పోలీస్ కస్టడీకి సంబంధించిన మార్పులు ఈ కాలానికి చెందినవి కావు. ప్రస్తుతం పోలీస్ కస్టడీ కోరడం లేదా ఇవ్వడమనేది అదుపులోకి తీసుకున్న పదిహేను రోజుల్లో జరగాలి. అది కూడా గరిష్ఠంగా 15 రోజుల వరకే లభిస్తుంది. సైద్ధాంతికంగా చూస్తే పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు కూడా బెయిల్ లభించవచ్చు కానీ ఆచరణలో ఇలా జరగదు. పోలీసుల విచారణ కొనసాగుతూ ఉంటుంది కాబట్టి ఇది సిద్ధాంతానికి విరుద్ధమన్నమాట. ప్రతిపాదిత కొత్త చట్టాల్లో పోలీసు కస్టడీ అవధి 15 రోజులుగానే ఉంచినా అదుపులోకి తీసుకున్న తరువాత 40 రోజుల్లో ఎప్పుడైనా (పదేళ్ల వరకూ జైలుశిక్ష పడే కేసుల్లో) కోరవచ్చు. ఒకవేళ కేసులో పదేళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉంటే అరెస్ట్ అయిన 60 రోజుల్లో ఎప్పుడైనా కస్టడీ కోరవచ్చు. అంటే, కొత్త చట్టాల ప్రకారం కనీసం 40 లేదా 60 రోజుల వరకూ బెయిల్ వచ్చే అవకాశమే లేకుండా పోతుంది. నిందితులు పోలీసుల కస్టడీలో ఉండటం అవసరమని ప్రాసిక్యూషన్ వాదిస్తూనే ఉంటుంది. పరిస్థితిని మరింత దిగజార్చే విషయం ఇంకోటి ఉంది. పోలీస్ కస్టడీని 40 లేదా 60 రోజుల కాలంలో నేరుగా 15 రోజులు కాకుండా... అప్పుడప్పుడూ కొన్ని రోజుల చొప్పున కూడా కోరవచ్చు. పౌరుల సురక్ష అంటే ఇదా?

ఐదో అంశం... సామాజిక సేవ అంశాన్ని చేర్చారు. మంచిదే కానీ కొత్తదేమీ కాదు. కాకపోతే వ్యవస్థీకృతం చేయాల్సిన అవసరముంది. చిన్న చిన్న తప్పులకు మాత్రమే కాకుండా, మిగిలిన వాటికీ విస్తరించాల్సిన అవసరముంది. అయితే బీఎన్ ఎస్ఎస్‌లో దీనికి కొన్ని పరిమితులు విధించారు. విచిత్రమైన విషయం ఏమిటంటే... చిన్న చిన్న తప్పుల జాబితాలో క్రిమినల్ డిఫమేషన్‌ను చేర్చడం. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి ఇటీవలే ఈ క్రిమినల్ డిఫమేషన్‌ను తీవ్రమైన తప్పిదంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ కేసులోనే 135 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యుడు రాహుల్ గాంధీ తన సభ్యత్వాన్ని దాదాపుగా కోల్పోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే.

ఆరవ అంశం... ప్రతిపాదిత కొత్త చట్టాల్లో మూక హత్యలను చేర్చారు. మెచ్చదగిన విషయం. అయితే 2014 తరువాత ఈ రకమైన నేరాలు పెరిగేందుకు కారణమేమిటన్న విషయాన్ని చూడాలి. అలాగే ఇలాంటి నేరాల విచారణ పక్కాగా, రాజకీయ జోక్యం లేకుండా జరిగేందుకు అనువైన వాతావరణం ఉందా? అన్నది ప్రశ్న.

దురదృష్టవశాత్తూ ప్రతిపాదిత కొత్త చట్టాల విస్తృతి, లోతుపాతులను దృష్టిలో ఉంచుకున్నా... చిన్న చిన్న వివరాలను విస్మరించిన వైనాన్ని చూసినా ఇదంతా ఏదో ఒక తంతు పూర్తి చేయాలి కాబట్టి చేస్తున్నట్లుగా కనపడుతుంది. సంస్కరణలపై చిత్తశుద్ధి మాత్రం వ్యక్తం కాలేదు. 'ఎక్కడికి వెళ్తున్నావో తెలియనప్పుడు, ఏ దారీ నిన్ను ఎక్కడికి చేర్చదు' అని హెన్రీ కిసింజర్ చెప్పిన మాట నిజం!

వ్యాసకర్త ఎంపీ, మాజీ అదనపు సొలిసిటర్ జనరల్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నీడ నిజం



మీ నీడ మిమ్మల్ని పోలి ఉంటుంది. కానీ అదే సమయంలో అది ప్రతికూలమైనది. మీ నీడను తెలుసుకోవడమంటే మిమ్మల్ని మీరు తెలుసుకున్నట్టే.

– హరూకీ మురకామి, రచయిత

అనారోగ్య సమాజం



నేను చూస్తున్న ప్రతి రెండో, మూడో పేషెంట్‌కు ఫ్యాటీ లివర్ గ్రేడ్ 1, 2 దశ ఉన్నట్టు గమనిస్తున్నాను. ఆఖరికి ముప్పై ఏళ్ల యువకుల్లో కూడా! ఇది సమాజంలో సాధారణం అయిపోతోందా?

– ధ్రువ్ చౌహాన్, వైద్యుడు

ఎవరు బాధ్యులు?



తమ పౌరుల మీద, ఇతర ప్రపంచం మీద యూఎస్ బయో దాడికి పాల్పడిందని రష్యన్, చైనీస్ సైన్యాలు ఆరోపించాయి. 'కోవిడ్'నూ, 'టీకాల'నూ ఉత్పత్తి చేసిన బైడెన్–ఒబామా పెట్ కంపెనీ మెటాబయోటా గురించి వాళ్లు ప్రస్తావించారు.

– లిజ్ చర్చిల్, యాక్టివిస్ట్

ప్రత్యక్ష నరకం



పాకిస్తాన్‌లోని మైనారిటీలకు ఇప్పుడు అక్కడి పంజాబ్ ప్రాంతం ప్రత్యక్ష నరకంగా మారింది. మరో దైవదూషణ కేసు. ఏ విధమైన విచారణ, సాక్ష్యాధారాలూ లేకుండా ఓ మనిషిని కాల్చిచంపారు. ఆయన ఇంటిని దోచుకున్నారు. వస్తువులను ఇంట్లోంచి బయటకు విసిరేశారు.

– ఫరాజ్ పెర్వాయిజ్, క్రైస్తవ యాక్టివిస్ట్

నాకే వయసైందా?



నేను కాలేజీలో చదువుతున్నప్పుడు టామ్ క్రూజ్, షారుక్ ఖాన్, సన్నీ దేవల్ టాప్ స్టార్లుగా ఉండేవాళ్లు. ఇప్పుడు మా అబ్బాయి కాలేజీలో ఉన్నాడు– ఇప్పటికీ టామ్ క్రూజ్, షారుక్, సన్నీ దేవల్ స్టార్లుగానే ఉన్నారు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

బాధ్యతాయుత వ్యాపారం



ఒక వ్యాపారాన్ని నిర్మించడం అంటే, అది కేవలం లాభాల గురించే కాదు, జనాల గురించి కూడా. ఒక సానుకూల సంస్కృతిని పెంపొందించడం నీతిబోధలా వినబడొచ్చు గానీ అది వ్యాపారానికి కూడా మంచిది. సమగ్రత, బాధ్యతలతో మనం విజయానికి కట్టుబడదాం. సహ ఆంత్రప్రెన్యూర్లందరికీ ప్రపంచ ఆంత్రప్రెన్యూర్ల దినోత్సవ (ఆగస్ట్ 21) శుభాకాంక్షలు.

– హర్ష్ మరీవాలా, ఆంత్రప్రెన్యూర్

సాంకేతికంగా ఆపారా?



బ్యాంకుకు చెల్లించాల్సిన 56 కోట్ల రూపాయల బకాయి చెల్లించకపోవడంతో బీజేపీ ఎంపీ సన్నీ దేవల్ జుహూ ఇంటిని బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ–వేలం వేయడానికి సిద్ధమైందని నిన్న దేశానికి తెలిసింది. ఈ ఉదయం, ఇరవై నాలుగ్గంటల లోపలే, 'సాంకేతిక కారణాల వల్ల' ఆ వేలాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా వెనక్కి తీసుకుందని మళ్లీ దేశానికి తెలిసింది. ఈ సాంకేతిక కారణాలు తలెత్తడానికి కారణం ఎవరు?

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ఎంపీ

వృద్ధులు గౌరవంగా బతికేలా...

అరవై ఐదేళ్లు దాటిన వయోవృద్ధులను ప్రభుత్వం కాల్చేయాలి. ఔను మరి, ఈ దేశ నిర్మాణంలో పాలుపంచుకొన్నవారిని పట్టించుకోని ప్రభుత్వాలు ఈ పనైనా చేసి పుణ్యం కట్టుకోవాలి. ఈ అంశాన్ని ఎంపీ జయా బచ్చన్ కూడా పార్లమెంటులో లేవనెత్తారు. భారతదేశంలో సీనియర్ సిటిజన్‌గా ఉండటమే నేరం అన్నట్లు ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయి. దేశంలో సీనియర్ సిటిజన్లు 70 సంవత్సరాల తర్వాత వైద్య బీమాకు అర్హులు కారు. వారు ఈఎమ్ఐపై రుణం పొందలేరు. వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వరు. పనిచేసి బతుకుదామంటే ఎవరూ పని కూడా ఇవ్వరు. కాబట్టి మనుగడ కోసం తప్పనిసరిగా ఇతరులపై ఆధారపడవలసి వస్తోంది. కానీ, పదవీ విరమణ పొందేవరకూ వీరంతా అన్ని పన్నులూ, బీమా ప్రీమియమ్‌లూ చెల్లిస్తారు. సీనియర్ సిటిజన్స్ అయ్యాక కూడా పన్నులన్నీ కట్టాల్సిందే!

భారతదేశంలో సీనియర్ సిటిజన్ల కోసం ఎటువంటి పథకమూ లేదు. రైలు ప్రయాణానికి ఇచ్చే 50 శాతం రాయితీ కూడా నిలిచిపోయింది. మరో వైపు రాజకీయాలలో ఉన్న సీనియర్ సిటిజన్లకే కాదు, కుర్రవాళ్లకు సైతం వాళ్లు ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపీ లేదా మంత్రి అయితే చాలు జీవితాంతం పెన్షన్‌తో సహా అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది కేంద్రప్రభుత్వం. ఎవరో కొద్ది మంది రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప చాలా మందికి ఇటువంటి ప్రయోజనాలు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదు. పిల్లలు పట్టించుకోకపోతే ఈ వృద్ధుల పరిస్థితి ఏమిటో ఒకసారి ఊహించండి. వారు ఎక్కడికి వెళ్లాలి? ఇవ్వాళ ఇది బాధామయమైన, భయంకర సమస్య.

సీనియర్ సిటిజన్స్‌కు కోపం వస్తే తమ ఓటు ద్వారా ఎన్నికల్లో ప్రభుత్వాలను మార్చగలరనేది గుర్తుంచుకోవాలి. ఇప్పటికే వారు ఎన్ని ప్రభుత్వాల పతనాలను చూడలేదు! అందుకే అన్ని రాజకీయ పార్టీలూ సీనియర్ సిటిజన్స్‌కు కల్పించే సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాలను తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలి. రైలు, బస్సు, విమాన ప్రయాణాలలో రాయితీలు కల్పించాలి. ఇన్సూరెన్స్ తప్పని సరిగా ఉండాలి. తుది శ్వాస విడిచే వరకూ ప్రీమియమ్ ప్రభుత్వాలే చెల్లించాలి. సీనియర్ సిటిజన్ల కోర్ట్ కేసులను తొందరగా పరిష్కరించడానికి చొరవ చూపాలి. ప్రతి నగరంలో అన్ని సౌకర్యాలతో 'సీనియర్ సిటిజన్ హోమ్'లను ఏర్పాటు చేయాలి. పదేళ్లువాడిన కార్ల నిషేధ నిబంధన వయో వృద్ధ పౌరుల విషయంలో సడలించాలి. ఈ నియమం వాణిజ్య వాహనాలకు మాత్రమే వర్తింపజేయాలి. ఈ కనీస సౌకర్యాలు, ప్రయోజనాలు కల్పించినప్పుడే వయోవృద్ధులు ఆత్మగౌరవంతో మలిదశ జీవితాన్ని ప్రశాంతంగా గడపగలరు. పెద్దలను గౌరవించాలన్న మన గొప్ప ప్రాచీన సంస్కృతిని ప్రభుత్వాలు కొనసాగించాలి.

– విశ్రాంత బ్రిగేడియర్ పోగుల గణేశం, సికింద్రాబాద్

వ్యవసాయంపైనా కృత్రిమ మేధ ప్రభావం



అభిప్రాయం
ఎస్. సీతారామయ్య

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వ్యవసాయ రంగంలోనూ అద్భుత ప్రయోజనాలు కలుగజేస్తోంది. మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఇప్పటికీ వ్యవసాయం వాటా దాదాపు 50 శాతం పైనే. ఇటువంటి వ్యవసాయ రంగంపై స్థిరంగా ఆధారపడి బతకడం కష్టమైన రోజుల్లో కృత్రిమ మేధ (ఏఐ) రైతుల్లో ఆశలు చిగురింపచేస్తోంది. మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజ్యూర్ ఓపెన్ ఏఐ' సర్వీస్ ద్వారా చాట్ జీపీటీ ఆధారంగా తయారైన 'జుగల్ బందీ' చాట్ బోట్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వేర్వేరు సంక్షేమ, సహాయ పథకాల వివరాలను అందిస్తుందీ సాఫ్ట్‌వేర్. వాట్సాప్ ద్వారా కూడా అందుకోగల ఈ చాట్ బోట్ ఇంగ్లీష్‌లో ఉన్న ప్రభుత్వ సమాచారాన్ని పది భాషల్లోకి అనువదించి మరీ రైతులకు అందిస్తూండటం విశేషం. నీరు, ఎరువులు, కీటక నాశినుల వంటి వాటిని అవసరమైనంత మాత్రమే వాడేలా చేసి పంట దిగుబడులు పెంచడం కోసం ఇది తోడ్పడగలదు.

వందేళ్ల వాతావరణ సమాచారం, మట్టి కూర్పు, పంటను ఆశించే చీడపీడలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వేసిన పంట ఎంత బాగా పండుతుంది అని కచ్చితంగా చెప్పగలదు. దీన్నే 'అంచనా విశ్లేషణ' (ప్రిడిక్టివ్ అనాలసిస్) అంటారు. ఒకవేళ నష్టం జరిగే అవకాశముంటే దాన్ని వీలైనంత తగ్గించుకునే సూచనలూ అందుతాయి.

వేర్వేరు మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించి విశ్లేషించడం, సొంతంగా పంటల తాలూకు సిమ్యులేషన్లు తయారు చేసుకుని అత్యున్నత సాగు పద్ధతులు, పంటలను అంచనా వేయడం సాధ్యమవుతుంది. జనరేటివ్ ఏఐ ద్వారా వ్యవసాయంలో వ్యర్థాలను గణనీయంగా తగ్గించగల 'ప్రిసిషన్ వ్యవసాయం' సాధ్యమవుతుంది. ఉదాహరణకు పంట పొలం మొత్తం తిరిగే డ్రోన్లు కలుపును గుర్తిస్తే అతితక్కువ కలుపు నాశినులతో వాటిని తొలగించే ప్లాన్‌ను కృత్రిమ మేధ అందివ్వగలదన్న మాట. అలాగే ఏయే మొక్కలకు నీరు అవసరం? వేటికి ఎండ కావాలన్న సూక్ష్మ వివరాలను కూడా ప్రిసిషన్ అగ్రికల్చర్ ద్వారా గుర్తించి అందించ



వచ్చు. ఉపగ్రహ ఛాయాచిత్రాలు, వాతావరణ సమాచారం, మట్టి కూర్పు వంటివన్నీ పరిగణించడం ద్వారా చేసే ప్రిసిషన్ అగ్రికల్చర్ వల్ల ఖర్చులు తగ్గుతాయి. దిగుబడులు పెరుగుతాయి.

జనరేటివ్ ఏఐని ఉపయోగిస్తే అధిక దిగుబడులిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకోగల వంగడాలను వేగంగా సృష్టించడం సాధ్యమని నిపుణులు చెప్తున్నారు. జన్యు సమాచారాన్ని విశ్లేషించి ఏ రకమైన జన్యువులను తొలగిస్తే, చేరిస్తే లాభదాయకమో ఈ కృత్రిమ మేధ వేగంగా గుర్తించగలదు. ఇప్పటికే బెంగళూరుకు చెందిన ఒక కంపెనీ సిద్ధం చేసిన 'కిసాన్ ఏఐ' (కిసాన్ జీపీటీ) పది భారతీయ భాషల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంబంధిత కార్యక్రమాలు, పథకాల వివరాలను అందిస్తోంది. దీంతో పాటే దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవసరమైన సలహా, సూచనలు ఇస్తోంది. ప్రతినెలా కనీసం 40 వేల మంది రైతులు కిసాన్ ఏఐ ద్వారా లబ్ధి పొందుతున్నట్లు దాన్ని అభివృద్ధి చేసిన ప్రతీక్ దేశాయ్ తెలిపారు.

'డిజిటల్ గ్రీన్' అనే అంతర్జాతీయ సంస్థ గూయి ఏఐతో జట్టుకట్టి వాతావరణ మార్పులను తట్టుకునేలా రైతులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఒడిశా వ్యవసాయ శాఖ 'అమాకృష్ ఏఐ' ద్వారా పంటల నిర్వహణలో రైతులకు సమాచారం అందిస్తోంది. ఇప్పటికే మిర్చి, పసుపు పంటల్లో నాణ్యతను తేల్చేందుకు కృత్రిమ మేధ ఆధారిత పరికరాలను వినియోగిస్తున్నారు. ఈ పంటలు ఏవైనా తెగుళ్లకు గురయ్యాయా? వాటిలోని రసాయనాల శాతం, రంగు, తేమ శాతం వంటి వాటిని నిమిషాల్లో తేల్చేస్తున్నారు. ఈ అంశాల ఆధారంగా మిర్చి, పసుపు పంటలకు గ్రేడింగ్ ఇస్తున్నారు. ముందు ముందు కృత్రిమ మేధ రైతుకు మరింత ప్రయోజనం చేకూరుస్తుందని ఆశిద్దాం.

నిప్పు, విద్యుత్తులు ఎలాగైతే మానవజాతి అభివృద్ధిని కీలక మలుపులు తిప్పాయో అలాగే కృత్రిమ మేధ కూడా అని అంటారు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్. మనిషీ యంత్రమూ చేయీ చేయీ కలిపి ఆడుతూ పాడుతూ పనిచేసే రోజులు వచ్చేశాయంటా రాయన.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు I 94409 72048

నిన్ను నీవు తెలుసుకో!

ప్రభాకరన్ ఓ హేతువాది. ఆధ్యాత్మిక విషయాలకు ఆయన బహుదూరం. ఓరోజు రాత్రి కలలో తన పై అధికారితో పాటూ భగవాన్ రమణ మహర్షి కనిపించారు. దీంతో ఒకరోజు రమణాశ్రమానికి వెళ్లారు. ఆశ్చర్యమేమిటంటే, ఆయన ఆశ్రమంలో అడుగు పెట్టగానే భగవాన్ చిరుమందహాసం చేశారు. అంతే ఆ క్షణమే ప్రభాకరన్ సాష్టాంగ నమస్కారం చేశారు. భగవాన్ చూసిన ఒక్క చూపుతో ఆయన భక్తుడిగా మారారు. వారి మధ్య ఆత్మబంధం ఏర్పడింది. ప్రభాకరన్ ఆశ్రమంలో ఉన్న రోజుల్లో ఆయన అడిగిన అన్ని ప్రశ్నలకూ భగవాన్ జవాబిచ్చారు.



జ్యోతిర్మయం

ఓమారు భగవాన్ ప్రభాకరన్‌ని చూసి 'నువ్వు ప్రభాకరన్ అని చెప్పుకుంటున్నావు. అయితే ఈ ప్రభాకరన్ ఎవరు? అని అడిగారు. 'ఎందుకు నువ్వు (ఈ దేహం మాత్రమే) ప్రభాకరన్ అని అనుకుంటున్నావు? మీ పెద్దలు నిన్ను ప్రభాకరన్ అని పిలిచారు. నువ్వు హేతువాదివై ఉండి కూడా దానినెలా ఒప్పుకుంటున్నావు. నీ హేతువాద జ్ఞానంతో నిజంగానే నువ్వు ఎవరు అని తెలుసుకోవడానికి ప్రయత్నించు. అప్పుడు నామరూపాలతో కూడిన ఈ ప్రభాకరన్ అదృశ్యమై నీ నిజమైన స్వరూపం తెలుస్తుంది. ఈ లౌకిక బంధాలన్నీ అనుభవించేది నేను అనే తప్పుడు ఆలోచన ఆ క్షణమే పోతుంది' అన్నారు. ప్రభాకరన్ భగవాన్ భక్తుడైన తర్వాత వంద పేజీల 'ప్రపత్తి శతకం' రాశారు. ఈ పుస్తకం మొదట్లోనే 'ఓ భగవాన్! భక్తి పరిపూర్ణతకు నా హేతువాద శక్తియో, ఆధ్యాత్మికతయో, మరేదో కారణం కాదు. నా మీద ప్రసరించిన మీ చూపులే కారణ'మని పేర్కొన్నారు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

భయంతోనే కేసీఆర్ గోషామహల్ టికెట్ ప్రకటించలేదు: రాజాసింగ్



అబిడ్స్: గోషామహల్ బీఆర్ఎస్ టికెట్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ తన భయంతోనే ప్రకటించలేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. మజ్లిస్ పార్టీ చెప్పిన వారికే గోషామహల్ బీఆర్ఎస్ టికెట్టు కేసీఆర్ ప్రకటిస్తారని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీకి బీఆర్ఎస్ తొత్తుగా వ్యవహరిస్తోందని రాజాసింగ్ తన వీడియో ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. గోషామహల్ నియోజకవర్గంలో రెండుసార్లు గతంలో గెలిచానని, ఈసారి కూడా తిరిగి విజయం తనదేనన్నారు. బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు ఒక్కటై ఎన్ని కుతంత్రాలు చేసినా తన విజయం ఆపలేరని చెప్పారు. మజ్లిస్ పార్టీ చేతిలో బీఆర్ఎస్ కీలు బొమ్మగా తయారైందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో మరోసారి తన సత్తాచాటి హ్యాట్రిక్ సాధిస్తానని రాజాసింగ్ ధీమా వ్యక్తం చేశారు.

గజ్వేల్ నుంచి తరిమేస్తారని అర్థమైనట్టుంది: షర్మిల



సాక్షి, హైదరాబాద్: గజ్వేల్ ఓటర్లు తన్ని తరిమేస్తారని దొరకు బాగా అర్థమైనట్టుంది. అందుకే ముందు జాగ్రత్తగా రెండో స్థానం నుంచి పోటీ చేస్తున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. స్వయానా ముఖ్యమంత్రికే సొంత నియోజకవర్గంలో గెలుస్తాననే దమ్ము లేకపోవడం.. కేసీఆర్ పదేళ్ల దిక్కుమాలిన పరిపాలనకు నిదర్శనమని సోమవారం ట్విట్టర్ వేదికగా ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావనడానికి ఇది సంకేతమన్నారు. దొరగారు ఇన్నాళ్లూ గజ్వేల్ ప్రజలను కలిసింది లేదు..వాళ్ల గోసలు తెలుసుకున్నది లేదని, పేరుకు ముఖ్యమంత్రి నియోజకవర్గమైనా డబుల్ బెడ్రూం ఇండ్లు రాకపాయే..దళిత బంధు అందకపాయె అన్నారు. రాష్ట్రానికే ముఖ్యమంత్రిని అన్న అహంకారంలో గజ్వేల్‌కి తాను ఎమ్మెల్యేని అన్న సంగతి కేసీఆర్ ఏనాడో మరిచిపోయిండని ఆరోపించారు. ఆయనకు నిజంగా దమ్ముంటే.. తన పరిపాలన మీద తనకు నమ్మకం ఉంటే.. గజ్వేల్ నుంచే గెలిచి చూపించాలని షర్మిల సవాల్ చేశారు.

బీసీల చెవిలో 'గులాబీ' పువ్వు

- 27న ఓరుగల్లులో బీసీ రాజ్యాధికార గర్జన: దాసు సురేశ్



హన్మకొండ: బీసీల చెవిలో బీఆర్ఎస్ పార్టీ గులాబీ పువ్వు పెట్టిందని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో బీసీలకు అన్యాయం చేసిందన్నారు. 41 స్థానాల్లో 60 శాతం ఉన్న బీసీల జనాభాను పరిగణలోకి తీసుకోకుండా.. కేవలం 22 స్థానాల్లో మాత్రమే అవకాశం కల్పించి సీఎం కేసీఆర్ మోసం చేశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం బీసీల లెక్కలు చెప్పకపోయినా తాము ఏ స్థానాల్లో బలంగా ఉన్నామో తమకు తెలుసన్నారు. ఈ నెల 27న ఓరుగల్లులో స్థానిక సంస్థల బీసీ నేతలు, కుల సంఘాల నాయకులు, విద్యార్థి, ఉద్యోగ, వ్యాపార, ప్రజా ఉద్యమ సంఘాల నాయకులతో బీసీ రాజ్యాధికార గర్జన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చక్కెర ఫ్యాక్టరీ తెరిపించే పార్టీకే ఓటేద్దాం': జీవన్‌రెడ్డి



పంజగుట్ట (హైదరాబాద్): షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించడం అంటే రైతాంగానికి ఒక ఆత్మగౌరవం తెచ్చినట్లే అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో షుగర్ ఫ్యాక్టరీ తెరిపించే పార్టీకే ఓటు వేస్తామనే నినాదంతో ముందుకు పోవాలని, అది ఏ పార్టీ అయినా పరవాలేదని ఆయన పిలుపునిచ్చారు. ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కమిటీ సమన్వయకర్త తుల రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, రైతు సంఘం నాయకురాలు పశ్య పద్మ, పాశం యాదగిరి, ప్రొఫెసర్ దొంతు నర్సింహారెడ్డి, కన్నెగంటి రవి తదితరులు పాల్గొన్నారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్‌కు కల్పించే రాయితీ చక్కెరకు ఎందుకు కల్పించడంలేదో అర్థం కావడంలేదని, చెరుకు పంటతో ఎంతో లాభాలు వస్తాయని, వెయ్యి కోట్లు ఖర్చుచేస్తే 3 చెక్కర ఫ్యాక్టరీలను ఆధునిక టెక్నాలజీతో పునఃప్రారంభించవచ్చునని తెలిపారు. కోదండరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అర్థంపర్థంలేని నిబంధనలు పెడుతూ వైవిధ్యమైన పంటలను నాశనం చేసిందన్నారు. నాలుగు చెక్కర ఫ్యాక్టరీల ఉద్యోగులను, రైతులను ఐక్యం చేసి త్వరలోనే ఒక రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేద్దామని, త్వరలో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వంలో చలనం వచ్చే అవకాశం ఉందన్నారు.

కంగుతిన్న కామ్రేడ్లు...!

- పొత్తుపై బీఆర్ఎస్ స్పందించకపోవడం, సీట్లు కేటాయించకపోవడంపై తీవ్ర ఆగ్రహం
- నేడు భవిష్యత్ కార్యాచరణపై చర్చ
- విడివిడిగా, కలివిడిగా వామపక్షాల సమీక్షలు
- కాంగ్రెస్‌తో దోస్తీకి ప్రయత్నం



సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఉప ఎన్నికల వేళ బీఆర్ఎస్‌తో చిగురించిన వామపక్షాల పొత్తు అంతలోనే వాడిపోయింది. రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కొనే దమ్మున్న పార్టీ కేవలం బీఆర్ఎస్ మాత్రమే అని విశ్వసించిన కమ్యూనిస్టు పార్టీలు బీఆర్ఎస్ అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల ప్రకటనతో కంగుతిన్నాయి. మునుగోడు ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌తో కమ్యూనిస్టుల పొత్తు కొనసాగుతుందని చెప్పారు. తీరా ఇప్పుడు వామపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించడంపై వామపక్షాల నాయకులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో బీఆర్ఎస్‌తో పొత్తులేదని స్పష్టం కావడంతో ఎలక్షన్లకు ఎలా సన్నద్ధం కావాలో తేల్చుకునేందుకు వామపక్షాలు తర్జనభర్జన పడుతున్నాయి.

కార్యాచరణపై సమావేశాలు

బీఆర్ఎస్ వైఖరితో కంగుతిన్న సీపీఎం, సీపీఐ పార్టీ లు భవిష్యత్ కార్యాచరణ కోసం మంగళవారం సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించాయి. ఇందులోభాగంగా సీపీఎం, సీపీఐ రాష్ట్ర పార్టీ కార్యాలయాల్లో ముఖ్యనేతలతో చర్చలు జరిపి ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ముందుగా రెండు పార్టీలు విడివిడిగా సమావేశమైన తర్వాత ఉమ్మడి గా సమావేశాలు నిర్వహించాలని యోచిస్తున్నాయి. ఇందులో భాగంగా మేథోమథనానికి సిద్ధమయ్యా యి. ఏదేమైనా ఈసారి కలిసి ఉండాలని నిర్ణయించుకున్న వామపక్ష పార్టీలు అతి త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

టార్గెట్ బీజేపీ: వామపక్షాల ప్రధాన ప్రత్యర్థి బీజేపీ. దేశంలో బీజేపీని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకత్వం కాంగ్రెస్‌తో జతకట్టింది. కానీ రాష్ట్రంలో బీజేపీని గట్టిగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర నాయకత్వం బీఆర్ఎస్‌తో కలిసి నడిచింది. మునుగోడు ఎన్నికల్లో బీజేపీని ఎదిరించడంలో వామపక్షాల పాత్ర కీలకంగా ఉందని, అందుకే పొత్తు పొడిచిందని కామ్రేడ్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆ పార్టీతో పొత్తు ముగియడంతో ప్రత్యామ్నాయ ప్రయత్నాలు సాగిస్తున్నాయి. దేశంలో జత కట్టిన కాంగ్రెస్‌తో ఇప్పుడు పొత్తులు కొనసాగించే అంశంపై నేటి సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ప్రత్యర్థి పార్టీతో పొత్తులు సాగించిన కామ్రేడ్లతో రాష్ట్ర కాంగ్రెస్ కలిసిపోతుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేసే కోణంలోనూ వామపక్ష నేతలు యోచిస్తున్నారు. బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందన్న సమయంలో తమకు మూడోవంతు సీట్లు కేటాయించాలని కా మ్రేడ్లు డిమాండ్ చేశారు. అయితే కాంగ్రెస్‌తో పొత్తు సమయంలో సీట్ల సంఖ్యను ఏమేరకు పరిమితం చేయాలనే అంశంపైనా చర్చించనున్నట్లు తెలిసింది. మరోవైపు పొత్తులు లేకుండా ఉమ్మడిగా పోటీ చేసే అంశంపైనా చర్చించనున్నారు. ఇప్పటివరకు చెరో పాతిక స్థానాల్లో పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సీపీఐ, సీపీఎంలు ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటాయో వేచిచూడాలి.

ఓటమి భయంతోనే 'కామారెడ్డికి' కేసీఆర్

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి ఖాయం
- బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటనపై ఎద్దేవా



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన.. సీజన్ రాకముందే కోయిల కూసింది అన్నట్లుగా ఉందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. ప్రత్యేక అభివృద్ధి పేరుతో గజ్వేల్ నియోజకవర్గంలో లెక్కలేనంత ఖర్చు పెట్టినా.. అక్కడ గెలిచే పరిస్థితిలేదనే కేసీఆర్ మరో చోటుకు వెళ్తున్నారని విమర్శించారు. ఈసారి గజ్వేల్‌లో ఓడిపోతున్నారనే సర్వే ఫలితాల భయంతోనే కేసీఆర్ కామారెడ్డికి పారిపోతున్నారని భట్టి అన్నారు. కేసీఆర్ రెండు చోట్ల పోటీ చేయాలన్న నిర్ణయంతోనే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతుందనేది అర్థం అవుతోందని.. బీఆర్ఎస్ నేతలు పార్టీలు మారుతారనే ఆందోళనలోనే కేసీఆర్ అభ్యర్థుల ప్రకటన ముందే చేశారని అన్నారు. సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన అనంతరం ఢిల్లీలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. కేసీఆర్‌కే గెలిచే పరిస్థితి లేకపోతే, ఆయన బొమ్మ పెట్టుకుని గెలిచే పరిస్థితి ఉంటుందా అని ప్రశ్నించారు. తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. గెలిచేది కాంగ్రెస్ పార్టీయేనని ధీమా వ్యక్తంచేశారు. ఏ లక్ష్యాలకోసం తెలంగాణ సాధించుకున్నామో.. ఆ లక్ష్యాలన్నీ కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఫిబ్రవరి, మార్చి నుంచే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టిందని.. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కాగా, సెల్ఫీ విత్ కాంగ్రెస్ అభివృద్ధి అనే కార్యక్రమంతో మరోసారి ప్రజల్లోకి వెళ్తామని.. కాంగ్రెస్ హయంలో చేసిన అభివృద్ధి పనులను సెల్ఫీ తీసుకొని ప్రజలతో పంచుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనతో నష్టపోయిన వారందరూ కాంగ్రెస్‌తో కలసిరావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

ఓటమి ఒప్పుకున్న కేసీఆర్!

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టంగా కనిపించిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను మధ్యాహ్నం 12.03 గంటలకు విడుదల చేస్తున్నట్లు ప్రచారం జరగగా, ఆ సమయంలో లిక్కర్ షాపుల డ్రా తీశారని ఎద్దేవా చేశారు. దీనిని బట్టి కేసీఆర్ ప్రాధాన్యత ఏంటో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని అన్నారు.

రుణమాఫీలో రూ.11 వేల కోట్లు మిగుల్చుకున్నారు

రుణమాఫీ పేరుతో కేసీఆర్ అతి తెలివితేటలు ప్రదర్శించారని రేవంత్ విమర్శించారు. రూ 99,999 వరకు మాత్రమే రుణమాఫీ చేసి రూ.11 వేల కోట్లు మిగుల్చుకున్నారని ఆరోపించారు. ఒక్క రూపాయే తేడా అని అందరూ అనుకుంటున్నారు కానీ.. దానివల్ల వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

కాంగ్రెస్ హయాంలోనే పూర్తి రుణమాఫీ జరిగిందని రేవంత్ చెప్పారు. రూ.75 ఉన్న పింఛన్‌ను రూ.200కు పెంచింది కాంగ్రెస్సేనన్నారు. '50 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసింది అని కేసీఆర్ అంటున్నారు. నాగార్జునసాగర్ లాంటి ప్రాజెక్టులు మీ తాతలు కట్టారా? 12,500 గ్రామ పంచాయతీలకు కరెంట్ ఇచ్చింది కాంగ్రెస్ కాదా? చింతమడకలో బడి కట్టింది, ముఖ్యమంత్రి ఇంటికి కరెంటు ఇచ్చింది కాంగ్రెస్సే. ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో నిర్మించింది కాంగ్రెస్..'అని స్పష్టం చేశారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందో లెక్కలతో సహా చర్చకు సిద్ధమని ప్రకటించారు.


కమ్యూనిస్టులను కరివేపాకులా తీసేశారు..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రూ.4 వేల పెన్షన్ ఇస్తుందని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రగతి భవన్ గోడలమీద రాసుకోవాలని సవాల్ విసిరారు. ఏ పెద్ద ఒప్పందం జరిగినా, తర్వాత పది రోజులకు పెట్టుబడులు పెట్టేందుకు మంత్రి కేటీఆర్ విదేశాలకు వెళ్తారని విమర్శించారు. సూర్యాపేట సభలో శ్రీకాంత చారి తల్లిని నిలబెట్టి కేసీఆర్ అవమానించారని అన్నారు. కమ్యూనిస్టులను కరివేపాకులా తీసి పారేశారని ధ్వజమెత్తారు. మోసానికి గురైన కమ్యూనిస్టులు కేసీఆర్‌పై తిరుగుబాటు చేయాలని అన్నారు.

పార్టీలో చేరికలు

బాన్సువాడ, వర్ధన్నపేట, ముధోల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పలువురు సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

తెలంగాణలో ఒంటరిగానే పోటీ



సాక్షి , హైదరాబాద్: తెలంగాణలో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని, తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం ఆయన తన నివాసంలో తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో నిర్వహించే బస్సు యాత్ర, వచ్చే ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, తెలంగాణలో రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీతోనూ తెలంగాణలో కలసి పోటీ చేసే పరిస్థితి లేదని, ఒంటరిగా పోటీ చేయడానికే సిద్ధపడాలని నాయకులకు సూచించారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో హైదరాబాద్ వృద్ధి చెందిందని, దేశంలో మొట్టమొదటిసారిగా ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. తెలంగాణలో టీడీపీ ఉండడం చరిత్రాత్మక అవసరమని, రాష్ట్రంలో పార్టీ గెలవాలని అన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చూసినా టీడీపీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను నేటికీ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. త్వరలోనే అందరితో మాట్లాడి అభ్యర్థుల జాబితా ప్రకటనకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఓట్ల పండగ.. ఉపాధి మెండుగా

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్యోగులను పలు కంపెనీలు తాత్కాలికంగా నియమించుకునే వీలుందని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా, టీమ్‌లీజ్, లింక్డ్‌ఇన్ వంటి సంస్థలు అంచనా వేశాయి.

పొలిటికల్ సర్వేల సారాంశమిది

దేశవ్యాప్తంగా అన్ని పార్టీలూ ప్రచార జోరు పెంచాయి. పార్టీలు, నిలబడే అభ్యర్థులు సర్వేలు చేయించి పరిస్థితిని విశ్లేషించుకోవడంలో మునిగారు. ఆన్‌లైన్ విధానంలో సాగే సర్వేల కోసం యువత అవసరం ఉంది. దీనికితోడు కార్యాలయంలోనే కూర్చుని క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వగల సరికొత్త సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లనూ రూపొందిస్తున్నారు. సర్వే ఫలితాలను విశ్లేషించి నివేదిక (అనలిటికల్ రిపోర్టు) ఇవ్వడమూ ముఖ్యమే. బలాలు, బలహీనతలను పసిగట్టేలా.. ఓటర్ల మనోగతం తెలుసుకునేలా ఆన్‌లైన్ సర్వే అప్లికేషన్లను రూపొందించాల్సి ఉంటుంది. ఇందుకు ఐటీ ఉద్యోగుల అవసరం ఉంటుంది. ఇప్పటికే దేశంలో పెద్ద ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థలైన కేపీఎంజీ, డెలాయిట్, ఈవై, పీడబ్ల్యూసీ వంటి సంస్థలు నియామకాల కోసం ప్రకటనలు ఇస్తున్నాయి. ఈ ఏడాది ద్వితీయార్థంలో కనీసం 80వేల మంది ఐటీ ప్రొఫెషనల్స్ అవసరం ఉండొచ్చని ఈ కంపెనీలు అంటున్నాయి.

డిజిటల్ రంగం తళుకులు

ఎక్కడో ఒకచోట మాట్లాడితే.. దేశమంతటా ప్రచారం కావాలని పార్టీలు కోరుకుంటున్నాయి. దీన్ని సాకారం చేయగల సత్తా డిజిటల్ మీడియాకే ఉంది. గత ఐదేళ్లుగా వర్చువల్ రియాలిటీకి ప్రాధాన్యం పెరిగింది. ఇందుకోసం ఆధునిక పరికరాలు, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు వస్తున్నాయి. సెల్‌ఫోన్లు సహా ఓటర్ వాడే ప్రతి డిజిటల్ మీడియాకు పార్టీలను తీసుకెళ్లడం అవసరంగా మారింది. ఇందుకోసం డిజిటల్ రంగ నిపుణుల ఆవశ్యకత పెరిగింది. దీనికి అనుగుణంగా విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని నిపుణులు అంటున్నారు. ఇక ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం వంటి మాధ్యమాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఫొటోలు, వీడియోలు రూపొందించడం, ఎడిట్ చేయడం, వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయడం వంటి సాంకేతిక అనుభవం ఉన్న వారికి భారీగా ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. టెక్ విభాగాల్లో డెవలపర్స్, క్లౌడ్‌టెక్, సైబర్ సెక్యూరిటీ, మొబిలిటీ సైన్స్, వర్చువలైజేషన్, అనలిటిక్స్ వంటి నిపుణులకు ఎన్నికల సీజన్‌లో మంచి వేతనాలతో ఉపాధి ఉండే వీలుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఉద్యోగాల 'పండుగ'

దేశంలో ఆగస్టు నుంచి వరుసగా పెద్ద పండుగలు ఉంటాయి. ఓనమ్, రక్షాబంధన్, జన్మాష్టమి, గణేశ్ నవరాత్రులు, దుర్గాష్టమి, దసరా, దీపావళి, క్రిస్మస్, 2024 కొత్త సంవత్సరం.. ఇలా పండుగలతో కొనుగోళ్లు పెరుగుతాయి. ఈ క్రమంలో రిటైల్, బ్యూటీ, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, ఈ-కామర్స్, లాజిస్టిక్స్ వంటి రంగాల కంపెనీలు.. భారీగా తాత్కాలిక నియామకాల కోసం ప్రయత్నిస్తున్నాయి. మ్యాన్‌పవర్ గ్రూప్ అంచనాల ప్రకారం.. రిటైల్ అమ్మకాలు, సహాయక సిబ్బంది, గిడ్డంగుల్లో పికర్స్, ప్యాకర్స్, డెలివరీ సిబ్బంది, వినియోగదారుల రుణాల కంపెనీల వద్ద ఎగ్జిక్యూటివ్‌ల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ తరహా ఉద్యోగాలు గత ఏడాది కన్నా ఈసారి 25 శాతం ఎక్కువగా ఉంటాయని, సుమారు 2 లక్షల మంది అవసరం ఉండొచ్చని టీమ్‌లీజ్ సంస్థ అంచనా వేసింది.

నైపుణ్యాలు ముఖ్యం

ఇవి తాత్కాలిక ఉద్యోగాలే అయినా మంచి అవకాశాలే. నిరుద్యోగులకు అనుభవం సంపాదించి పెడతాయి. అనలిస్టులు, ఐటీ నిపుణులకు అవసరమైన పరిజ్ఞానం ఉంటేనే కంపెనీలు ప్రాధాన్యమిస్తాయి. ముఖ్యంగా మాథ్స్‌పై పట్టు ఉన్న వారు రాణించగలరు. ఈ అనుభవం మున్ముందు కూడా దోహద పడుతుంది.

– ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్

మంచి పనితీరు చూపితే పర్మినెంట్ కావొచ్చు

సీజన్‌లో అవసరం కోసం తీసుకున్న ఉద్యోగుల నైపుణ్యాలను కంపెనీలు పరిశీలిస్తాయి. మంచి పనితీరు, ప్రావీణ్యం చూపితే సీజన్ తర్వాత కొన్ని పరీక్షల ద్వారా శాశ్వత ఉద్యోగాల్లోకి తీసుకునే వీలుంది. అందువల్ల చేసే పనిలో ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్ ఉంటుంది.

– జావేద్, బహుళ జాతి సంస్థలో హెచ్‌ఆర్ నిపుణుడు

కాంగ్రెస్‌లోకి రేఖా నాయక్!

- నేడు మాణిక్‌రావు ఠాక్రేతో భేటీ కానున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే
- ఖానాపూర్‌లో మరోసారి టికెట్ ఇవ్వకపోవడంతో నిర్ణయం
- ఇప్పటికే రేవంత్ సమక్షంలో పార్టీలో చేరిన ఆమె భర్త శ్యాం నాయక్



రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యే రేఖా నాయక్ భర్త శ్యాం నాయక్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా రాజకీయ సమీకరణాలను మారుస్తోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లకు ఆ పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో వారిలో ఒకరైన ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. కాంగ్రెస్‌లో చేరాలని ఆమె నిర్ణయించుకొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో భేటీ కానున్నారు. ఈ పరిణామాల్లో భాగంగానే.. ఎమ్మెల్యే రేఖా నాయక్ భర్త, మాజీ రవాణా శాఖ అధికారి శ్యాం నాయక్ సోమవారం రాత్రే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆయనకు ఆసిఫాబాద్ టికెట్టు ఖరారైనట్లు సమాచారం. రేఖా నాయక్‌ను కూడా కాంగ్రెస్‌లో చేర్చుకొని ఖానాపూర్ సీటు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కాగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో బోథ్, ఆసిఫాబాద్ స్థానాలకు కూడా బీఆర్ఎస్ అభ్యర్థులను మార్చింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఆదిలాబాద్ పార్లమెంటు సీటు ఇస్తామని చెప్పినా.. ఆయన కూడా అసంతృప్తితోనే ఉన్నట్లు సమాచారం. సక్కు గత ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి గెలిచి వెంటనే బీఆర్ఎస్‌లో చేరారు. ఇలావుండగా బోథ్ ఎమ్మెల్యే బాపూరావు రాథోడ్‌కు కూడా ఈసారి బీఆర్ఎస్ టికెట్ దక్కలేదు.

రుణమాఫీలో రికార్డు

- ఎస్ఎల్‌బీసీ భేటీలో మంత్రి హరీశ్‌రావు
- పదేళ్ల కాలంలో రెండుసార్లు రైతులకు పంట రుణాలు మాఫీ
- ఇప్పటివరకు రూ.16.66 లక్షల మంది ఖాతాల్లో రూ.8,098 కోట్లు జమ



ఎస్ఎల్‌బీసీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో హరీశ్ రావు

సాక్షి, హైదరాబాద్: రైతుల పక్షాన నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం కేవలం తెలంగాణలో మాత్రమే ఉందని, పదేళ్ల కాలంలో రెండుసార్లు రైతులకు పంట రుణాలు మాఫీ చేసి రికార్డు సృష్టించిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. కరోనా వల్ల రాష్ట్రానికి ఆదాయం తగ్గినప్పటికీ రైతుల ప్రయోజనం కోసం రుణమాఫీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. తాజాగా రాష్ట్రంలోని 37 లక్షల మందికి రూ.20,141 కోట్ల మేర రుణమాఫీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటి వరకు రూ.99,999 వరకు రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ అమలు చేశామని, రూ.16.66 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.8,098 కోట్లు జమ అయ్యాయని వివరించారు. రుణమాఫీ, రెన్యువల్ తీరును పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని, ఇందులో ఆర్థిక, వ్యవసాయ శాఖ కార్యదర్శులు, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు ఉంటారని తెలిపారు. సోమవారం బేగంపేటలోని వివాంటా హోటల్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం(ఎస్ఎల్‌బీసీ) జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు.

ఆ ఘనత ముఖ్యమంత్రిదే..!

దేశంలో పలు రాష్ట్రాలు రుణమాఫీ అంశంపై అనేక పరిమితులు విధించాయని, కానీ ఎలాంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మాత్రమే అని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ మినహా మరే రాష్ట్రం కూడా పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయలేదని పేర్కొన్నారు. రుణమాఫీతో రైతుకు భారీ ఊరట లభిస్తుందని అన్నారు. ఒకవేళ రైతు రుణ మొత్తాన్ని చెల్లించి ఉంటే ఆ మేరకు నగదును రైతుకు ఇవ్వాలని సూచించారు. కొందరు రైతులకు బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు వంటి పాత రుణాలు ఉండొచ్చని, ఇప్పుడు వచ్చిన డబ్బులను పాత అప్పు కింద జమ చేయకూడదని స్పష్టం చేశారు. రుణమాఫీ ప్రక్రియను నెలరోజుల్లోగా పూర్తి చేసేలా బ్యాంకులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. రైతు సంక్షేమం ధ్యేయంగా, ఆర్థిక భారాన్ని మోస్తూ రైతు రుణమాఫీని సీఎం కేసీఆర్ ప్రారంభించారని మంత్రి నిరంజన్ రెడ్డి చెప్పారు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే అభివృద్ధి సాధించలేమన్న అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి మార్చేశారని ప్రశంసించారు.

క్లుప్తంగా...

చేపలు తింటే ఐశ్వర్యారాయ్ లాంటి కళ్లే

మహారాష్ట్ర మంత్రి విజయ్‌కుమార్ గవిట్

ముంబై: ప్రతిరోజూ చేపలు తింటే ఐశ్వర్యారాయ్ లాగా అందమైన, సొగసైన కళ్లు పొందవచ్చని మహారాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్‌కుమార్ గవిట్ వ్యాఖ్యానించారు. నందర్బర్ జిల్లాలో ఓ కార్యక్రమంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. 'నిత్యం చేపలు తినేవారి చర్మం సున్నితంగా, నున్నగా మారుతుంది. కళ్లు వెలుగులు విరజిమ్ముతాయి. అప్పుడు ఎవరైనా సరే మీ వైపు ఆకర్షితులు కావాల్సిందే. సినీ నటి ఐశ్వర్యారాయ్ గురించి చెప్పాలంటే ఆమె మంగళూరులో సముద్రం ఒడ్డున నివసించారు. చేపలు బాగా తినేవారు. ఆమె కళ్లను మీరు గమనించారా? మీరూ చేపలే రోజూ తింటే ఐశ్వర్యారాయ్ లాంటి కళ్లను పొందవచ్చు' అని గవిట్ చెప్పారు.

కిల్లర్ నర్సుకు జీవితకాల జైలు శిక్ష

లండన్: చిన్నారుల సీరియల్ కిల్లర్ నర్సు లూసీ లెట్బీ(33)కి బ్రిటన్ కోర్టు జీవితకాల జైలు శిక్ష విధించింది. కౌంటెస్ ఆఫ్ చెస్టర్ హాస్పిటల్‌లో పనిచేసే లూసీ 2015 జూన్, 2016 జూన్ మధ్య కాలంలో ఏడుగురు నవజాత శిశువులను పొట్టనబెట్టుకోవడంతోపాటు మరో ఆరుగురు పసికందుల హత్యకు యత్నించినట్లు ఆరోపణలొచ్చాయి. వీటిపై 10 నెలలపాటు విచారణ చేపట్టిన మాంచెస్టర్ క్రౌన్ కోర్టు జడ్జి జస్టిస్ జేమ్స్ సోమవారం ఈ మేరకు శిక్షను ప్రకటించారు. మిగిలిన జీవితకాలమంతా ఆమె కటకటాల వెనుకే గడపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదే ఆమెకు సరైన శిక్ష అని పేర్కొన్నారు. భారత సంతతికి చెందిన పిల్లల వైద్యుడు డాక్టర్ రవి జయరాం ఆస్పత్రి అధికారులను అప్రమత్తం చేయడంతో లూసీ దారుణాలు వెలుగులోకి వచ్చింది.

వరిసాగు పైపైకి.. పప్పు ధాన్యాలు కిందకి

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలు, పెరిగిన భూగర్భ జలాల లభ్యత కారణంగా వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గత ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు దేశ వ్యాప్తంగా 3.45 కోట్ల హెక్టార్లుగా ఉంటే ఈ ఏడాది అది 15 లక్షల హెక్టార్లు (4 శాతం) మేర పెరిగి 3.60 కోట్ల హెక్టార్లకు చేరిందని కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. అయితే ఈ ఏడాది పప్పుధాన్యాల సాగు మాత్రం 6 శాతం మేర తగ్గింది. గత ఏడాది మొత్తంగా పప్పుధాన్యాల సాగు 1.26 కోట్ల హెక్టార్ల మేర ఉంటే అది ఈ ఏడాది 12 లక్షల హెక్టార్ల మేర తగ్గి 1.14 కోట్ల హెక్టార్లకు పరిమితం అయ్యిందని వివరించింది. ముఖ్యంగా కందుల సాగు బాగా తగ్గిందని వెల్లడించింది.

చల్లగా చావు దెబ్బ

అత్యాధునిక కూలింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసిన చైనా?

- 'లేజర్'ఆయుధాలను వెడెక్కనీయదు
- నిజమైతే యుద్ధ రీతుల్లో సమూల మార్పులు
- నిత్యం యుద్ధానికి సిద్ధంగా ఉంచుతుంది



అంతరిక్ష యుద్ధంలో చైనా నానాటికీ దూసుకుపోతోంది. ఇంధన ఆయుధ పరిజ్ఞానంలో అతి గొప్ప పురోగతి సాధించినట్లు చైనా సైన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. కనీ వినీ ఎరుగని అత్యాధునిక కూలింగ్ సిస్టం ఒకదాన్ని కనిపెట్టినట్టు చంగ్‌షాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు ప్రకటించారు. అత్యంత హెచ్చు ఇంధన సామర్థ్యంతో కూడిన లేజర్లను పెద్దగా వేడెక్కనేయకుండా, నిరంతరం శక్తివంతంగా, ఎంతటి పెను దాడికైనా నిత్యం సిద్ధంగా ఉంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని వర్సిటీ వర్గాలను ఉటంకిస్తూ సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వార్తా సంస్థ ఒక కథనం వెలువరించింది. ఈ విధానం సఫలమైందన్న వార్త నిజమైతే చైనా అమ్ములపొదిలోని అత్యాధునిక ఆయుధాలు అతి శక్తివంతమైన లేజర్ కిరణాలను ఎప్పుడు కావాలంటే అప్పుడు విచ్చలవిడిగా ప్రయోగించగలవు. అప్పుడిక యుద్ధం తీరు తెన్నులే సమూలంగా మారిపోతాయని సంబంధిత వర్గాలు విశ్లేషించాయి. పరిశోధన వివరాలను చైనీస్ జర్నల్ ఆక్టా ఆప్టికా సైనికాలో ప్రచురితమయ్యాయి.

వేడే అసలు శత్రువు

ఇలాంటి అతి శక్తివంతమైన లేజర్ ఆయుధాలను ప్రయోగించే క్రమంలో భరించలేనంత వేడి ఉద్భవిస్తుంది. ఇది సదరు ఆయుధాలకే తీవ్రంగా నష్టం చేస్తుంది. దీంతో ఆయుధం పాడవకుండా ఉండేందుకు ఆ వేడిని సంపూర్ణంగా తట్టుకునే కూలింగ్ వ్యవస్థను కనిపెట్టినట్టు చైనా చెబుతోంది. లేజర్ ఆయుధాల అభివృద్ధిలో ఇలా వాటిని చల్లబరచడమే అతి పెద్ద సాంకేతిక సవాలు.

అమెరికా అప్పట్లోనే తయారు చేసినా...

ఇలాంటి అత్యాధునిక లేజర్ ఆయుధ వ్యవస్థల తయారీలో అమెరికా చాలాకాలంగా ఎంతో ముందుంది. నేవీ అడ్వాన్స్‌డ్ కెమికల్ లేజర్, మిడిల్ ఇన్ఫ్రా రెడ్ అడ్వాన్స్‌డ్ కెమికల్ లేజర్, టాక్టికల్ హై ఎనర్జీ లేజర్, స్పేస్ బేస్డ్ లేజర్ వంటివెన్నో ఇందులో ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో ప్రయోగించినప్పుడు అద్భుతాలు చేశాయి. శబ్ద వేగాన్ని మించి దూసుకుపోగల సూపర్ సానిక్ క్షిపణులను సైతం ధ్వంసం చేసి చూపించాయి. అయితే భారీ పరిమాణం, బరువు కారణంగా వాటిని అటకెక్కించారు. పైగా వాటి పరిధి మహా అయితే కొన్ని కిలోమీటర్లు మాత్రమే. కానీ లేజర్ కాంతి పుంజం విధ్వంసక శక్తిని ఎన్నో రెట్లు పెంచినట్లు లేజర్ కాంతిపుంజ ఆయుధాల శాస్త్రవేత్త యువాన్ బృందం చెబుతోంది.

స్పేస్ ఎక్స్ పైకీ ప్రయోగం?

కూలింగ్ సిస్టమ్ సాయంతో పనిచేసే ఈ అధునాతన లేజర్ క్షిపణి వ్యవస్థ సంప్రదాయ వ్యవస్థలతో పోలిస్తే చాలా చవకైనది. ఎంతో ప్రభావవంతమైనది కూడా. పైగా దీన్ని రీఛార్జ్ చేయాల్సిన అవసరం ఉండదు. అవసరమైతే స్పేస్ ఎక్స్ తాలూకు స్టార్ లింక్ వంటి ఉపగ్రహ వ్యవస్థల పైకి ఈ లేజర్ ఆయుధాలను ప్రయోగించే యోచనలో చైనా ఉన్నట్టు చెబుతున్నారు.

హెచ్ యు ఇంధన సామర్థ్యంతో కూడిన లేజర్ ఆయుధాల ప్రయోగం విషయంలో ఇది నిజంగా ఒక గొప్ప ముందడుగు

-లేజర్ కాంతి పుంజ ఆయుధాల శాస్త్రవేత్త యువాన్ షెంగ్ ఫు

'భరించలేనంత వేడిని నిరోధించగలిగామని చైనా చెబుతున్న దాంట్లో ఏ మాత్రం నిజమున్నా ఇది నిస్సందేహంగా అతి పెద్ద ముందడుగే. ఎందుకంటే అమెరికా విఫలమైంది సరిగ్గా ఈ విషయంలోనే'

- బ్రిటిష్ సైనికాధికారి స్టీవ్ వీవర్

-సాక్షి, నేషనల్ డెస్క్

2014కు ముందు సర్వం అవినీతి, కుంభకోణాలమయం

పేదల హక్కులను, సంపదను దోచుకున్నారు

- మేమొచ్చాక ప్రతి పైసా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే..
- ప్రజలు ఎగువ ఆదాయ వర్గంలోకి చేరుకుంటున్నారు
- టీచర్ల శిక్షణా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



భోపాల్: దేశంలో 2014కు ముందు మొత్తం అవినీతి, కుంభకోణాలే రాజ్యమేలాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పేద ప్రజల హక్కులను, సంపదను విచ్చలవిడిగా దోచుకున్నారని మండిపడ్డారు. పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన సొమ్ము వారికి చేరకుండా మధ్యలోనే లూటీ చేశారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చాక ఆ అరాచకానికి తెరపడిందని, ఇప్పుడు ప్రతి పైసా నేరుగా పేదల బ్యాంకు ఖాతాల్లోకే పంపిస్తున్నామని ఉద్ఘాటించారు. నీతి ఆయోగ్ నివేదికను ఆయన ప్రస్తావించారు. గత ఐదేళ్లలో ఏకంగా 13.50 కోట్ల మంది భారతీయులు దారిద్ర్య రేఖ దిగువ(పీబీఎల్) కేటగిరీ నుంచి బయటపడ్డారంటూ నీతి ఆయోగ్ ప్రకటించిందని గుర్తుచేశారు. దేశంలో పన్నులు చెల్లించేవారి సంఖ్య భారీగా పెరిగిందని అన్నారు. పన్నుల సొమ్మును మంచి పనుల కోసం, దేశ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్న నమ్మకం వారిలో కనిపిస్తోందని చెప్పారు. సోమవారం మధ్యప్రదేశ్‌లో కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. భోపాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. 'అమృతకాలంలో' తొలి సంవత్సరం నుంచే సానుకూల వార్తలు రావడం ఆరంభమైందని, దేశంలో సంపద వృద్ధి చెందుతోందని, పేదరికం తగ్గిపోతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్(ఐటీఆర్)లు దాఖలు చేసే వారి సగటు వార్షికాదాయం ఆదాయం 2014లో రూ.4 లక్షలు ఉండేదని, ఇప్పుడు అది రూ.13 లక్షలకు చేరిందని వెల్లడించారు. ప్రజలు దిగువ ఆదాయ వర్గం నుంచి ఎగువ ఆదాయ వర్గంలోకి చేరుకుంటున్నారని మోదీ తెలిపారు.

దేశమంతటా సానుకూల వాతావరణం

దేశంలో దాదాపు అన్ని రంగాలు బలోపేతం అవుతున్నాయని, అదే స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, నూతన ఉద్యోగాల సృష్టి జరుగుతోందని ప్రధాని చెప్పారు. 2014లో మన దేశం ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని, ఇప్పుడు ఐదో ఆర్థిక వ్యవస్థగా మారిందని చెప్పారు. కొత్తగా నియమితులైన 5,580 మంది ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది.

ఎనిమిదేళ్ల గర్విత్.. మిస్టర్ కూల్

లిఫ్ట్‌లో చిక్కుకుపోయి హోంవర్క్ చేసుకున్న ఫరీదాబాద్ బాలుడు

ఫరీదాబాద్: మనం వెళ్తున్న లిఫ్ట్ హఠాత్తుగా ఆగిపోతే ఏం చేస్తాం? ఒక్కసారిగా కంగారుపడతాం. కేకలు వేస్తాం. ఎప్పుడు బయటపడతామా అని క్షణక్షణం ఎదురుచూస్తాం. లిఫ్ట్ తలుపులు తెరుచుకుని క్షేమంగా బయటకువచ్చేదాకా ఆందోళన తగ్గదు. కానీ, హరియాణాలో లిఫ్ట్‌లో చిక్కుకుపోయిన ఎనిమిదేళ్ల బాలుడు గర్విత్ ఏమాత్రం టెన్షన్ పడకుండా రెండు గంటలపాటు చక్కగా హోంవర్క్ పూర్తిచేసుకున్నాడు. మిస్టర్ కూల్ అనిపించుకున్నాడు. హరియాణా రాష్ట్రం గ్రేటర్ ఫరీదాబాద్‌లోని సెక్టార్–86లో ఉన్న ఒమాక్సీ హైట్ సొసైటీ అపార్టుమెంట్ నాలుగో అంతస్తులో గర్విత్ తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం 5 గంటలకు ట్యూషన్ కోసం అదే అపార్టుమెంట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌కు లిఫ్ట్‌లో బయలుదేరాడు. రెండో అంతస్తుకు చేరుకోగానే లిఫ్ట్ ఆగిపోయింది. కాసేపు ఎదురుచూసినా లిఫ్ట్ కదల్లేదు. ఇక చేసేదిలేక హోంవర్క్ చేసుకోవడం ప్రారంభించాడు. గర్విత్ ఇంకా రాలేదంటూ ట్యూషన్ టీచర్ అతడి తండ్రి పవన్‌కు ఫోన్ చేసింది. దాంతో ఆందోళనకు గురైన పవన్ అపార్టుమెంట్ అంతటా గాలించడం మొదలుపెట్టాడు. రెండో అంతస్తుకు చేరుకొని బిగ్గరగా పిలవడంతో గర్విత్ స్పందించాడు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయానని బదులిచ్చాడు. రాత్రి 7 గంటలకు ఇతరుల సాయంతో లిఫ్ట్ డోర్లను బలవంతంగా తెరవగా, గర్విత్ నవ్వుతూ బయటకువచ్చాడు. హోంవర్క్ లిఫ్ట్‌లో పూర్తి చేసుకున్నానని చెప్పాడు. పిల్లాడి ధైర్యం చూసి అపార్టుమెంట్‌వాసులు ఆశ్చర్యపోయారు.

రేపే చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్

ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ప్రపంచ దేశాలు ● ల్యాండర్ మాడ్యూల్ చక్కగా పనిచేస్తోందని ఇస్రో ప్రకటన

బెంగళూరు/న్యూఢిల్లీ: ప్రపంచమంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న చంద్రయాన్–3 ల్యాండర్ కీలక ఘట్టానికి సమయం సమీపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే బుధవారం సాయంత్రం సరిగ్గా 6.04 గంటలకు ల్యాండర్ 'విక్రమ్' చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై కాలు మోపనుంది. సాయంత్రం 5.20 గంటల నుంచే ప్రత్యక్ష ప్రసారం ప్రారంభం కానుంది. ఎలాంటి విఘ్నాలు తలెత్తకుండా ల్యాండర్ క్షేమంగా చంద్రుడిపై దిగితే కేవలం భారతీయులకే కాదు, ప్రపంచానికి కూడా అదొక చిరస్మరణీయ ఘట్టమే అవుతుంది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ చరిత్రకెక్కుతుంది. అంతేకాదు చంద్రుడిపై భద్రంగా దిగిన నాలుగో దేశంగా రికార్డు సృష్టిస్తుంది. చంద్రయాన్–3 ల్యాండర్ మాడ్యూల్ ఇప్పటికే అక్కడ చంద్రుడి కక్ష్యలో పరిభ్రమిస్తున్న చంద్రయాన్–2 ఆర్బిటార్‌తో కమ్యూనికేషన్ ఏర్పర్చుకుందని ఇస్రో సైంటిస్టులు సోమవారం వెల్లడించారు. రెండూ పరస్పరం సంభాషించుకుంటున్నాయని తెలిపారు. 'వెల్‌కమ్, బడ్డీ!' అంటూ ల్యాండర్ మాడ్యూల్‌కు ఆర్బిటార్ స్వాగతం పలికిందని చెప్పారు. ఆర్బిటార్‌తో అనుసంధానం వల్ల ల్యాండర్ మాడ్యూల్ గురించి మరింత ఎక్కువ సమాచారం తెలుసుకోవడానికి వీలవుతుందని అన్నారు. ల్యాండర్ మాడ్యూల్ ప్రస్తుతం చక్కగా పనిచేస్తోందని, ఇప్పటికైతే ఎలాంటి అవరోధాలు కనిపించడంలేదని వెల్లడించారు. ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఢిల్లీలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్రసింగ్‌తో సమావేశమయ్యారు. ల్యాండర్ మాడ్యూల్ స్థితిగతులను ఆయనకు వివరించారు. ఈ మొత్తం ప్రయోగానికి సంబంధించిన అన్ని వ్యవస్థలూ బాగా పని చేస్తున్నాయని తెలిపారు.

లేదంటే 27వ తేదీన ల్యాండింగ్?

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): ల్యాండింగ్ విషయంలో ఇస్రో కీలక ప్రకటన చేసినట్లుగా తెలుస్తోంది. ల్యాండర్ మాడ్యూల్ ప్రస్తుతం చందమామకు అత్యంత సమీపానికి చేరుకుంది. ఇక ల్యాండింగే తరువాయి. ఈ నెల 23న సాయంత్రం 6.04 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడి ఉపరితలంపై క్షేమంగా దించడానికి ఇస్రో శాస్త్రవేత్తలు కసరత్తు చేస్తున్నారు. ల్యాండింగ్‌కు రెండు గంటల ముందు ల్యాండర్‌లో ఉన్న సైంటిఫిక్ పరికరాలతో చంద్రుడి ఉపరితలంపై పరిస్థితిని మరోమారు క్షుణ్నంగా సమీక్షిస్తామని ఇస్రో ప్రకటించింది. పరిస్థితి పూర్తి అనుకూలంగా ఉంటేనే ల్యాండ్ చేస్తామని వెల్లడించింది. ఒకవేళ అనుకూలంగా లేకపోతే ల్యాండింగ్ ప్రక్రియను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేయనున్నట్లు ఇస్రో అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. చంద్రయాన్–2, రష్యా లూనా–25 క్రాష్ ల్యాండింగ్ అయిన నేపథ్యంలో చంద్రయాన్–3 విషయంలో సైంటిస్టులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



ల్యాండర్‌మాడ్యూల్ తీసిన దక్షిణ ధ్రువం ఛాయాచిత్రం

దక్షిణ ధ్రువం చిత్రాలు విడుదల

ల్యాండర్ మాడ్యూల్‌లోని ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్ అండ్ అవాయిడెన్స్ కెమెరా(ఎల్‌హెచ్‌డీఏసీ) చిత్రీకరించిన చందమామ దక్షిణ ధ్రువం ఫొటోలను ఇస్రో విడుదల చేసింది. జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్ క్షేమంగా కాలు మోపడానికి ఈ కెమెరా తోడ్పడనుంది. రాళ్లు, గుంతలను ఫొటో తీసి, అవి లేని చోట ల్యాండర్ దిగడానికి అనువైన ప్రదేశాన్ని ఈ కెమెరా గుర్తిస్తుంది.

ప్రకాశ్‌రాజ్ పోస్టుపై రగడ

ముంబై: చంద్రయాన్–3 ప్రయోగాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ 'ఎక్స్'లో ఆదివారం చేసిన పోస్టు వివాదానికి దారితీసింది. ఆయనపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరుగుతోంది. చొక్కా లుంగీ ధరించిన ఓ వ్యక్తి టీ వడబోస్తున్న కార్టూన్ చిత్రాన్ని ప్రకాశ్‌రాజ్ పోస్టు చేశారు. కన్నడ భాషలో దీనికి వ్యాఖ్యను కూడా జతచేశారు. ''ఇప్పుడే అందిన వార్త. చంద్రయాన్ నుంచి మొదటి చిత్రం ఇప్పుడే వచ్చింది'' అని పేర్కొన్నారు. అయితే, అందులో టీ వడబోస్తున్న చాయ్‌వాలా ఎవరన్నది ప్రకాశ్‌రాజ్ బయటపెట్టలేదు. ఇస్రో మాజీ చైర్మన్ కె.శివన్‌ను ఎద్దేవా చేస్తూ ఈ పోస్టు పెట్టారని ప్రకాశ్‌రాజ్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. అయితే, ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకొని పోస్టు చేశారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సౌదీ సైన్యం కాల్పుల్లో వందలాది మంది మృతి !

దుబాయ్: సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించేందుకు యత్నించిన ఇథియోపియా వలసదారులపై సౌదీ బలగాలు జరిపిన కాల్పుల్లో వందలాదిమంది మృతి చెందినట్లు హ్యూమన్ రైట్స్ వాచ్ మంగళవారం తెలిపింది. సైన్యం మెషిన్ గన్లు, మోర్టార్లతో జరిపిన కాల్పుల్లో చనిపోయిన వారి సంఖ్య వందల్లో ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలను విడుదల చేసింది. యెమెన్ వైపు ఉన్న సరిహద్దు నుంచి వస్తున్న వలసదారుల పైకి సౌదీ బలగాలు కాల్పులు జరపడంపై ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. హ్యూమన్ రైట్స్ వాచ్ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తోందని సౌదీ అధికారి ఒకరు ఖండించారు. సౌదీలో ప్రస్తుతముంటున్న 7.50 లక్షల మంది ఇథియోపియన్ శరణార్థుల్లో 4.50 లక్షల మంది అనధికారికంగా ఉంటున్నవారే. ఇప్పటికే నిరుద్యోగ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సౌదీ ప్రభుత్వం వీరిని వెనక్కి పంపించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

మణిపూర్ రహదారులు మళ్లీ దిగ్బంధం

ఇంఫాల్: మణిపూర్‌లోని కాంగ్‌పోక్పిలో జాతీయ రహదారులపై కుకీలు తిరిగి నిరవధిక దిగ్బంధనం చేపట్టారు. రాష్ట్రంలోని కొండప్రాంతాల్లో నివాసం ఉంటున్న తమకు నిత్యావసరాలను సరిపడా అందజేయాలంటూ కుకీలకు చెందిన సదర్ హిల్స్ ట్రైబల్ యూనిటీ కమిటీ(సీవోటీయూ) డిమాండ్ చేసింది. నాగాలాండ్‌లోని దిమాపూర్‌ను ఇంఫాల్‌తో కలిపే రెండో నంబర్ జాతీయ రహదారితోపాటు ఇంఫాల్‌తో అస్సాంలోని సిల్చార్‌ను కలిపే 37వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం కుకీలు బైఠాయించారు. కాగా, పటిష్ట బందోబస్తు నడుమ నిత్యావసరాలతో కూడిన 163 వాహనాలు రెండో నంబర్ జాతీయ రహదారి మీదుగా ఇంఫాల్ వైపుగా వెళ్తున్నాయని పోలీసులు తెలిపారు. తమకు నిత్యావసరాలు, ఔషధాలు అందకుంటే ఈ నెల 26 నుంచి దిగ్బంధనం చేస్తామని కుకీ జో డిఫెన్స్ ఫోర్స్ హెచ్చరించింది. అల్లర్లకు సంబంధించి కుకీలపై నమోదైన కేసుల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని కోరుతూ కుకీ విద్యావంతులు లేఖ రాశారు.

'రేపిస్ట్' ఢిల్లీ అధికారి సస్పెన్షన్



ఖాఖా దంపతులు

న్యూఢిల్లీ: బాలికను అత్యాచారం చేసినట్లు ఆరోపణలున్న ఢిల్లీ ప్రభుత్వ అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. సదరు అధికారితోపాటు ఈ నేరంలో పాలుపంచుకున్నట్లు ఆరోపణలున్న ఆయన భార్యనూ సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రేమోదయ్ ఖాఖాను తక్షణమే సస్పెండ్ చేయాల్సిందిగా చీఫ్ సెక్రటరీని ఆదేశించినట్లు సీఎం కేజ్రీవాల్ తెలిపారు. ప్రేమోదయ్ ఖాఖా ఢిల్లీ మహిళా శిశు అభివృద్ధి శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇతని స్నేహితుడు 2020 అక్టోబర్‌లో చనిపోవడంతో స్నేహితుని కూతురును అప్పటి నుంచి తన ఇంట్లోనే ఉంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమెపై ఖాఖా పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. గర్భం దాల్చిన బాలికకు భార్య సాయంతో అబార్షన్ టాబ్లెట్లు వేయించారు. అనారోగ్యం పాలైన విషయం తెలిసి, వేరే చోట ఉంటున్న తల్లి వచ్చి బాలికను తీసుకెళ్లింది. బాలిక జరిగిన ఘోరాన్ని వెల్లడించడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఖాఖాను, ఆయన భార్యను ప్రశ్నించిన పోలీసులు అరెస్ట్ చేశారు.

రాజ్యసభ ఎంపీగా జైశంకర్ ప్రమాణం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జై శంకర్ సహా తొమ్మిది మంది ఎంపీలు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం పార్లమెంట్ హౌజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. 2019లో తొలిసారి రాజ్యసభకు ఎన్నికైన జైశంకర్ రెండోసారి గుజరాత్ నుంచి ఇటీవల రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు బీజేపీకి చెందిన బాబూభాయ్ జెసంగ్‌భాయ్ దేశాయ్ (గుజరాత్), కేస్రీదేవ్ సింగ్ దిగ్విజయ్‌సింగ్ ఝాలా (గుజరాత్), నాగేంద్ర రాయ్ (పశ్చిమ బెంగాల్)లు, ఐదుగురు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు డెరెక్ ఒబ్రియాన్, డోలా సేన్, సుఖేందు శేఖర్ రే, ప్రకాష్ చిక్ బరైక్, సమీరుల్ ప్రమాణ స్వీకారం చేశారు.

ట్రంప్ నోట మళ్లీ భారత్‌పై పన్ను మాట

వాషింగ్టన్: భారత్‌లో కొన్ని ఉత్పత్తులపై టారిఫ్‌లు అధికంగా ఉన్నాయంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అధ్యక్ష పగ్గాలు మళ్లీ చేపడితే భారత్‌పై ప్రతీకార పన్ను విధిస్తానని పేర్కొన్నారు. తాజాగా ఆయన ఫాక్స్ బిజినెస్ న్యూస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'భారత్‌లో ట్యాక్సులు మరీ ఎక్కువ. హార్లీ డేవిడ్ సన్‌లాంటి అమెరికా ఉత్పత్తులపై భారత్ భారీగా పన్నులు వేస్తోంది. అక్కడ 100 శాతం, 150, 200 శాతం వరకు పన్నులున్నాయి. మనం మాత్రం వారి ఉత్పత్తులకు ఎలాంటి పన్నులు విధించకూడదా? అది సరికాదు. మనం కూడా పన్నులు వసూలు చేయాల్సిందే. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే భారత్‌పై పరస్పర సమానమైన ప్రతీకార పన్ను విధిస్తా'అని ఆయన హెచ్చరించారు.

రాహుల్ సాహసోపేత ప్రయాణం



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం లద్ధాఖ్‌లోని కార్దుంగ్‌లా పాస్‌ను సందర్శించారు. లేహ్ నుంచి ఇతర బైకర్లతో కలిసి 40 కిలోమీటర్లు పూర్తిగా పర్వత ప్రాంతంలోనే బైక్‌పై ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నారు. స్థానికులతో మాట్లాడారు. ఈ మార్గం ప్రపంచంలో మోటార్‌సైకిల్ ప్రయాణించే అత్యంత ఎత్తయిన రోడ్లలో ఒకటి.

అమెరికాలో 'హిల్లరీ' బీభత్సం

దక్షిణ కాలిఫోర్నియాలో భూప్రకంపనలు

వాషింగ్టన్: అమెరికాలోని పలు రాష్ట్రాల్లో హిల్లరీ తుపాను తీవ్ర ప్రభావం చూపుతోంది. తుపాను ధాటికి దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. భీకర గాలులు వీస్తున్నాయి. వర్షం కారణంగా పలు రహదారులు పూర్తిగా నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ముఖ్యంగా దక్షిణ కాలిఫోర్నియాలోని పలు ప్రాంతాల్లో కుంభవృష్టి కురుస్తోంది. ఈ ప్రాంతంలో ఈ స్థాయిలో వర్షం కురవడం 84 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి అని స్థానిక అధికారులు వెల్లడించారు. తుపాను బీభత్సం సృష్టిస్తుండడంతో నెవెడాలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. తుపాను వల్ల ఏ మేరకు ఆస్తి నష్టం జరిగిందన్న దానిపై సర్వే ప్రారంభించారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే డెత్ వ్యాలీలోని కొన్ని ప్రాంతాలు వరదల్లో చిక్కుకోవడం గమనార్హం. మరోవైపు దక్షిణ కాలిఫోర్నియాలో భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దక్షిణ కాలిఫోర్నియాలోని ఓజాయ్ సిటీకి ఈశాన్య దిక్కున ఆదివారం మధ్యాహ్నం భూప్రకంపనలు సంభవించాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.1గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలియజేసింది. భూ అంతర్భాగంలో 4.8 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు సంభవించినట్లు వెల్లడించింది. భూకంపానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. లాస్‌ఏంజెలెస్ నగర సమీపంలో భూమి రెండుసార్లు కంపించినట్లు అధికారులు గుర్తించారు.



కాలిఫోర్నియాలోని పామ్ డిసర్ట్ ప్రాంతంలో వంతెనను తాకుతున్న ప్రవాహం

క్షిపణుల నుంచి సంగీతం దాకా..

ముందంజలో మహిళలు: ముర్ము

న్యూఢిల్లీ: ఎన్నో అవాంతరాలను అధిగమిస్తూ మహిళలు క్షిపణుల నుంచి సంగీతం వరకు వివిధ రంగాల్లో ఎంతో సాధించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మహిళా శక్తిపై ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలోని మానెక్ షా సెంటర్‌లో సోమవారం జరిగిన ఆర్మీ అధికారుల భార్యల సంక్షేమ సంఘం(ఏడబ్ల్యూడబ్ల్యూఏ) సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగించారు. 'మహిళల సాధికారిత దిశగా ఏడబ్ల్యూడబ్ల్యూఏ సాగిస్తున్న ప్రయత్నాలను మెచ్చుకుంటున్నాను'అని అన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందనేది పాత సామెత. కానీ, ఈ రోజు దానిని విజయం సాధించిన ప్రతి పురుషుడి పక్కన ఒక మహిళ ఉంది అని చెప్పుకోవచ్చని ముర్ము అన్నారు. 'నారీశక్తి అందించే సేవలు సమాజానికే కాదు, యావత్తు దేశం పురోగతికి కీలకంగా మారాయి. క్షిపణుల నుంచి సంగీతం వరకు, మహిళలు అనేక అవరోధాలను ఎదుర్కొంటూ ఎంతో ఉన్నత శిఖరాలకు ఎదిగారు'అని ఆమె అన్నారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 22 । ఆగస్టు । 2023





టీం గ్రేటర్ రెడీ

గ్రేటర్ బీఆర్ఎస్ తొలిజాబితాలో పాతవారికే చోటు

ఉప్పల్‌లో బండారి..కంటోన్మెంట్‌లో లాస్య నందిత

అభివృద్ధే విజయానికి సోపానం


మహేశ్వరం

సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సోపానాలవుతాయి. జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టికెట్లు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే మళ్లీ గెలిపిస్తుంది. - పి.సబితారెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉంటా


యాకుత్‌పురా

ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ పార్టీ ఆదేశాల మేరకు ముందుకెళ్తున్నాం. గత కొన్నేళ్లుగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి సీఎం కేసీఆర్ రెండోసారి యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం సంతోషంగా ఉంది. - సామ సుందర్‌రెడ్డి

హామీలన్నీ నెరవేర్చా..


రాజేంద్రనగర్

మరోసారి అవకాశం ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలు చేశాం. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దాదాపు నెరవేర్చాను. వచ్చే ఎన్నికల్లోనూ అభివృద్ధే ప్రధాన నినాదంగా ముందుకెళ్తా. విజయం సాధిస్తా.

- టి.ప్రకాష్‌గౌడ్

సాక్షి, సిటీబ్యూరో: ఊహించినట్లుగానే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్ తొలిజాబితాలో ఒక్కరికి తప్ప సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి టిక్కెట్లు లభించాయి. కొంత సంశయాత్మకంగా కనిపించిన అంబర్‌పేటలో కాలేరు వెంకటేశ్‌కు, ముషీరాబాద్‌లో ముఠాగోపాల్‌లకే టిక్కెట్లు ఇచ్చారు. ఎలాంటి ప్రచారం జరిగినా వారు టిక్కెట్లు తమకే లభిస్తాయనే ధీమాను వ్యక్తం చేయగా, అందుకు తగ్గట్లే వారికే తిరిగి అవకాశం లభించింది. కంటోన్మెంట్‌లోనూ సిట్టింగ్‌కు ఇచ్చినట్లే లెక్క. సాయన్న మృతితో ఆ నియోజకవర్గం ఖాళీగా ఉంది. సాయన్న స్థానే ఆయన కుమార్తె లాస్యనందితకు అవకాశం కల్పించారు. లాస్యనందితకు గతంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉంది.

ఉప్పల్ తిప్పల్..

ఉప్పల్ సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి స్థానంలో బండారి లక్ష్మారెడ్డికి ఇచ్చారు. బండారికి టిక్కెట్ రాకుండా ఉండేందుకు ఆ సీటు కోసం ఎంతో కాలంగా ఆశలు పెట్టుకున్న మాజీ నగర మేయర్ బొంతు రామ్మోహన్, సిట్టింగ్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి విభేదాలు వీడి సంయుక్తంగా చివరి క్షణంలో ఎమ్మెల్సీ కవితను కలిసినప్పటికీ వారి కోరిక నెరవేరలేదు. అప్పటికే జాబితా ఖరారు కావడంతో వారి ఆశ నిరాశే అయినట్లు తెలిసింది. అంబర్‌పేటలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు, స్థానికంగా ఐదుగురు మాజీ కార్పొరేటర్లు, ఒక సిట్టింగ్ కార్పొరేటర్‌కు పొసగడం లేదు. మంత్రి కేటీఆర్ వార్డు కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలోనూ వారి వైషమ్యాలు బయటపడ్డాయి. కాలేరుకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ కూడా డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కొంత అయోమయం నెలకొన్నప్పటికీ కాలేరుకే తిరిగి టిక్కెట్ లభించింది. ముషీరాబాద్‌లో వయోభారం వల్లనే ముఠాగోపాల్‌పై కొంత సందిగ్ధత నెలకొన్నప్పటికీ ఆయనకే కేటాయించారు. తమ నాయకులకే తిరిగి టిక్కెట్లు రావడంతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

ఓల్డ్‌సిటీలో..

ఓల్డ్‌సిటీలో నాలుగు నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన వారికి మళ్లీ టిక్కెట్లు లభించాయి. చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో ఓడినా మళ్లీ వారికే టిక్కెట్లిచ్చారు. ఆ నియోజకవర్గాల్లో గెలిచే అవకాశాల్లేకపోవడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు.

నాంపల్లి, గోషామహల్ పెండింగ్..

కోర్‌సిటీ (పాత ఎంసీహెచ్) పరిధిలోని నాంపల్లి, గోషామహల్‌వి మాత్రం పెండింగ్‌లో ఉంచారు. గత 2018 ఎన్నికల్లోనూ నాంపల్లి విషయంలో కొంత గందరగోళం జరిగింది. తొలుత ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు కేటాయించినప్పటికీ, బీ ఫారం ఇచ్చే సమయానికి మరో ఆనంద్‌గౌడ్‌కు కేటాయించారు. గోషామహల్ ఈసారి నందుబిలాల్‌కు ఇవ్వనున్నట్లు భావించారు. ఈరెండు స్థానాలు పెండింగ్‌లో ఉంచడంతో అధిష్టానం ఆంతర్యం ఏమిటన్నది అంతు బట్టడం లేదు. గోషామహల్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్ (బీజేపీ) సస్పెండ్ కాకముందు పకడ్బందీ ప్రణాళికతో ఆయనను ఓడించే అభ్యర్థిని ఎంపిక చేయాలని బీఆర్ఎస్ నేతలు భావించినట్లు సమాచారం. ఆయనపై సస్పెన్షన్‌ను బీజేపీ ఇప్పటికీ తొలగించలేదు. ఈ నేపథ్యంలో రాజాసింగ్‌ను తమవైపు తిప్పుకునే ఆలోచనల్లో బీఆర్ఎస్ ఉందనే అభిప్రాయాలున్నప్పటికీ, తాను ఎట్టిపరిస్థితుల్లోనూ వేరే పార్టీలోకి వెళ్లనని రాజాసింగ్ కుండబద్దలు కొట్టడం తెలిసిందే.

మేడ్చల్‌లో ఇలా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో నాలుగింటిలో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అధిష్టానం అవకాశం కల్పించింది. మేడ్చల్ నియోజకవర్గం నుంచి మంత్రి చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానందగౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి మైనంపల్లి హన్మంతరావులను బీఆర్ఎస్ అభ్యర్థులుగా అధిష్టానం ప్రకటించింది. ఉప్పల్ నియోజకవర్గంలో మాత్రం బండారి లక్ష్మారెడ్డికి కొత్తగా అవకాశం ఇచ్చారు.

రంగారెడ్డి జిల్లాలో...

రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అన్నిచోట్లా సిట్టింగ్‌లకే అవకాశం కల్పించారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి సబితా ఇంద్రారెడ్డి, ఎల్బీనగర్- దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం-మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి- గుర్క జైపాల్ యాదవ్, షాద్‌నగర్-ఎల్లమోని అంజయ్య యాదవ్, చేవెళ్ల- కాలే యాదయ్య, రాజేంద్రనగర్ ప్రకాష్‌గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి ఆరికెపూడి గాంధీల పేర్లను అధినేత కేసీఆర్ ప్రకటించారు.

అసంతృప్తులు క్షణికమే ?

కొన్ని నియోజకవర్గాల్లో టిక్కెటు వారి అసంతృప్తి క్షణికమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉప్పల్‌లో బొంతు రామ్మోహన్, కంటోన్మెంట్‌లో మన్నె క్రిశాంక్, గజ్జెల నగేష్ వంటి వారు పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే పరిస్థితి లేదు. కాగా, కంటోన్మెంట్‌కు చెందిన శ్రీగణేశ్, శేరిలింగంపల్లిలో పార్టీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్‌లు పార్టీ మారనున్నట్లు వారి అనుయాయులు చెబుతున్నారు.

పోలీస్ అలర్ట్!

వచ్చే ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో రెండుమూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని క్షేత్రస్థాయి పోలీసులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సున్నిత ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. రాజధానిలోని దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు ఆశావహులు ఉండటం సాధారణం. అధికార పార్టీతో పాటు విపక్షాల్లోనూ ఈ పరిస్థితులు కనిపిస్తుంటాయి. ఆఖరి నిమిషం వరకు అనేక ప్రయత్నాలు చేసే వీళ్ళు టిక్కెట్ దొరక్కపోతే అసమ్మతి రాగం అందుకుంటారు. నిరాశపడిన ఆశావహుల్లో మరికొందరు తన అనుచరులతో కలిసి నేరుగా నిరసనలకు దిగడం, కొందరైతే తాము తెర వెనుక ఉండి అనుచరులను రెచ్చగొట్టడం చేస్తుంటారు. వీళ్ళు చేపట్టే నిరసన కార్యక్రమాల వల్ల ఒక్కోసారి శాంతిభద్రతల సమస్యలు తలెత్తడం, ట్రాఫిక్ ఇబ్బందులు చోటు చేసుకోవడం జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలోనే నగర నిఘా విభాగాలు, రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు అలర్ట్ అయ్యాయి. టిక్కెట్ లభించని ఆశావహులు, వారి ముఖ్య అనుచరుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించడంపై దృష్టి పెట్టాయి. దీని కోసం కొన్ని ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.



24 స్థానాల్లో ఇద్దరే మహిళలు

బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో మహిళలకు పెద్దగా చోటు దక్కలేదు. ఈసారి కూడా ఊరించి ఉస్సూరనిపించారని పలువురు ఆశావహ మహిళానేతలు అభిప్రాయపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని 24 స్థానాల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి సబితా ఇంద్రారెడ్డి యథావిధిగా ఈసారి కూడా పోటీ చేయనున్నారు. కొత్తగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానాన్ని మాత్రం దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందితకు ఈసారి అవకాశం కల్పించారు. దీంతో మొత్తం 24 నియోజకవర్గాల్లో కేవలం ఇద్దరు మహిళలకే అవకాశం లభించింది. అందులోనూ సాయన్న కన్నుమూయడం వల్ల ఆయన కూతురు లాస్య నందితకు అవకాశం ఇచ్చారు. కానీ మహిళా అభ్యర్థిగా ఆ స్థానాన్ని కేటాయించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచాలని ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టిన సంగతి తెలిసిందే. వివిధ రాజకీయ పార్టీలు కూడా మద్దతుగా నిలిచాయి. బీఆర్ఎస్ మహిళాశ్రేణులు పెద్ద సంఖ్యలో ఆ ఆందోళనలో పాల్గొన్నారు. కానీ బీఆర్ఎస్‌లోనే మహిళలకు ఆశించిన స్థాయిలో చోటు దక్కలేదు. మొత్తం 119 స్థానాల్లో ఆరుగురికి మాత్రమే అవకాశం కల్పించగా, గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఇద్దరు మహిళలకు ఆ అవకాశం దక్కింది.

వారసులకు నో చాన్స్

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో రాజకీయ వారసత్వానికి బ్రేకులు పడ్డాయి. బీఆర్ఎస్ యువనాయకులుగా కొనసాగుతున్న పలువురు ఎమ్మెల్యేల తనయులకు ఈసారి అవకాశం దక్కలేదు. సీఎం కేసీఆర్ తాజాగా ప్రకటించిన బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా ఆ పార్టీ వారసత్వ యువ కిశోరాలను ఊరించి ఉస్సూరుమనిపించింది.

మరోసారి వారే...

- సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు సాయికిరణ్‌కు ఈసారి అవకాశం లభించవచ్చునని భావించారు. ఈ మేరకు ఆయన సనత్‌నగర్‌లో రాజకీయంగా ఎదిగేందుకు సన్నద్ధమయ్యారు. బీఆర్ఎస్ కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఆ పార్టీ శ్రేణుల్లోనూ తలసాని వారసుడిగా ఆయన కొడుకు పోటీచేయనున్నట్లు ప్రచారం కూడా జరిగింది. కానీ ఈసారి సాయికిరణ్‌కు అవకాశం దక్కలేదు.
- మహేశ్వరం నియోజకవర్గం నుంచి మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డికి సైతం అవకాశం లభించలేదు. క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చేందుకు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న కార్తీక్‌రెడ్డికి నిరాశే ఎదురయ్యింది.
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తనయుడు డాక్టర్ రోహిత్ సైతం మైనంపల్లి వారసుడిగా ఎన్నికల బరిలోకి దూకేందుకు సన్నద్ధమయ్యాడు. ఈ మేరకు విస్తృతంగా ప్రచారం సైతం జరిగింది. కానీ యథావిధిగా మైనంపల్లి హనుమంతరావుకే అవకాశం లభించింది.
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి కూడా టిక్కెట్ ఆశించినా ఫలితం దక్కలేదు.
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కుమారుడు జయసింహ పేరు దాదాపు ఖరారు అని భావించిన తరుణంలో చివరి నిమిషంలో నిలిపివేశారు.
- సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మాత్రం ఎమ్మెల్యే సాయన్న కన్నుమూయడంతో ఆ స్థానాన్ని ఆయన కూతురు లాస్యకు కేటాయించారు.

మజ్లిస్- బీఆర్ఎస్ ఫ్రెండ్లీ పోటీ

బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో పాతబస్తీ రాజకీయాలపై మరోసారి చర్చ మొదలైంది. ఈసారీ ఇక్కడ బీఆర్ఎస్-మజ్లిస్ మధ్య స్నేహపూర్వక పోటీనే ఉంటుందని భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే నాంపల్లి మినహా బీఆర్ఎస్ గతంలో ఓడిపోయిన తమ పాత అభ్యర్థులనే తాజాగానూ బరిలోకి దింపింది. గత ఎన్నికల్లో సైతం మజ్లిస్ పార్టీ పోటీ చేయని స్థానాల్లో బాహాటంగా బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించడంతో పాటు ఎన్నికల ప్రచార సభల్లో సైతం అసదుద్దీన్ ఒవైసీ పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అయితే ఈసారి 50 స్థానాల్లో బరిలో దిగి కనీసం 15 స్థానాలతో అసెంబ్లీలో అడుగుపెడతామని అక్బరుద్దీన్ ప్రకటించడం ఇటీవల రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పోటీ చేసే స్థానాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకున్నా..బీఆర్ఎస్‌తో దోస్తీ ఉందంటూ ఒవైసీ కూడా చెప్పుకుంటూ వచ్చారు. తాజాగా సీఎం కేసీఆర్ కూడా ఫ్రెండ్లీ పార్టీ అంటూనే ఎన్నికల్లో స్నేహపూర్వక పోటీ ఉటుందని వ్యాఖ్యానించారు.

ఆనందంగా ఉంది


మేడ్చల్

నాపై నమ్మకం ఉంచి రెండోసారి మేడ్చల్ అసెంబ్లీ స్థానం టికెట్‌ను కేటాయించడం చాలా ఆనందంగా ఉంది. కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుంది. జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయం.

- చామకూర మల్లారెడ్డి

హ్యాట్రిక్ విజయం సాధిస్తా


జూబ్లీహిల్స్

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి మరోసారి నాకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ముచ్చటగా మూడోసారి ఈ స్థానంలో కారు దూసుకెళ్తుంది. నాకు హ్యాట్రిక్ విజయం ఖాయమని భావిస్తున్నా. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే నన్ను గెలిపిస్తుందని నమ్ముతున్నా.

- మాగంటి గోపీనాథ్

సమన్వయంతో కలిసి పనిచేస్తా


ఉప్పల్

ఉప్పల్ బీఆర్ఎస్ టికెట్‌ను కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ఆయన నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. నియోజకవర్గంలో అందరినీ కలుపుకొనిపోయి సమన్వయంతో పని చేసి ఉప్పల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం. నేను చేసిన సేవా కార్యక్రమాలకు మెచ్చే నాకు టికెట్ ఇచ్చారు. - బండారి లక్ష్మారెడ్డి

అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం


చార్మినార్

బీఆర్ఎస్‌లో అన్ని వర్గాల ప్రజలతో పాటు నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందనడానికి నేనే నిదర్శనం. పాతబస్తీలో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న తనకు ఈసారి కూడా టిక్కెట్ లభించడం సంతోషకరం. ఇందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు.

-మహ్మద్ సలావుద్దీన్ లోడీ

తప్పకుండా గెలుస్తా...


కార్వాన్

ఎట్టిపరిస్థితుల్లోనూ ఈసారి కార్వాన్ నుంచి నేను గెలుస్తాను. పార్టీ అధిష్టానం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయను. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేపడతాను. పార్టీలో వర్గాలు..విభేదాలు లేకుండా చూసుకుని సమష్టి కృషితో విజయం సాధిస్తాం.

- ఎ.కృష్ణయ్య అలియాస్ మిత్ర కృష్ణ

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తుంది


సనత్‌నగర్

ప్రజల ఆశీర్వాదంతో ఆరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కింది. గతంలోకంటే సనత్‌నగర్ నియోజకవర్గంలో రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం. అవే మరోసారి నాకు విజయాన్ని అందిస్తాయని నమ్ముతున్నా. సీఎం కేసీఆర్ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. ఆయన అడుగుజాడల్లో నడుస్తా.

తలసాని శ్రీనివాస్ యాదవ్

కేసీఆర్ అభిమానాన్ని మరువలేం


కంటోన్మెంట్

నాపై నమ్మకం ఉంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున కంటోన్మెంట్ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నా. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో సాయన్న కుటుంబం మా కుటుంబమే అంటూ ప్రకటించి కేసీఆర్ చూపిన అభిమానాన్ని ఎప్పటికీ మరిచిపోలేం. ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా. - లాస్య నందిత

సత్తా చూపిస్తాం


మలక్‌పేట

మలక్‌పేట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా అత్యధిక మెజారిటీతో గెలిచి సత్తా చూపిస్తాం. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఈసారి ఎన్నికల్లో మా గెలుపునకు బాటలు వేస్తాయి. మలక్‌పేటలో ఇప్పటి వరకు గెలవకున్నా..అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం మాత్రం ఎన్నో పథకాలు అమలు చేశాం. కాబట్టి ప్రజలు ఈసారి బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తారని ఆశిస్తున్నా. - తీగల అజిత్‌రెడ్డి

సీఎంకు బహుమతిగా ఇస్తా


కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించి ప్రజల తరఫున సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తాను. నాకు మరోసారి ప్రజలకు సేవ చేసేందుకు అవకాశమిచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా.

- కేపీ వివేకానంద్

గతంలో కంటే ఎక్కువ మెజార్టీతో గెలుస్తా


కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మరోసారి బీఆర్ఎస్ టికెట్ దక్కటం ఎంతో సంతోషకరం. ఈసారి గతంలో కంటే ఎక్కువ మెజార్టీతో విజయం సాధిస్తాను. పార్టీ అధిష్టానం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. ప్రజాసేవకే నా జీవితాన్ని అంకితం చేస్తాను. గెలిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తా. - మాధవరం కృష్ణారావు

ప్రత్యేక కృతజ్ఞతలు


చాంద్రాయణగుట్ట

బీఆర్ఎస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి కేసీఆర్ వెంట నమ్మకంతో ఉన్నందుకు మూడోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది. నిత్యం ప్రజల్లో ఉంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ ఉన్నా. తనకు మరో అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీలకు ప్రత్యేక ధన్యవాదాలు.

- ముప్పిడి సీతారాంరెడ్డి

గులాబీ జెండా ఎగురవేస్తాం


ఖైరతాబాద్

ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి పోటీ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు. గత నాలుగున్నర ఏళ్లుగా నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేశాం. వేల మందికి సంక్షేమ పథకాలు అందించగలిగాం. మరోసారి కచ్చితంగా ఖైరతాబాద్ గడ్డమీద గులాబీ జెండా ఎగురవేస్తా.

- దానం నాగేందర్

కేసీఆర్‌కు రుణపడి ఉంటా..


పటాన్‌చెరు

మూడోసారి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటా. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తా. మంత్రులు కేటీఆర్‌కు, హరీశ్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- మహిపాల్‌రెడ్డి

అన్ని స్థానాల్లో గెలుస్తాం


ఇబ్రహీంపట్నం

మళ్లీ పోటీ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఆయన పాలన, విధానాలకు అనుగుణంగా పనిచేస్తాం. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులందరితో కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలను కైవసం చేసుకుంటాం.

- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

సంతోషంగా ఉంది...


బహదూర్‌పురా

ఈసారి కూడా పార్టీ అధిష్టానం నాకు బహదూర్‌పురా టికెట్ కేటాయించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేస్తాం. బీఆర్ఎస్ గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తా.

- మీర్ ఇనాయత్‌అలీ బక్రీ

మెజార్టీ పెంచుతాం


ముషీరాబాద్

2018 ఎన్నికల్లో 38 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచాను. వచ్చే ఎన్నికల్లో అంతకంటే ఎక్కువ మెజార్టీతో గెలుపొంది సీఎంకు కానుకగా ఇస్తా. నాపై నమ్మకం ఉంచి మళ్లీ అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నా. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయం సాధిస్తా.

- ముఠా గోపాల్

భారీ మెజార్టీ ఖాయం


శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో విజయం సాధించి గులాబీజెండాను ఎగురవేస్తాం. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తా. ఎన్నికల్లో గెలిచాక శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టడానికి శాయశక్తులా కృషిచేస్తా.

- అరెకపూడి గాంధీ

పని తీరును గుర్తించారు


అంబర్‌పేట

నేను చిత్తశుద్ధితో అంబర్‌పేట అభివృద్ధికి కృషి చేశాను. నా పనితీరును గుర్తించి సీఎం కేసీఆర్ తిరిగి అవకాశం కల్పించారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. రెండోసారి ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధిస్తాను. అంబర్‌పేట ప్రజలు తిరిగి నన్ను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారు.

- కాలేరు వెంకటేశ్

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి


సికింద్రాబాద్

సికింద్రాబాద్ నియోజకవర్గంలో గడచిన తొమ్మిదేళ్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి పనులు చేపట్టాం. రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేశాం. అవే ఈసారి ఎన్నికల్లో నన్ను గెలిపిస్తాయని నమ్ముతున్నా. కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ మరోసారి ఎన్నికల్లో విజయం సాధిస్తా.

- పద్మారావుగౌడ్

సీఎంకు ధన్యవాదాలు


ఎల్‌బీనగర్

నాపై నమ్మకంతో ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయటానికి అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చాను. గత ఐదేళ్లుగా నిరంతరం ప్రజాసేవలోనే ఉన్నాను. కాబట్టి ప్రజలు నన్ను ఆదరిస్తారని ఆశిస్తున్నా.

- దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రశాంతం.. పారదర్శకం..


అంబర్‌పేట్ మహారాణా ప్రతాప్‌హాల్‌లో డిప్ తీస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్

ముగిసిన మద్యం దుకాణాల లాటరీ
- గ్రేటర్‌లోని 615 వైన్‌షాపులకు పెద్ద ఎత్తున పోటీ
- ఉత్కంఠభరితంగా సాగిన లాటరీ నిర్వహణ
- ఆశ,నిరాశల మధ్య దరఖాస్తుదారుల పడిగాపులు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లోని 615 మద్యం దుకాణాల కేటాయింపులు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం వివిధ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో ఉన్నతాధికారుల సమక్షంలో లాటరీ పద్ధతిలో పారదర్శకంగా మద్యం షాపులను కేటాయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు లాటరీ నిర్వహణ ఉత్కంఠభరితంగా కొనసాగింది. వైన్‌షాపులన్నింటికీ నంబర్ల ప్రకారం లాటరీ నిర్వహించారు. ఒక్క షాప్ కోసం సుమారు 90 మందికి పైగా పోటీపడ్డారు. శంషాబాద్, సరూర్‌నగర్‌లలో పోటీ అనూహ్యంగా ఉంది. వైన్ షాపులు దక్కించుకున్న వారిలో ఉత్సాహం వెల్లువెత్తగా, రూ.లక్షలు వెచ్చించి దరఖాస్తు చేసుకున్నా 'లక్కు' వరించని వారు నిరాశతో వెనుదిరిగారు. హైదరాబాద్ ,సికింద్రాబాద్ ఎక్సైజ్ జిల్లాలకు అంబర్‌పేట్‌లోని మహారాణా ప్రతాప్ హాల్‌లో లాటరీ నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హైదరాబాద్ ఎక్సైజ్ జిల్లాలో మొత్తం 80 షాపులకు లాటరీ నిర్వహించగా, సికింద్రాబాద్ ఎక్సైజ్ జిల్లాలో ఐఏఎస్ అధికారి కృష్ణ ఆదిత్య ఆధ్వర్యంలో 99 షాపులను లాటరీ పద్ధతి ద్వారా దరఖాస్తుదారులకు కేటాయించారు. లాటరీలో షాపులను దక్కించుకున్న వ్యాపారులు 24 గంటల్లో లైసెన్స్ ఫీజులో మొదటి వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. కార్యక్రమంలో సికింద్రాబాద్, హైదరాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు పవన్, విజయ్, ఎక్సైజ్ సీఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ అనూహ్యం...

గ్రేటర్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, మేడ్చల్, సరూర్‌నగర్, శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాల్లో ఉన్న 615 దుకాణాలకు ఈసారి అనూహ్యంగా 42,596 దరఖాస్తులు వెల్లువెత్తాయి. కేవలం దరఖాస్తు రుసుము రూపంలోనే ప్రభుత్వానికి రూ.851కోట్ల వరకు ఆదాయం లభించింది. సరూర్‌నగర్‌లోని 134 మద్యం షాపులకు ఏకంగా 10,908 దరఖాస్తులు రాగా, శంషాబాద్‌లోని 100 దుకాణాలకు 10,811 దరఖాస్తులు వచ్చాయి. మల్కాజిగిరిలోని 88 మద్యం షాపులకు 6,722, మేడ్చల్‌లోని 114షాపులకు 7,017 చొప్పున దరఖాస్తులు అందాయి. సికింద్రాబాద్‌లోని 99 దుకాణాలకు 3510 దరఖాస్తులు రాగా, హైదరాబాద్‌లోని 80 మద్యం షాపులకు 3,628 దరఖాస్తులు వచ్చాయి. గతంలో లేని విధంగా పోటీ వెల్లువెత్తడంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు లాటరీ నిర్వహణ ఉత్కంఠభరితంగా సాగింది. నవంబర్ చివరితో ఇప్పుడు ఉన్న వైన్ షాపుల గడువు ముగియనుంది. కొత్త షాపులలో డిసెంబర్ నుంచి మద్యం విక్రయాలు జరుగుతాయి. ఈ మేరకు డిసెంబర్ నాటికి ఆయా దుకాణాలకు మద్యం సరఫరా చేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

అప్పు ఇచ్చిన పాపానికి..

బాలుడి కిడ్నాప్
- ఏడు గంటల్లోనే ఛేదించిన కడ్తాల్ పోలీసులు
- అప్పు ఇచ్చిన మహిళ కుమారుడిని కిడ్నాప్ చేసిన వైనం
- మరిన్ని డబ్బులు వసూలు చేసేందుకే..


వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: ఆర్థిక అవసరాల కోసం అప్పు ఇచ్చిన మహిళ కుమారుడినే కిడ్నాప్ చేసి ఆమె నుంచి మరిన్ని డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కిడ్నాప్ చేసి పక్కరాష్ట్రానికి పారిపోయిన వారిని కేవలం ఏడుగంటల్లోనే అదుపులోకి తీసుకోవడం గమనార్హం. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు.

అనంతపురం జిల్లా, కణేకల్ మండలం, ఎల్ బీనగర్ గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మి (38) తన ఇద్దరు కుమారులతో కలిసి గత పదేళ్లుగా కూరగాయల నర్సరీలను నిర్వహిస్తోంది. ప్రస్తుతం కడ్తాల్‌లో నర్సరీ నిర్వహిస్తున్న ఆమె వద్ద గతంలో తమ మండలానికే చెందిన బస్వరాజు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో లక్ష్మి బస్వరాజుకు వ్యాపారం నిమిత్తం రూ.10 లక్షలు అప్పుగా ఇవ్వడమేగాక తాను పూచీగా ఉండి మరో రూ.15 లక్షలు రుణం ఇప్పించింది.

అప్పు తీర్చలేక..

అప్పుతో పాటు మిగతా డబ్బులు చెల్లించాలని గత కొంతకాలంగా లక్ష్మి ఒత్తిడి చేస్తుండటంతో వాటిని తీర్చలేని పరిస్థితిలో ఉన్న బస్వరాజు ఆమె కుమారుడిని కిడ్నాప్ చేసి ఆమె నుంచే మరిన్ని డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో వికారాబాద్‌కు చిన్నారెడ్డి, బుజంగం, కుమార్‌తో కలిసి కిడ్నాప్‌నకు పథకం పన్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 19న మరో ఫోన్ నంబర్ నుంచి లక్ష్మి కుమారుడు (16)కి ఫోన్ చేసి నారు కావాలని ఉదయం 5 గంటలకు వస్తామని చెప్పాడు. ఈ నెల 20 ఉదయం నర్సరీ సమీపంలో నారు ఇచ్చేందుకు వచ్చిన బాలుడిని అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న ఎర్టిగా కారులో బలవంతంగా ఎక్కించుకుని పరారయ్యారు.

నర్సరీకి వెళ్లిన బాలుడు తిరిగిరాకపోగా, అతడి నంబర్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఉదయం 8.30 గంటలకు బాలుడి ఫోన్ లిఫ్ట్ చేసిన దుండగులు తమకు రూ. 2 కోట్లు ఇస్తేనే బాలుడిని సురక్షితంగా అప్పగిస్తామని చెప్పారు. పోలీసులకు సమాచారం ఇవ్వకూడదని హెచ్చరించారు. అయితే మధ్యాహ్నం వరకు వారి నుంచి ఫోన్ రాకపోవడంతో తాను ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో బాలుడి తల్లి లక్ష్మి కడ్తాల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన కడ్తాల్, తలకొండపల్లి పోలీసులు సీసీ టీవీ ఫుటేజీతో పాటు బాలుడి ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. అప్పటికే నిందితులు వికారాబాద్, నారాయణపేట, మంత్రాలయం మీదుగా కర్నూలు జిల్లా ఆలూరు చేరుకున్నట్లు తెలియడంతో అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. వారి సహకారంతో సాయంత్రం ఆలూరులో ఎర్టిగా కారును అదుపులోకి తీసుకుని బాలుడిని రక్షించారు. నిందితుల నుంచి కారుతో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఆమనగల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు శంకర్‌గౌడ్, బలరాంలను డీసీపీ అభినందించారు. నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్ జిల్లా ఓటర్లు 43 లక్షలు

సాక్షి,సిటీబ్యూరో: స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద ఓటర్ల ముసాయిదా జాబితాను హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సోమవారం వెల్లడించారు. ముసాయిదా మేరకు జిల్లాలో 43,00,989 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 22,09,972 మంది కాగా, మహిళలు 20,90,727 మంది ఉన్నారు. ఇతరులు 290 మంది ఉన్నారు.

◆ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను జూబ్లీహిల్స్‌లో అత్యధికంగా 3,56,995 మంది ఓటర్లుండగా, అత్యల్పంగా చార్మినార్ నియోజకవర్గంలో 2,16,648 మంది ఓటర్లున్నారు. మొత్తం 3986 పోలింగ్ కేంద్రాలున్నాయి.

అభ్యంతరాలుంటే తెలపండి:

ఓటరు ముసాయిదా జాబితాలు ఈఆర్‌ఓ(ఎలక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్)ల కార్యాలయాలతో పాటు ముఖ్యప్రాంతాల్లో అందుబాటులో ఉన్నట్లు రోనాల్డ్ రాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముసాయిదాలో తమ పేర్లు సరిచూసుకుని అభ్యంతరాలుంటే సంబంధిత ఈఆర్‌ఓలకు తెలియజేయాల్సిందిగా సూచించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా అభ్యంతరాలను తెలపవచ్చునని పేర్కొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఓటర్లు 31,99,674

జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితాను ఎన్నికల కమిషన్ సోమవారం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, వీటి పరిధిలో మొత్తం 3,369 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసింది. మొత్తం 31,99,674 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. వీరిలో 16,62,692 మంది పురుషులు, 15,35,537 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులు 384 మంది ఉన్నారు. వీరితో పాటు ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 195 మంది ఉండగా, సర్వీసు ఓటర్లు మరో 866 మంది ఉన్నారు.





కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

సాక్షి, సిటీబ్యూరో: విద్యా రంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ అధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేదుకు ప్రయత్నించడంతో పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు లెనిన్ గువేరా అన్నారు. సంక్షేమ హాస్టళ్లను సంరక్షించాలని, మెస్ కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, మనబడి మన బస్తీ పథకాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వసతి గృహాలు, హాస్టళ్లకు స్వంత భవనాలు నిర్మించాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ,స్కాలర్ షిప్స్ విడుదల చేయాలన్నారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడించేందుకు వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, నగర సహాయ కార్యదర్శులు నాగేందర్, శ్రీమాన్, ప్రశాంత్ ఉపాధ్యక్షుడు స్టాలిన్, సునీల్, నాయకులు పవిత్ర, సంధ్య, దాసు, శ్రీరామ్, బాలకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై సామూహిక అత్యాచారం

- కత్తులతో బెదిరించి లైంగికదాడి
- మీర్‌పేట పీఎస్ పరిధిలో ఘటన
- ఏడు పోలీసు బృందాలతో నిందితుల కోసం గాలింపు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రాచకొండ సీపీ చౌహాన్


నిందితుల్లో ఒకడైన అబేద్‌లాలా

మీర్‌పేట: కత్తులతో బెదిరించి నలుగురు యువకులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. తిరుమలగిరి లాల్‌బజార్‌కు చెందిన బాలిక (16) పదిహేను రోజుల క్రితం నందనవనంలో నివాసముండే తన అక్క (పెద్దనాన్న కూతురు) ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం ఇంట్లోని వారు బయటకు వెళ్లగా.. ఎనిమిది మంది దుండగులు వచ్చి తలుపులు కొట్టారు. ఈ సమయంలో ఇంట్లో బాధిత బాలికతో పాటు ఆమె తమ్ముడు, మరో నలుగురు చిన్నారులు లోపల ఉన్నారు. వీరిని కత్తులతో బెదిరించిన నలుగురు యువకులు బాలిక మినహా అందరినీ మూడో అంతస్తులోకి తీసుకెళ్లారు. బాలికను మాత్రం అదే గదిలో ఉంచి మిగిలిన నలుగురు లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం అందరూ కలిసి పారిపోయారు. బాలిక అక్క వచ్చిన తర్వాత జరిగిన విషయం చెప్పడంతో మధ్యాహ్నం 12 గంటలకు మీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి ఏడు బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నట్లు మీర్‌పేట సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు. విషయం తెలుసుకున్న రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మీర్‌పేట పోలీసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిందితులను వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు, పోలీసుల పనితీరుపై ఆయన ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాగా యువకులు గంజాయి సేవించి ఉంటారనే స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుల్లో నలుగురు స్థానికంగా ఉంటారని, ఇందులో అబేద్‌లాలా, టైసన్ కాగా మరో ఆరుగురి వివరాలు తెలియాల్సి ఉంది.

కేబుల్ వైర్ తగిలి ద్విచక్రవాహనదారుడి మృతి


బోయిని చంద్ర కాంత్ (ఫైల్)


చైతన్యపురి: రోడ్డుపై వేలాడుతున్న కేబుల్ వైరు ఓ ప్రాణాన్ని బలితీసుకుంది. బైక్‌పై వెళుతున్న వ్యక్తి కేబుల్ వైరు తగిలి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగార్జున కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన బోయిని చంద్రకాంత్ (29) పదేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి కొత్తపేట ఓల్డ్ విలేజ్‌లో నివసిస్తున్నాడు. పండ్ల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం అతను బైక్‌పై సమీపంలోని దేవాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా జైన్‌మందిర్ సమీపంలో రోడ్డు మధ్యలో వేలాడుతున్న ఇంటర్నెట్ కేబుల్ వైర్ బైక్‌కు తగిలింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడటంతో తలకు తీవ్రగాయాలైన చంద్రకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: ఉద్యోగులకు విధి నిర్వహణలో క్రమశిక్షణ అవసరమని, నిజాయితీగా, అంకితభావంతో విధులు నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకాలు పొందిన 73 మందిలో, జూనియర్ అసిస్టెంట్లుగా 66 మందికి కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు. 40 మందికి నేరుగా నియామక ఉత్తర్వులు ఇచ్చి, మిగిలిన 26 మందికి కారుణ్య నియామకం కింద వివిధ శాఖలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ డీఆర్‌ఓ వెంకటాచారి పాల్గొన్నారు.

సత్వర పరిష్కారానికి కృషి చేయాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలని ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో 105 వినతులు అందగా, అందులో హౌసింగ్‌కు సంబంధించి 71 ఇతర శాఖలకు సంబంధించి 34 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధి కారి వెంకటాచారి, జిల్లా ప్రణాళిక అధికారి సురేందర్, బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దారుణం

అకారణంగా బాలుడి గొంతు కోసిన ఆటో డ్రైవర్


నిందితుడు యాదగిరి(ఫైల్)


ఆదిత్య (ఫైల్)

జగద్గిరిగుట్ట: మద్యం మత్తులో అకారణంగా ఓ ఆటో డ్రైవర్ ఓ బాలుడి గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జగద్గిరిగుట్ట కూన మహాలక్ష్మీ నగర్‌లో ఉంటున్న లక్ష్మి, దుర్గయ్య దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. దుర్గయ్య కొన్నేళ్లుగా ఇంటికి రాకపోవడంతో పిల్లలతో కలిసి లక్ష్మి ఒంటరిగా ఉంటోంది. సోమవారం సాయంత్రం అదే బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ యాదగిరి తప్పతాగి, రోడ్డుపై ఆడుకుంటున్న ఆదిత్య (9)తో మాటలు కలిపాడు. అతడికి మాయ మాటలు చెప్పి తనతో తీసుకెళ్లాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే తన జేబులో ఉన్న బ్లేడుతో బాలుడి గొంతు కోశాడు. దీంతో ఆదిత్య కుప్పకూలి పోయాడు. దీనిని గుర్తించిన స్థానికులు బాలుడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పతికి తరలించారు. ఆదిత్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడిని ఎందుకు చంపాలనుకున్నాడో కారణాలు తెలియరాలేదు. యాదగిరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెగ్గింగ్ ముఠా నిర్వాహకుడి అరెస్ట్

ఫిలింనగర్: చిన్న పిల్లలను యాచకులుగా మార్చి రోడ్లపై వదిలేసి సాయంత్రానికి వారు తీసుకొచ్చిన డబ్బులను వసూలు చేసుకుంటున్న బెగ్గింగ్ ముఠా నిర్వాహకుడిని ఫిలింనగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్‌జోన్ అదనపు డీసీపీ హనుమంతరావు, జూబ్లీహిల్స్ ఏసీపీ కె.హరిప్రసాద్, సీఐ రామకృష్ణతో కలిసి వివరాలు వెల్లడించారు. ఫిలింనగర్, బసవ తారకం నగర్ బస్తీకి చెందిన వి.సూర్యప్రకాశ్(36) ఫొటోగ్రాఫర్‌గా పనిచేసేవాడు. జల్సాలు, మద్యానికి బానిసైన అతను సులువుగా డబ్బులు సంపాదించేందుకు బెగ్గింగ్ మాఫియాకు తెరలేపాడు. ఐదుగురు పిల్లలను చేరదీసి వారికి స్టీల్ బాక్సులు ఇచ్చి ఫిలింనగర్ బస్టాప్, పరిసర ప్రాంతాల్లో డబ్బులు వసూలు చేయించేవాడు. సాయంత్రం వారు తీసుకొచ్చే డబ్బులు లాక్కునేవాడు. ప్రతిరోజూ రూ. 2 వేల వరకు వసూలయ్యేవి. ఇందులో రూ. 100 చొప్పున పిల్లలకు ఇచ్చి మిగతావి తాను తీసుకునేవాడు. దీనిపై సమాచారం అందడంతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఫిలింనగర్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. బాలలను మోండా మార్కెట్‌లోని అమన్‌వేదిక స్నేహ గర్‌కు తరలించారు. నిందితుడి నుంచి స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. చిన్నారులందరూ పార్ట్‌టైం బెగ్గింగ్ చేస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది.

ఇన్‌స్టాలో ఫాలో కాకపోతే చంపేస్తా..

- బాలికకు గుర్తుతెలియని యువకుడి బెదిరింపులు
- పోలీసులకు బాధితురాలి తండ్రి ఫిర్యాదు

వెంగళరావునగర్: ఇన్‌స్టాగామ్‌లో ఫాలో కావాలని, తనకు ఫోన్ చేయాలని, లేని పక్షంలో ఫొటోలు మార్ఫింగ్ చేసి వైరల్ చేస్తానని గుర్తు తెలియని యువకుడు తన కుమార్తెను బెదిరిస్తున్నాడని ఆమె తండ్రి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి కొన్నేళ్లుగా వెంగళరావు నగర్ డివిజన్, జవహర్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలీగా పని చేస్తున్నాడు. అతడికి ఒక కుమార్తె(15), కుమారుడు ఉన్నారు. గత నెల 23న అతడి కుమార్తె దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఓ యువకుడు ఆమెను అడ్డగించి తన మొబైల్‌లో బాలిక ఫొటో తీసుకున్నాడు. తనకు తరచూ ఫోన్లు చేయకపోయినా, ఇన్‌స్టాగామ్‌లో ఫాలో కాకపోయినా ఫొటోలను మార్ఫింగ్ చేసి వైరల్ చేస్తానని బెదిరించాడు. కొద్ది దూరంలో ఉన్న షణ్ముఖరావు అనే వ్యక్తితో మాట్లాడి అతడితో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పటి నుంచి తమ కుమార్తె భయాందోళకు గురవుతోందని తెలిపాడు. అంతేగాకుండా ఇటీవల తన కుమారుడిని రోడ్డుపై అడ్డుకుని మీ సోదరి ఫొటోలు నెట్‌లో వైరల్ చేస్తానని, తనతో ఇన్‌స్టాగాంలో ఫాలో కావాలని, ఈ విషయాన్ని ఇంట్లో చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈనెల 16న సదరు బాలిక ట్యూషన్ నుంచి ఇంటికి వస్తుండగా ఆమెను అడ్డుకున్న అదే యువకుడు ఆమె చేతిపై ఇన్‌స్టా ఐడీ రాసి చిన్న షణ్ముఖరావుతో కలిసి వెళ్లిపోయినట్లు తెలిపాడు. చిన్న షణ్ముఖరావు అమ్మాయిలను మోసం చేస్తుంటాడని, అతనిపై జూబ్లీహిల్స్ పీఎస్‌లో కేసులు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. సదరు గుర్తు తెలియని వ్యక్తి ద్వారా షణ్ముఖరావు తన కుమార్తెను బెదిరిస్తున్నాడనే అనుమానాలు ఉన్నాయని, అతనిపై చర్యలు తీసుకుంటే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయని, వారిని అరెస్టు చేసి తన కుమార్తెను రక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

సైఫాబాద్ కళాశాలను సందర్శించిన ఓయూ వీసీ



పీజీ సెమిస్టర్ థియరీ పరీక్షలు పరిశీలిస్తున్న ఓయూ వైస్ చాన్సిలర్ రవీందర్

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైఫాబాద్ సైన్స్ కాలేజీని సోమవారం ఓయూ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డి. రవీందర్ సందర్శించారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశ పెట్టిన మూడు కొత్త సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు... అదే విధంగా మౌలిక సదుపాయాల తీరుతెన్నుల గురించి పీజీ సెమిస్టర్ థియరీ పరీక్షలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై కొత్త పీజీ మహిళా హాస్టల్ నిర్మాణ పనులు కూడా పరిశీలించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నవనీత, డాక్టర్ వి.జగదీశ్వర్, డాక్టర్ ఎం.వెంకటరమణ, ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి



బంజారాహిల్స్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని తనకు కల్పించాలని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి సోమవారం గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని డివిజన్ల అధ్యక్షులు నారికేళ్ల నరేష్, కాటూరి రమేష్, వెంకటేష్, రాజు, నయీం తదితరులు పాల్గొన్నారు.

జీటీఎస్ ఆలయ హుండీ లెక్కింపు




వెంగళరావునగర్: జీటీఎస్ ప్రధాన రహదారిలోని వీరాంజనేయ భవానీశంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్ టెంపుల్) హుండీని సోమవారం లెక్కించారు. హుండీ ఆదాయం మొత్తం రూ. 1.67 లక్షలు వచ్చినట్టుగా ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి దేవేందర్‌శర్మ, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.మోహన్‌రెడ్డి, జీటీఎస్ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.జయరామయ్య, రామాంజనేయ స్వామి ఆలయ ఈఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని దరఖాస్తులను పరిశీలించాలి: సీపీఎం

వెంగళరావునగర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అందరి ఇళ్లకు వెళ్లి దరఖాస్తులను, ఇళ్లను పరిశీలించాలని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకటేష్, షహనాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరితహారం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని లిటిల్ స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అస్మతున్నీసా ఆధ్వర్యంలో సోమవారం హరితహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్కూల్‌లో పని చేస్తున్న సిబ్బంది, ఉపాధ్యాయులతో పాటు కాలనీవాసులతో ఆమె పెద్ద ఎత్తున మొక్కలు పంపిణీ చేశారు. టీచర్లతో కలిసి స్థానికంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాటిన మొక్కలను రక్షించుకుంటేనే హరితహారం లక్ష్యం నెరవేరుతుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: బంజారానగర్ 11కేవీ ఫీడర్ బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బంజారానగర్, ఎస్ఆర్‌టీనగర్, వినాయకరావునగర్, శివలింగనగర్, ఆర్కె నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. కళ్యాణ్‌నగర్‌పార్కు 11కేవీ ఫీడర్ బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ పార్కు, సారథి నగర్ సొసైటీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

ఖైరతాబాద్ టికెట్ దానం నాగేందర్‌కే





దానంకు టికెట్ కేటాయించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

బీఆర్ఎస్ ఖైరతాబాద్ అభ్యర్థి దానం బయోడేటా

నియోజకవర్గం: ఖైరతాబాద్
పార్టీ: బీఆర్ఎస్
అభ్యర్థి: దానం నాగేందర్
వయసు: 66
విద్యార్హత: ఎంఏ
రాజకీయ నేపథ్యం: మూడు సార్లు ఆసిఫ్ నగర్ ఎమ్మెల్యే, రెండు సార్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే, వైఎస్సార్ హయాంలో మంత్రి

ప్రకటించిన సీఎం కేసీఆర్

- నియోజకవర్గంలో హర్షాతిరేకాలు
- దానంకు శుభాకాంక్షల వెల్లువ


బంజారాహిల్స్: బీఆర్ఎస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గం అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రకటించడంతో గులాబీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఉదయం నుంచే ఖైరతాబాద్‌లో గులాబీ శ్రేణులు ఉత్కంఠగా ఎదురు చూడగా మధ్యాహ్నం స్వయంగా సీఎం నోటి నుంచి దానం పేరు వెలువడగానే నియోజకవర్గం వ్యాప్తంగా బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు.

- మహిళా కార్యకర్తలు నృత్యాలుచేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వచ్చి సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. దానం నాగేందర్‌ను మరోసారి అభ్యర్థిగా ప్రకటించడంతో కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన నృత్యాలతో వేదిక ప్రాంగణం ఆకట్టుకుంది.
- పలుచోట్ల మిఠాయిలు తినిపించుకొని కార్యకర్తలు నృత్యాలు చేశారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో గత రెండు నెలల నుంచి నాగేందర్ విస్తృతంగా పర్యటిస్తూ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. టికెట్ తప్పనిసరిగా తనకే వస్తుందన్న ధీమాను ఆయన ఎప్పటి నుంచో వ్యక్తంచేస్తూ సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా ఉంటున్నారు.
- ప్రతి సందర్భంలోనూ ఆయన కేసీఆర్, కేటీఆర్‌ను పొగడ్తలతో ముంచెత్తడమే కాకుండా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను జనంలోకి తీసుకెళ్లడంలో అందరికంటే ముందుంటున్నారు. ముఖ్యంగా సీఎం కేసీఆర్‌కు అత్యంత నమ్మకస్తుడిగా ముద్రపడ్డారు.

సీఎం సార్.. థ్యాంక్యూ: దానం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా తనకు మరోసారి అవకాశం కల్పించినందుకు సోమవారం తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి నాగేందర్ పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రెండోసారి అవకాశం కల్పించినందుకు ఆ నమ్మకాన్ని వమ్ముచేయనని భారీ మెజార్టీతో ఖైరతాబాద్‌లో గెలిచి కానుకగా ఇస్తానని స్పష్టం చేశారు.





మాగంటికి టికెట్టు.. గెలిస్తే హ్యాట్రిక్కు!



అభినందనలు తెలుపుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నేతలు

జూబ్లీహిల్స్: ఊహించినదే జరిగింది... బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేరును సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా కార్పొరేటర్లు, నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. ఎన్నికల మేనేజ్‌మెంట్ స్ట్రాటజీలో దిట్టగా పేరున్న గోపీనాథ్ రాబోయే ఎన్నికల్లో సైతం విజయదుందుభి మోగించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

రాజకీయ నేపథ్యం...

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామరావుతో సన్నిహిత సంబధాలు కలిగిన మాగంటి గోపీనాథ్ తొలుత హైదరాబాద్ నగర తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. ఎన్టీఆర్ మరణాంతరం చంద్రబాబుతో సన్నిహితంగా మెలిగి పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి మొట్టమొదటిసారి శాసనసభలో అడుగుపెట్టారు. మారిన రాజకీయ పరిణామాలు, టీడీపీ తెలంగాణలో ఉనికి కోల్పోవడంతో టీడీపీని వీడి బీఆర్ఎస్ (టీఆర్ఎస్)లో చేరారు. 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి అధిక మెజారిటీతో జూబ్లీహిల్స్ నుండి రెండవసారి విజయం సాధించారు. తాజాగా 2023 ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకువెళుతున్నారు.

ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో దిట్ట..

- ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో దిట్టగా పేరున్న మాగంటి గోపీనాథ్ ఎన్నికల సమయంలో వ్యవహరించే వ్యూహాలు ఎవరికీ అంతుపట్టవని పార్టీ శ్రేణులతో పాటు నేతలు చెబుతుంటారు. ఏ చిన్న పార్టీ కార్యక్రమమైనా, శుభకార్యమైనా హాజరవుతారని మాగంటికి పేరుంది. ప్రత్యర్థి ఎత్తులకు పై ఎత్తులు వేయడంలో మాగంటి గోపీనాథ్ మించిన వ్యక్తి లేడని పార్టీ నాయకులు చర్చించుకుంటారు. మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్‌తో మంచి సంబంధాలను కలిగి ఉన్నారు. ఎన్నికల్లో అలసట చెందక శ్రమిస్తారని, పార్టీకి నష్ట కలిగించే ఎంత పెద్ద నాయకుడైనా మొహమాటం లేకుండా పక్కనపెడతారని అనడానికి నియోజకవర్గంలో జరిగిన పలు పరిణమాలే నిదర్శనం. బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ టికెట్ మాగంటి ఖరారు చేయడంపై కార్పొరేటర్లు దేదీప్య, సి.ఎస్.రెడ్డి, రాజ్‌కుమార్‌పటేల్‌లతో పాటు సీనియన్ నేతలు జూబ్లీహిల్స్ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి బయోడేటా

పేరు: మాగంటి గోపీనాథ్
నియోజకవర్గం: జూబ్లీహిల్స్
పార్టీ: బీఆర్ఎస్
వయసు: 60 సంవత్సరాలు
విద్యార్హత: బీఏ
రాజకీయ నేపథ్యం: హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ (1987–89), టీడీపీలో కీలక భాధ్యతలు

- 2014లో టీడీపీ తరపున, 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు

గాయత్రీహిల్స్ జవహర్ కాలనీల.. క్రమబద్ధీకరణ బాధ్యత నాదే

ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ



గాయత్రీహిల్స్ కాలనీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: షేక్‌పేట మండలం జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని గాయత్రీహిల్స్, బంజారాహిల్స్ రోడ్ నెం. 2 జవహర్ కాలనీ నివాసితుల ఇళ్ల క్రమబద్ధీకరణ పూర్తి బాధ్యత తనదేనని ఒక్క పైసా కూడా ఎవరూ చెల్లించొద్దదని ఈ మేరకు తాను త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌తో హామీ తీసుకుంటానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం మరింత పట్టుదలగా ఉంటే మార్కెట్ విలువలో పది శాతం మాత్రమే చెల్లించేలా ప్రత్యేక జీవో తెప్పిస్తానని ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని, తనదే పూర్తి బాధ్యత అని ఈ వ్యవహారంపూర్తిగా తాను చూసుకుంటానని అన్నారు. గాయత్రీహిల్స్ కాలనీవాసులతో సోమవారం జరిగిన సమావేశంలో దానం మాట్లాడుతూ... మూడోసారి ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ దిశగా సాగుతున్న సీఎం కేసీఆర్‌ను అందరం ఆశీర్వదించాలని తనను కూడా మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఫోన్‌లో మాట్లాడి ఈ కాలనీలో ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం హామీ తీసుకున్నారు. ఇటీవల కొన్ని ఇళ్లకు ప్రభుత్వం స్థలం అనే బోర్డులు ఏర్పాటయ్యాయని అక్కడి నుంచే రెవెన్యూ అధికారులను తూర్పారబట్టి అధికారులను అప్పటికప్పుడే రప్పించి ఆ అక్షరాలను తుడిచేయించారు. కార్యక్రమంలో గాయత్రీహిల్స్ సంక్షేమ సంఘం నేతలు వెంకటేష్, శివ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: దానం

పంజగుట్ట: కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనదృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ప్రేమ్‌నగర్ పంచాయతీ కమిటీ, జై జవాన్ జై కిసాన్ యువజన సంఘం, ప్రేమ్‌నగర్ మహిళా మండలి, అంబేడ్కర్ సేవా సంఘం చేసిన విజ్ఞప్తుల మేరకు సోమవారం ప్రేమ్‌నగర్ బస్తీలో బస్తీబాట కార్యక్రమం నిర్వహించి మొత్తం రూ. 70 లక్షల మేర పనులకు మంజూరు చేయించారు. నేతలు దాసరి విశ్వనాథం, మహేష్ కుమార్, టి.వెంకటేష్, కె.భగవాన్ దాస్, మున్నా, రావుల విజయ్, మధురవేణి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ కుకీ గిరిజనుడి ఆత్మహత్య

బంజారాహిల్స్: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లలో ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కుకీ గిరిజన తెగకు చెందిన దంపతులు పొట్టకూటి కోసం ఇటీవల నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీరాంనగర్‌బస్తీలో గది అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందులు మరింత పెరగడం, భార్యా భర్తల మధ్య గొడవలు తలెత్తడంతో మణిపూర్‌కు చెందిన కొంకాయ్ వెపే(59) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఈ నెల 19న డ్యూటీకి వెళ్ళి తిరిగి వచ్చిన కొంకాయ్ డబ్బుల విషయంలో భార్య చోంగ్ లారెమ్‌తో గొడవ పడ్డాడు. ఆమె తన సోదరి ఇంటికి వెళ్ళిపోయింది. ఆ తెల్లవారి వచ్చి తలుపు తట్టగా ఎంతకూ తెరవకపోవడంతో వంట రూమ్ కిటికీలో నుంచి చూడగా వెంటిలేటర్‌గా వేలాడుతూ కనిపించాడు. ఈ మేరకు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసిపట్టాలి



వర్షపు నీటి నిల్వలపై అవగాహన పెంచుకుంటున్న సంస్కార్ విద్యార్థులు



శ్రీనగర్‌కాలనీ: పడిన ప్రతి వర్షపు చుక్కనూ కాపాడి భూగర్భంలోకి పంపితే భవిష్యత్‌తరాలకు నీటి కొరత ఉండదని.. జలాశయాలను ఎలా కాపాడాలో విద్యార్థులు తెలుసుకొని అవగాహన పెంచుకున్నారు. సోమవారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు జూబ్లీహిల్స్‌లోని జీహెచ్‌ఎంసీ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌ను సందర్శించి పలు విషయాలను తెలుసుకున్నారు. వర్షపు నీటి విలువ, వాటిని నిల్వ చేసి ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన పెంచుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వెంగళరావునగర్: రోడ్డు దాటుతున్న వ్యక్తి(45)ని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. యూసుఫ్‌గూడ బస్తీ సమీపంలో ఉన్న హైదరాబాద్ మండీ వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. గుర్తు తెలియని వాహనం వచ్చి అతనిని ఢీకొట్టి వెళ్లింది. పోలీసులు క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ సెంటర్‌లో దాడి చేసిన వారిపై ఫిర్యాదు

పంజగుట్ట: మసాజ్ సెంటర్‌లో యువకుడిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల సమాచారం మేరకు... ప్రకాశం జిల్లా భీమవరానికి చెందిన జె.శ్రీకాంత్ ఆదివారం నగరానికి వచ్చి సెకండ్ హ్యాండ్ కారు కొనుగోలు చేశాడు. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి సోమాజిగూడలోని శ్రీ లక్ష్మి బ్యూటీ స్పా సెంటర్‌కు వచ్చారు. అక్కడ సిబ్బందిని కలవగానే వారు ఆయిల్ మసాజ్‌కు ఓ రేటు, పూర్తి మసాజ్‌కు మరో రేటు చెప్పడంతో వారు ఇది సరైన ప్లేస్ కాదు ఇక్కడ నుంచి వెళ్లిపోయేందుకు యత్నించారు. అక్కడి సిబ్బంది గట్టిగా అరవడంతో మరో ముగ్గురు సిబ్బంది వచ్చి నలుగురినీ ఓ గదిలో బంధించేందుకు యత్నించగా శ్రీకాంత్ తప్పించుకుని బయటకు వచ్చాడు. స్నేహితుల్లో ఒకడైన రాజశేఖర్‌ను స్పా సిబ్బంది రాడ్‌తో కొట్టడంతో తలకు బలమైన గాయం అయ్యింది. దీంతో బాధితులు పంజగుట్ట పోలీసులను ఆశ్రయించారు. బ్యూటీ, స్పా సెంటర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా నాగుల పంచమి

- భక్తులతో కిటకిటలాడిన నాగదేవత ఆలయాలు
- పాలు పోసేందుకు బారులు తీరిన భక్తులు



పుట్టలో పాలు పోస్తున్న విజయారెడ్డి...

బంజారాహిల్స్: శ్రావణ మాసంలో నాగులపంచమి వేడుకకు విశేష ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా మహిళలు నాగేదేవతా ఆలయాలకు చేరుకొని విశేష పూజలు నిర్వహించారు. సోమవారం నాగులపంచమి వేడుకలు ఆలయాల్లో వైభవంగా జరిగాయి. ఫిలింనగర్ దైవసన్నిధానం, జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయంతో పాటు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని శ్రీ నాగదేవతా గణపతి సహిత సుబ్రమణ్యేశ్వరస్వామి, నాగార్జున నగర్‌లోని నాగ దేవత ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలోని నాగదేవత ఆలయ వార్షిక పూజల్లో ఆలయ ఫౌండర్ ట్రస్టీ విష్ణువర్ధన్‌రెడ్డి..



జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో...



నాగార్జున నగర్‌లో పాలు పోస్తున్న భక్తులు...



బంజారాహిల్స్ రోడ్ నెం. 13లోని నాగదేవత పుట్టవద్ద..

పర్మనెంట్ చేసే వరకు పోరాటం ఆగదు

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో పాటు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సోమవారం కార్మికులు నిరసన గళమెత్తారు. జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయం వద్ద జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో విధులు నిర్వహిస్తున్న 300 మందికి పైగా జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, ఎలక్ట్రికల్ ఉద్యోగులు, డ్రైవర్లు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం తెలపడంతో పాటు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా నగర అభివృద్ధిలో రెక్కలు ముక్కలుచేసుకొని పని చేస్తున్న తమను ప్రభుత్వం జీతాలు పెంచడంతో సరిపెడుతున్నదని తమకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించడం లేదని ఆందోళన చేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు తమ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. నిరసనలో ఎస్ఎఫ్ఏలు శ్రీనివాస్, లవకుమార్, గడ్డం కృష్ణ, షానప్ప, మహేందర్, లక్ష్మణ్, కోటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం కార్మికులు మధ్యాహ్నం అక్కడే వంటలు చేసుకొని రోడ్డుపై కూర్చొని భోజనాలు చేశారు. పీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి పాల్గొని కార్మికుల నిరసనకు సంఘీభావం తెలిపారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

60, 70 శాతం ఫీజు తీసుకోండి

ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజుపై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజు వసూళ్లకు సంబంధించి హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. మొత్తం ఫీజులో ఏ-కేటగిరీ విద్యార్థుల నుంచి 60 శాతం, బీ-కేటగిరీ విద్యార్థుల నుంచి 70 శాతమే తీసుకోవాలని కాలేజీలను ఆదేశించింది. మిగతా ఫీజు చెల్లింపు ఎలా అన్నది తుది ఉత్తర్వుల్లో వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుతూ ప్రభుత్వం జీవో నంబర్ 107ను తీసుకొచ్చిందని, నిబంధనలకు విరుద్ధంగా తీసుకొచ్చిన దీన్ని రద్దు చేయాలని కోరుతూ డాక్టర్ వెంకటదుర్గ అశోక్‌తో పాటు మరో 221 మంది పీజీ విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ చిల్లకూర్ సుమలత విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సామ సందీప్‌రెడ్డి వాదనలు వినిపించారు. కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా రెండింటిలోనూ 179 శాతం నుంచి 296 శాతం వరకు ఫీజులు పెంచడం సమర్థనీయం కాదని, చట్టప్రకారం చదువుకునే హక్కును హరించినట్లే అవుతుందన్నారు. ఇప్పటికే ఈ ఫీజులకు సంబంధించిన పిటిషన్ ఇదే హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రస్తుతానికి విద్యార్థుల నుంచి 60 శాతం, 70 శాతం మాత్రమే ఫీజు తీసుకోవాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా తెలంగాణ నేతలు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా రాష్ట్రానికి చెందిన పలువురు ముఖ్యనేతలను నియమిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన వారిలో మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌తోపాటు పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలున్నారు. మాజీ ఎంపీలు డి.రవీంద్రనాయక్, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రమేశ్ రాథోడ్, చాడ సురేశ్‌రెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యేలు టి.రాజేశ్వర్‌రావు, వి.జయపాల్, వన్నాల శ్రీరాములు, జి.రామకృష్ణారెడ్డి, బొడిగె శోభ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయసుధ, ఆకుల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు.

ఉద్యోగి 'కరువు' తీరేలా!

- ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో సీఎం జగన్ శుభవార్త
- ఉద్యోగులకు దసరాకి 'డీఏ'
- వైద్య ఆరోగ్యశాఖలో మహిళలకు 5 అదనపు సెలవులు
- ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు
- ఉద్యోగులు లంచగొండులని మనసులో మాట పుస్తకంలో స్వయంగా రాసుకున్నారు
- ఆ పుస్తకాన్ని ప్రతి ఉద్యోగీ చదవాలి





విజయవాడలో జరిగిన ఏపీఎన్జీవోల సంఘం మహాసభకు హాజరైన ఉద్యోగులు

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు దసరా పండుగ కానుకగా 2022 జూలై ఒకటికి సంబంధించిన డీఏ ఇవ్వనున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. బకాయి ఉన్న రెండు డీఏల్లో ఒకటి పండుగ రోజు ఇస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో మహిళా ఉద్యోగులకు ఇతర శాఖల ఉద్యోగుల మాదిరిగానే 5 రోజులు అడిషనల్ లీవులు ఇస్తామని చెప్పారు. సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ ఎన్జీవోల సంఘం 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సీఎం జగన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల ప్రయోజనాలు, వారికి మంచి చేసే విషయంలో గతంలోని అన్ని ప్రభుత్వాల కంటే ఎంతో ముందున్నామని తెలిపారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాం

2019లో అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు ఆర్నెల్లలోనే గ్రామ స్థాయిలో సేవలను అందుబాటులోకి తెచ్చాం. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో ఎంత కమిట్‌మెంట్ చూపించామంటే ఏకంగా 1.35 లక్షల శాశ్వత ఉద్యోగాలను ప్రతి గ్రామం, మున్సిపాలిటీ వ్యవస్థలో సచివాలయ వ్యవస్థ ద్వారా రిక్రూట్ చేశాం. చాలామంది ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం అసాధ్యమన్నారు. అయినాసరే ఆర్టీసీ ఉద్యోగులపై మమకారంతో కమిట్‌మెంట్‌లో ఎక్కడా లోపం చేయలేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం మీరందరూ చూశారు. పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచిన ప్రభుత్వం మనందరిది. గత ప్రభుత్వ హయాంలో అతి తక్కువ జీతాలకు పని చేస్తూ ఎన్నికలకు 6 నెలలు ముందు వరకు రూపాయి కూడా జీతం పెరగక దయనీయ పరిస్థితిలో ఉన్న ఉద్యోగుల జీతాలను మనం వచ్చాక పెంచాం. గత పాలకులు ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు వారికి జీతాలు పెంచాలనే ఆలోచనే చేయలేదు. ఓట్లు వేయించుకోవాలన్న దుర్బుద్ధితో ఎన్నికలకు ముందు పెంచారు. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీతాలను మరింత పెంచి మొట్ట మొదటి రోజు నుంచి పెంచిన జీతాలు ఇస్తున్నాం. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వీఓఏలు, మెప్మా రీసోర్స్ పర్స న్లు, శానిటేషన్ వర్కర్లు, గిరిజన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, హోంగార్డులు, మధ్యాహ్న భోజనం వండే ఆయాలు.. వీరందరి జీతాలను మనమే మనసు పెట్టి పెంచి ఇస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.1,100 కోట్లు మాత్రమే ఉండే జీతాల బడ్జెట్ ఇప్పుడు రూ.3,300 కోట్లకు ఎగబాకినా చిరునవ్వుతో అందరికీ మంచి చేస్తున్నాం.

ప్రభుత్వ రంగాల మూసివేతలో రికార్డు బాబుదే

ప్రభుత్వ రంగాలను మూసివేయడం, వీఆర్ కూడా ఇవ్వకుండా గోల్డెన్ హ్యాండ్ షేక్ అంటూ ఉద్యోగులను ఇంటికి పంపడంలో గత ప్రభుత్వానిది ఓ అడ్డగోలు రికార్డు. కొన్నేళ్ల క్రితం చంద్రబాబు నాయుడు రాసిన మనసులో మాట పుస్తకాన్ని ప్రతి ఉద్యోగీ చదవాలని విజ్ఞప్తి చేస్తున్నా. (మనసులో మాట పుస్తకంలో కొన్ని అంశాలను సీఎం జగన్ చదివి వినిపించారు). ఓ విద్యా సంవత్సరానికి కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగుల ఎంపిక ప్రారంభించామని, ప్రభుత్వ ఉద్యోగాలను కాంట్రాక్టు ప్రాతిపదికన ఇవ్వాలని, సిబ్బంది సంఖ్యను తగ్గించడానికి అది ఉత్తమ మార్గమని చంద్రబాబు తన మనసులో మాట చెప్పారు. విద్యుత్ సంస్థ ఉద్యోగుల్లో 66 శాతం, పౌర సరఫరాల సంస్థలో 65 శాతం, రెవెన్యూలో 64 శాతం, పోలీసు శాఖలో 62 శాతం, స్థానిక సంస్థల్లో 52 శాతం మంది అవినీతిపరులేనని తేలినట్లు చంద్రబాబు స్వయంగా ఆ పుస్తకంలో రాసుకున్నారు.

హైకోర్టు విచారణలు ప్రత్యక్ష ప్రసారం

▶ మొదటి పేజీ తరువాయి

అయన ప్రత్యక్ష ప్రసార సేవలను ప్రారంభించి.. న్యాయవాదులకు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత 10.30గ. నుంచి కోర్టుల విచారణలు ప్రత్యక్ష ప్రసారమయ్యాయి. ప్రత్యక్ష ప్రసారాలతో న్యాయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువవుతుందని సీజే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

లింక్ క్లిక్ చేస్తే...

హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారాలకు సంబంధించిన లింక్ ఇచ్చారు. ఈ లింక్ ద్వారా కోర్టును ఎంపిక చేసుకుని ప్రత్యక్ష ప్రసారాలు వీక్షించవచ్చు. ఫస్ట్ కోర్టు విచారణ ప్రత్యక్ష ప్రసారం ఇప్పటికే అందుబాటులో ఉంది. కరోనా సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు కొనసాగగా, ఆ తర్వాత హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడుతున్నారు. 2020లో ప్రత్యక్ష ప్రసారాలను అందుబాటులోకి తెచ్చిన గుజరాత్ హైకోర్టు, ఆ తర్వాత యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభించింది. కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, కోల్‌కతా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టులు కూడా ప్రత్యక్ష ప్రసారాలు, యూట్యూబ్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చాయి. ప్రత్యక్ష ప్రసారాలతో పారదర్శకత పెరుగుతుందని న్యాయ నిపుణులు పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇదిలాఉండగా, హైకోర్టు, కింది కోర్టుల విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ 2022లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) కూడా దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన నాటి సీజే ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారాలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులోభాగంగా ప్రసారాలకు కావాల్సిన మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.


లోక్‌సభ ఎన్నికల కోసమేనా..?

కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీపై చర్చ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి గజ్వేల్‌తో పాటు, కామారెడ్డిని కూడా ఎంచుకోవడం ఉమ్మడి మెదక్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. 2014, 2018 ఎన్నికల్లో గజ్వేల్ నుంచి ఘన విజయం సాధించిన కేసీఆర్.. తన హయాంలో గజ్వేల్ రూపురేఖలు మార్చేశారు. తాజాగా ఆయన కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో ఆ నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో ఉంచుకునే కేసీఆర్ కామారెడ్డిని కూడా ఎంచుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కామారెడ్డి అసెంబ్లీ స్థానం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉంటుంది. కామారెడ్డిలో పోటీ చేయడం ద్వారా జహీరాబాద్‌తో పాటు, నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు సునాయాసంగా అవుతుందనే ఉద్దేశంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకుని ఉండి ఉంటారనే చర్చ జరుగుతోంది.

మహిళపై మితిమీరిన బలప్రయోగమా?

- పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు న్యాయమూర్తి
- ఎస్టీ మహిళపై దాడిని విచారణకు స్వీకరించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఎస్టీ మహిళపై అత్యంత పాశవికంగా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఉదంతంపై జడ్జి సూచన మేరకు హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. 'ఆగస్టు 15న రాత్రి ఎల్బీనగర్ సర్కిల్‌లో పోలీసులు తమ వాహనంలో వి.లక్ష్మిని ఎక్కించుకొని పోలీస్ స్టేషన్ తరలించి ఆమెను చిత్రహింసలకు గురి చేశారు. రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో ఉంచి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఆమె ఎదురు తిరిగితే సంగతి తెలుస్తామంటూ మోకాళ్ళు, పిక్కలు, తొడలపై లాఠీలతో చితకబాదారు. తర్వాతి రోజు ఉదయం మరో పోలీస్ అధికారి వచ్చి ఇంటికి పంపించాలని చెప్పడంతో వదిలిపెట్టారు' అంటూ ఓ పత్రికల్లో ప్రచురితమైన వార్తకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా స్పందించారు. సుమోటో పిల్‌గా విచారణ చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. పోలీసులు చట్టానికి కట్టుబడి ఉండాలని, ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాడి సమయంలో బాధితురాలు డబ్బును, ఒంటిపై ఉన్న నగలను కూడా కోల్పోయిందని వాటిని రికవరీ చేసి అప్పగించేలా ఆదేశాలివ్వాలని కోరారు. మహిళపై దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవడమే కాదు.. ఎస్సీ/ఎస్టీల (అట్రాసిటీల నిరోధక) చట్టం-1989లోని నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని అభ్యర్థించారు. ఈ లేఖను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, రాచకొండ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఏసీపీ, ఎల్‌బీ నగర్ ఎస్‌హెచ్‌ఓను ప్రతివాదులుగా చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై ఒకట్రెండు రోజుల్లో సీజే ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

పేదలపై దౌర్జన్యాలు పెరిగాయి

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



పంజగుట్ట (హైదరాబాద్): పలుకుబడి లేని వర్గాలపై పోలీసులే కాకుండా అధికారంలో ఉండే వారు కూడా దౌర్జన్యాలు చేస్తున్నారని బహుజన సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. సోషల్ డెమోక్రటిక్ ఫోరం (ఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పేదలపై పోలీసుల దౌర్జన్యాలు- ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దళిత స్త్రీ శక్తి అధ్యక్షురాలు జి.ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ఎస్‌డీఎఫ్ కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ పద్మజాషా, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, లిక్కర్ స్కాంలో కవితను, పేద మహిళ లక్ష్మిని విచారించే తీరు చూస్తేనే పోలీసుల తీరు అర్థమవుతుందన్నారు. కవితను విచారణ కోసం నోటీస్ పంపి మీ ఇంటికి రావొచ్చా అని విజ్ఞప్తి చేశారని, భర్త చనిపోయి, పొట్ట నింపుకునేందుకు కష్టపడుతున్న మహిళను అనుమానాస్పదంగా తిరుగుతోందని పెట్రోలింగ్ పోలీసులు పట్టుకెళ్లి చిత్రహింసలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే పోలీసులు మఫ్టీల్లో వచ్చి ఎత్తుకెళుతున్నారని, సీఎం సభ ఉందంటే చాలు ముందస్తు అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నగర వార్తలు

నేడు పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు (22న) పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు (టీఎస్-సీపీఈటీ) విడుదల కానున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 నిమిషాలకు వైర్మన్ ప్రొ.లింబాద్రితో పాటు ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఫలితాలను విడుదల చేయనున్నట్లు టీఎస్‌సీపీఈటీ-2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి సోమవారం తెలిపారు.

వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే



వృద్ధులతో ఫ్యాషన్ షో

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని లకోటియా కాలేజీ ఆఫ్ డిజైన్ విద్యార్థులు సోమవారం వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డేను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెట్రో బాలీవుడ్ గ్లామర్ థీమ్‌తో వృద్ధులతో క్యాట్‌వాక్ చేయించి ఆకట్టుకున్నారు. వృద్ధాప్యాన్ని కూడా మర్చిపోయి పలువురు ఉత్సాహంగా ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. కార్యక్రమంలో నిర్వాహకులు అఫాన్ అజర్, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఎంటెక్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంటెక్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూలోని సౌత్ క్యాంపస్‌లోని సీఐఎస్ భవనంలో ఈనెల 25వ తేదీన ఈ స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గేట్‌కు అర్హత సాధించిన వారు ఇందులో పాల్గొనే అవకాశం ఉంది. స్పాట్ అడ్మిషన్ పొందాలనుకునే వారు ఉదయం 9.30 గంటలకు రిపోర్టు చేయాలి. కంప్యూటర్‌సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, బయోఇన్ఫర్మాటిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మైక్రో ఎల్రక్టానిక్స్, వీఎల్‌ఎస్‌ఐ డిజైన్, మెటీరియల్ ఇంజనీరింగ్, నానోసైన్స్ టెక్నాలజీ, మోడలింగ్, ఐసీటెక్నాలజీ వంటి కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోని ఎంటెక్ కోర్సుల్లో అడ్మిషన్ పొందాలని అధికారులు కోరారు.

కొత్త గుర్తింపు ఇవ్వడం కోసమే 'స్వేరో'



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

సుల్తాన్‌బజార్: సమాజంలో తరతరాలుగా తీవ్ర అణచివేతకు గురైన జాతులకు కొత్త గుర్తింపు ఇవ్వడం కోసమే స్వేరో పదం సృష్టించానని బహుజన సమాజ్ పార్టీ, స్వేరోస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరిలో స్వేరో పదానికి చోటుదక్కిన సందర్భంగా సోమవారం సాయంత్రం తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన స్వేరోస్ విజయోత్సవ సభలో ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో పురుడు పోసుకున్న స్వేరోస్ పదం నేడు విశ్వవ్యాప్తమైందన్నారు. స్వేరో పదం కొత్త ఆలోచనలకు, అభిప్రాయాలకు నాంది కావాలన్నారు. కుల మతాలకు అతీతంగా స్వేరోస్ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎంవి.రెడ్డి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బంగ్యా బుక్యా, స్వేరోస్ చైర్మన్ ప్రవీణ్ మామిడాల, కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, ట్రూ టీచర్స్ కొయిలేషన్, అధ్యక్షులు ఆశీర్వాదం, అరికంటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో 59 డిమాండ్ నోటీసుల గుబులు

కలెక్టర్‌కు బాధితుల మొర

సాక్షి, సిటీబ్యూరో : ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ డిమాండ్ నోటీసులు గుబులురేపుతున్నాయి. రెవెన్యూ అధికారులు 59 జీఓ కింద పొంతన లేని ధరలు విధించి డిమాండ్ నోటీసులు పంపడం ఆందోళన కలిగిస్తోంది. ఈ మేరకు సోమవారం పలువురు బాధితులు కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి మొరపెట్టుకున్నారు. కనీసం వేల రూపాయలు కట్టలేని తమకు లక్షలాది రూపాయల డిమాండ్ నోటీసులు పంపించి పదేపదే ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. దినసరి పోషణ భారంగా మారగా తాము అంత పెద్ద మొత్తాన్ని ఎలా చెల్లించాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. షేక్‌పేట మండలంలోని గాయత్రిహిల్స్‌లోని ఓ మైనార్టీ మహిళకు చెందిన 71 గజాలకు రూ.11,43,100 డిమాండ్ నోటీసు అందింది. ఎస్పీటీ నగర్‌లోని మరో మహిళకు చెందిన 67 గజాలకు ఏకంగా రూ.34,12,000 నోటీసు, బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని ఇంకో మహిళకు చెందిన 49.5 గజాలకు రూ.7,46,213 నోటీసు ఇచ్చారు. కాగా, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్ హయత్‌నగర్ గ్రామంలోని మరో మహిళకు చెందిన 204 గజాలకు రూ.35,19,000, మరొకరికి 102 గజాలకు రూ.7,08,800 పంపించారు. స్థానిక ప్రభుత్వ రేట్లను పరిశీలించకుండానే రెవెన్యూ అధికారులు యాప్ ద్వారా ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించి దరఖాస్తుదారులకు పంపించడం విస్మయానికి గురిచేస్తోందని వాపోయారు. తాము ఉంటున్న 50 నుంచి 70 గజాల ఇంటికి పట్టుమని రూ.10 లక్షల విలువ లేకున్నప్పటికీ అధికారులు అంతకు రెండు, మూడు రెట్ల ధరలతో తమకు డిమాండ్ నోటీసులు పంపించారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 125 గజాలలోపు ఉన్న తమ ఇళ్లను 59 జీఓ కింద రెగ్యులరైజ్ చేసుకుంటే ఆస్తిపై హక్కు లభిస్తోందని ఆశతో దరఖాస్తు చేసుకుంటే.. ఇప్పుడు డబ్బులు చెల్లించడం తలకు మించిన భారంలా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఏసెజ్' సేవలు ప్రశంసించిన మేయర్



సాక్షి,సిటీబ్యూరో: ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన 17 స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఏసెజ్ సంస్థ చేస్తున్న కృషిని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రశంసించారు.

సోమవారం సంస్థ ప్రతినిధులు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ని మర్యాదపూర్వకంగా కలిసి వారు చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న విపత్తులు, కరువు, వాతావరణ కాలుష్యం, తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఏసెజ్ సంస్థ 175 దేశాలలో ప్రముఖ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు.కార్యక్రమంలో ఏసెజ్ సంస్థ ప్రతినిధులు జేమ్స్ , బెంగ్యా తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో వాణి వినిపించేందుకు కొత్త పార్టీ

పంజగుట్ట: పార్లమెంట్, రాజ్యసభ, శాసనసభ, శాసనమండలి, పురపాలక సంఘాల్లో కూడా మాజీ సైనికులు ఎవరూ లేరని.. వారి సమస్యలపై చట్టసభల్లో వాణి వినిపించేందుకు సకల జనుల పార్టీని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ జేఏసీ వ్యవస్థాపకుడు రావుల రంగారెడ్డి వెల్లడించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మా ఓట్లు మేమే వేసుకుని మానుంచి ఓ ప్రతినిధిని చట్టసభల్లోకి పంపడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ప్రస్తుతం తెలంగాణలోనే పార్టీ పనిచేస్తుందని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోపు దేశవ్యాప్తంగా విస్తరించి మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాలు ఎక్కువగా ఉన్న 150 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. ఈ నెల 27న పార్టీ విధివిధానాలు, మేనిఫెస్టో ప్రకటిస్తామన్నారు. తమ సంఖ్యా బలం ఎక్కువగా ఉన్న కంటోన్మెంట్ టికెట్‌ను మాజీ సైనికులకు కేటాయించాలని కోరారు. సమావేశంలో జేఏసీ కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

'ఐక్రియేట్' ఆధ్వర్యంలో రోడ్ షోస్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయంగా స్వయం ఉపాధి, సాంకేతిక ఆవిష్కరణలకు పేరొందిన ఐక్రియేట్ ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ సంస్థ శాస్త్ర సాంకేతిక విద్యను అందించే పలు శిక్షణా సంస్థలతో కలిసి ''ఇవింగలైజ్-23'' పేరిట రోడ్ షోస్ నిర్వహిస్తోంది. ఈ రోడ్ షోస్‌లో నగరానికి చెందిన బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సిబిఐటి, జెఎన్‌టీయూ, టీబీఐ, ఏఐసీ టీ-హబ్, బిట్స్‌పిలానీ పాల్గొన్నాయి. ఎల్రక్టానిక్ వాహనాలకు సంబంధించి వినూత్న ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, స్టార్టప్స్ వంటి అంశాలపై ఈ రోడ్ షోస్ అవగాహన కల్పిస్తున్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

తనిష్క్‌లో ఆర్ణ కలెక్షన్స్

పంజగుట్ట: శ్రావణమాసం వర మహాలక్ష్మి పండగను పురస్కరించుకుని తనిష్క్ సోమాజిగూడలో ఆర్ణ పేరుతో కాలాతీత ఆభరణాల కలెక్షన్స్‌ను సోమవారం ప్రారంభించారు. నెక్‌వేర్, హారాలు, జడ, వంకీ, నడుము బెల్ట్‌లు, చెవిపోగులు, బ్యాంగిల్స్, కలర్ స్టోన్స్, ముత్యాలు ఉన్నాయని ఫ్లోర్ మేనేజర్ బాలకృష్ణ రామచంద్ర తెలిపారు. ప్రతీ బంగారు ఆభరణాల కొనుగోలుపై ఒక గోల్డ్ కాయిన్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.





జాతీయస్థాయి చెస్ క్రీడాకారిణికి

రాష్ట్ర టోర్నమెంట్‌లో ప్రవేశం నిరాకరణ..

ఆవేదన వ్యక్తం చేసిన క్రీడాకారిణి తల్లిదండ్రులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎల్‌బి స్టేడియం వేదికగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన అండర్ 11 బాలికల తెలంగాణ రాష్ట్ర సెలక్షన్స్‌లో 8 ఏళ్ల జాతీయ స్థాయి చెస్ క్రీడాకారిణి జస్విన్ కౌర్ (ఎఫ్ఐడీఈ ఐడి-33396973) పాల్గొనకుండా తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎస్ ప్రసాద్ అడ్డుకున్నారని క్రీడాకారిణి తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2వ రౌండ్ సమయంలో నిరసన చేపట్టడంతో 45 నిమిషాల పాటు సెలక్షన్స్‌కు అంతరాయం ఏర్పడగా, విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఈడిగ ఆంజనేయగౌడ్, టీఎస్‌సీఎస్‌సీఎల్ చైర్మన్ రవీందర్ సింగ్, ఆసియా చెస్ ఫెడరేషన్ డిప్యూటీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ చౌహాన్ జోక్యం చేసుకోవడంతో 2వ రోజు నుంచి జస్విన్ కౌర్ సెలక్షన్స్‌లో పాల్గొనడానికి అవకాశం లభించింది. రాష్ట్ర టోర్నమెంట్‌లో ప్రవేశించకుండా అనుచితంగా ప్రవర్తించడం క్రీడాకారులకు నష్టాన్ని చేకూర్చుతుందని, ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎస్ ప్రసాద్ బేషరతుగా క్షమాపణ లేఖను అందించాలని క్రీడాకారిణి తల్లిదండ్రులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

స్క్వాష్ క్లోజ్డ్ ఛాంపియన్‌షిప్ విజేతలుగా రోహన్, ఆర్య



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గేమ్ పాయింట్ హైటెక్ ఎరీనా వేదికగా నిర్వహించిన తెలంగాణ స్క్వాష్ క్లోజ్డ్ ఛాంపియన్‌షిప్‌లో రోహన్ ఆర్య గొండి, ఆర్యా ద్వివేది జంట పురుషుల, మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

తెలంగాణ స్క్వాష్ రాకెట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన రోహన్ 11-1, 11-0, 11-1 పాయింట్లతో కరన్ వశిష్ఠను ఓడించగా, ఆర్య 11-4, 5-11, 11-8, 11-3 పాయింట్లతో అగ్రశ్రేణి క్రీడాకారిణి ఈశ్వరియా పయ్యన్‌ను ఓడించింది. 3 రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో 96 మ్యాచ్‌లలో 98 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ పార్లమెంట్ సభ్యురాలు రేణుకా నీలకంఠ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ., శారీరక శ్రేయస్సుకు క్రీడలో ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఆర్ఏ వైస్ ప్రెసిడెంట్ వి.శ్రీశైలం, కార్యదర్శి శ్రీవాసు సుధాగాని, మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర కార్యదర్శి డా.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్.. అవయవ దానం



సంజయ్

లక్డీకాపూల్: రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌కు గురైన బైక్ మెకానిక్ అవయవాలను కుటుంబసభ్యులు జీవన్‌దాన్‌కు దానం చేశారు. జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందినే సంజయ్ తులసిరామ్(35) బైక్ మెకానిక్. రోడ్డు పక్కన బైక్‌లకు మరమ్మత్తులు చేసే సంజయ్‌ని ఈ నెల15వ తేదీన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. యాప్రాల్ బాలాజీనగర్ ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన సంజయ్‌ని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల18న బ్రెయిన్ డెడ్‌కు గురవడంతో అవయవదానం పట్ల జీవన్ కోఆర్డినేటర్ అవగాహన కల్పించడంతో అతని అవయవాలను దానం చేసేందుకు మృతుని భార్య ముందుకు వచ్చింది. సంజయ్ కాలేయం, రెండు కళ్లను దానం చేశారు.

శ్రద్ధా కాప్రాను అందరూ 'మైక్రోసాఫ్ట్ వాలీ దీదీ' అని పిలుస్తారు. శ్రద్ధ బంగారంలాంటి మైక్రోసాఫ్ట్ ఉద్యోగాన్ని వదిలేసింది. 'యువత కెరీర్ కోసం గైడెన్స్ అవసరం' అని 'అప్నా కాలేజ్' పేరుతో ఓ యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది. రెండేళ్లలో 40 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ అయ్యారు. మైక్రోసాఫ్ట్ జీతం కన్నా ఎన్నో రెట్ల ఆదాయం శ్రద్ధకు వస్తోంది. ఏ కోర్సు చదవాలి, ఏ ఉద్యోగం చేయాలి లాంటి సలహాలు ఎప్పటికప్పుడు ట్రెండ్‌కు తగినట్టు ఇవ్వడమే శ్రద్ధ సక్సెస్‌కు కారణం.

సక్సెస్ స్టోరీ

సలహాల అక్క


శ్రద్ధా కాప్రా

'హరియాణలోని చిన్న పల్లెటూరు మాది. మా నాన్న గవర్నమెంట్ ఉద్యోగైనా నేను ఏం చదవాలో గైడ్ చేయడం ఆయనకు తెలియదు. టీచర్లు కూడా గైడ్ చేస్తారనుకోవడం అంత కరెక్ట్ కాదు. ఇప్పటికీ కాలేజీ స్థాయి నుంచి యువతకు తమ కెరీర్ పట్ల ఎన్నో డౌట్లు ఉంటాయి. వారికి గైడెన్స్ అవసరం. ఎప్పటికప్పుడు విషయాలు తెలుసుకుని గైడ్ చేయాలి. నేను కొద్దిగొప్పో చేయగలుగుతున్నాను కాబట్టే ఈ ఆదరణ' అంటుంది శ్రద్ధా కాప్రా.

ఈమెకు లక్షలాది మంది అభిమానులు ఉన్నారు ఈనాటి కాలేజీ విద్యార్థుల్లో. ముఖ్యంగా ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌లో. వీరంతా శ్రద్ధను 'శ్రద్ధా దీదీ' అని,'మైక్రోసాఫ్ట్ వాలీ దీదీ' అని పిలుస్తారు. ఆమె చేసే వీడియోలను వారు విపరీతంగా ఫాలో అవుతారు. ఆ వీడియోల్లో ఆమె చెప్పే సలహాలను వింటారు.

డాక్టర్ కాబోయి...

శ్రద్ధ తన బాల్యంలో టీవీలో ఒక షో చూసేది. అందులో డాక్టర్లు తాము ఎలా క్లిష్టమైన కేసులు పరిష్కరించారో చెప్పేవారు. ఆ షో చూసి తాను డాక్టర్ కావాలనుకుని ఇంటర్‌లో 'పిసిఎంబి' (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, బయాలజీ) తీసుకుంది. కాని జూనియర్ ఇంటర్ పూర్తయ్యే సరికి డాక్టర్ కావడం చాలా కష్టమని అర్థమైంది. అందుకే మేథ్స్‌వైపు దృష్టి సారించింది. 'చిన్నప్పటి నుంచి రకరకాల పోటీ పరీక్షలు ఎక్కడ జరిగినా రాసేదాన్ని. ఇంటర్ అయ్యాక ఎంట్రన్స్‌లు రాస్తే ర్యాంక్ వచ్చింది. కాని ఏ బ్రాంచ్ ఎన్నుకోవాలో తెలియలేదు. వరంగల్ ఎన్.ఐ.ఐ.టి.లో సివిల్‌కు అప్లై చేస్తే సీట్ వచ్చింది. సివిల్ ఎందుకు అప్లై చేశానో నాకే తెలియదు. అయితే దాంతో పాటు ఎన్.ఎస్.ఐ.టి. (నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, ద్వారకా)లో కంప్యూటర్ సైన్స్ అప్లై చేస్తే ఆ సీటు కూడా వచ్చింది. దీనికంటే అదే మెరుగనిపించి కంప్యూటర్ సైన్స్ చదివాను' అని తెలిపింది శ్రద్ధ.

ఉద్యోగం, టీచింగ్

చదువు చివరలో ఉండగానే హైదరాబాద్ మైక్రోసాఫ్ట్‌లో ఇన్‌టెర్న్ వచ్చింది శ్రద్ధకు. అది పూర్తయ్యాక ఉద్యోగమూ వచ్చింది. అయితే శ్రద్ధ ఇన్‌టెర్న్ చేస్తున్నప్పటి నుంచే గచ్చిబౌలిలో కంప్యూటర్ కోర్సులను బోధించసాగింది. ఉద్యోగం వచ్చాక కూడా కంప్యూటర్ కోర్సులకు ఫ్యాకల్టీగా పని చేసింది. 'ఉద్యోగంలో కంటే ఎవరి జీవితాన్నయినా తీర్చిదిద్దే బోధనే నాకు సరైందనిపించింది. అదే సమయంలో యూట్యూబ్ ద్వారా ఎక్కడెక్కడో ఉన్న విద్యార్థులకు పాఠాలు చెప్పడం, కోర్సులు తెలియచేయడం, వారి స్కిల్స్ పెరిగేలా గైడ్ చేయడం అవసరం అనుకున్నాను. మైక్రోసాఫ్ట్‌లో నాది మంచి ఉద్యోగం. కాని ఏదైనా కొత్తగా చేయాలనుకోవడం కూడా మంచిదే అని జాబ్‌కు రిజైన్ చేశాను' అంది శ్రద్ధ.

అప్నా కాలేజ్

శ్రద్ధ 'అప్నా కాలేజ్' పేరుతో యూట్యూబ్ చానల్ తెరిచింది. ఇంటర్ స్థాయి నుంచి విద్యార్థులకు ఏయే కోర్సులు చదివితే ఏం ఉపయోగమో, ఏ ఉద్యోగాలకు ఇప్పుడు మార్కెట్ ఉందో, ఆ ఉద్యోగాలు రావాలంటే ఏ కోర్సులు చదవాలో తెలిపే వీడియోలు చేసి విడుదల చేయసాగింది. 2020లో ఈ చానల్ మొదలుపెడితే ఇప్పుడు 40 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు తయారయ్యారు. కోట్లాది వ్యూస్ ఉంటాయి. అందుకు తగ్గట్టుగా లక్షల్లో శ్రద్ధ ఆదాయం ఉంది. 'ముప్పై ఏళ్ల క్రితం డిగ్రీల ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చేవారు. ఎందుకంటే డిగ్రీలు తక్కువ ఉండేవి. ఇవాళ డిగ్రీలు అందరి దగ్గరా ఉన్నాయి. కావాల్సింది స్కిల్స్. ఏ ఉద్యోగం చేయాలనుకుంటున్నారో ఆ ఉద్యోగానికి సంబంధించిన స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడు ముందుకు దూసుకెళ్లవచ్చు. నా వీడియోలు ఆ మార్గంలో ఉంటాయి' అని తెలిపింది శ్రద్ధ అలియాస్ సలహాల అక్క.

స్ఫూర్తి


అనన్య పరేఖ్

ఏమీ తెలియకపోవడం వల్ల కలిగే నష్టం సంక్షోభ సమయంలో, కష్టసమయంలో భయపెడుతుంది. బాధ పెడుతుంది. సమస్యల సుడిగుండంలోకి నెట్టి ముందుకు వెళ్లకుండా సంకెళ్లు వేస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అనన్య పరేఖ్ 'ఇన్నర్ గాడెస్' అనే సంస్థను ప్రారంభించింది. 'ఇన్నర్ గాడెస్' ద్వారా ఫైనాన్షియల్ లిటరసీ నుంచి మెంటల్ హెల్త్ వరకు అట్టడుగు వర్గాల మహిళల కోసం దేశవ్యాప్తంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది.

మేలుకొలుపు దారుల్లో...

చెన్నైలోని మైలాపూర్‌లో ఉమ్మడి కుటుంబంలో పెరిగిన అనన్య పెద్దల నుంచి ఎన్నో మంచి విషయాలు తెలుసుకుంది. ఆరు సంవత్సరాల వయసు నుంచే పుస్తకాలు చదవడం అలవాటైంది. 'పుస్తకపఠనం అలవాటు చేయడం అనేది నా కుటుంబం నాకు ఇచ్చిన విలువైన బహుమతి' అంటున్న అనన్య పెద్దల నుంచి విన్న విషయాలు, పుస్తకాల నుంచి తెలుసుకున్న విషయాల ప్రభావంతో సమాజం కోసం ఏదైనా చేయాలనే ఆలోచన చేయడం ప్రారంభించింది.

సోషల్ ఎంట్రప్రెన్యూర్‌గా వడివడిగా అడుగులు వేయడానికి ఈ ఆలోచనలు అనన్యకు ఉపకరించాయి.

అనేక సందర్భాలలో లింగ వివక్షను ఎదుర్కొన్న అనన్య 'ఇది ఇంతేలే' అని సర్దుకుపోకుండా 'ఎందుకు ఇలా?' అని ప్రశ్నించేది. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి చర్చించేది.

తమ ఇంటికి దగ్గరగా ఉండే ఒక బీద కుటుంబానికి చెందిన పిల్లల కోసం క్లాసు పుస్తకాలు కొనివ్వడం ద్వారా సామాజిక సేవకు సంబంధించి తొలి అడుగు వేసింది అనన్య. ఏరో స్పేస్ ఇంజనీరింగ్ చేసిన అనన్య ఉన్నత ఉద్యోగాలపై కాకుండా మహిళల హక్కులు, మహిళా సాధికారత, చదువు... మొదలైన అంశాలపై దృష్టి పెట్టింది.

చెన్నై కేంద్రంగా 'ఇన్నర్ గాడెస్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. ఈ సంస్థ తరపున అట్టడుగు వర్గాల మహిళల కోసం ఫైనాన్షియల్ లిటరసీ, ఫైనాన్షియల్ యాంగ్జైటీ, మెంటల్ హెల్త్, పర్సనల్ ఇన్వెస్టింగ్... మొదలైన అంశాలపై దేశవ్యాప్తంగా డెబ్బైకి పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించింది.

సరైన సమయంలో ఆర్థిక విషయాలపై అవగాహన కలిగిస్తే అది భవిష్యత్ కార్యాచరణకు ఉపయోగపడుతుందనే నమ్మకంతో పదహారు నుంచి ఇరవైనాలుగు సంవత్సరాల మధ్య ఉన్న యువతులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది ఇన్నర్ గాడెస్.





ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం కలిగే ఇబ్బందులు, ఉండడం వల్ల కలిగి మేలు, జీరో స్థాయి నుంచి వచ్చి విజయవంతమైన మహిళా వ్యాపారవేత్తల గురించి ఈ వర్క్‌షాప్‌లలో చెప్పారు.

షాపింగ్ నుంచి బ్యాంక్ వ్యవహారాల వరకు ఒక మహిళ తన భర్త మీద ఆధారపడేది. దురదృష్టవశాత్తు అతడు ఒక ప్రమాదంలో చనిపోయాడు. ఆమె ఇప్పుడు ఎవరి మీద ఆధారపడాలి? ఇలాంటి మహిళలను దృష్టిలో పెట్టుకొని వ్యవహార దక్షత నుంచి వ్యాపార నిర్వహణ వరకు ఎన్నో విషయాలపై ఈ వర్క్‌షాప్‌లలో అవగాహన కలిగించారు.

'ఇన్నర్ గాడెస్' నిర్వహించే వర్క్‌షాప్‌ల వల్ల పర్సనల్ ఫైనాన్స్‌కు సంబంధించిన ఎన్నో విషయాలపై మహిళలకు అవగాహన కలిగింది. సరియైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇది వారికి ఉపకరించింది.

ఇరవై సంవత్సరాల వయసులో 'ఇన్నర్ గాడెస్'ను ప్రారంభించిన అనన్య తన ప్రయాణంలో ఎన్నో అవరోధాలు ఎదుర్కొంది.

'అవరోధాలు అప్పుడే కాదు ఏదో ఒక రూపంలో ఇప్పుడు కూడా ఉన్నాయి. అయితే వాటికి ఎప్పుడూ భయపడలేదు. ప్రారంభంలో ఫైనాన్షియల్ లిటరసీ అనే కాన్సెప్ట్‌పై నాకు కూడా పరిమితమైన అవగాహనే ఉండేది. కాలక్రమంలో ఎన్నో నేర్చుకున్నాను. కెరీర్‌కు ఉపకరించే సబ్జెక్ట్‌లకు తప్ప పర్సనల్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌పై మన విద్యాప్రణాళికలో చోటు లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించాం. వీటిలో ఎంతోమంది వాలంటీర్‌లు, స్కూల్ స్టూడెంట్స్ పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఒక అమ్మాయి మ్యూచువల్ ఫండ్స్ గురించి అవగాహన చేసుకోవడమే కాదు, తన అమ్మమ్మకు మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్ విషయంలో సహాయపడింది. ఇలాంటివి విన్న తరువాత మరింత ఉత్సాహం వస్తుంది' అంటుంది అనన్య పరేఖ్.

పురుగులకూ కుటుంబ నియంత్రణ!

సాగుబడి

మఖ కార్తె: ఆగస్టు 18 నుంచి

- ప్రత్యేకమైన ఫెరోమోన్ పేస్ట్‌తో ఎంపిక చేసిన జాతి ఆడ, మగ పురుగుల కలయిక జరగకుండా అడ్డుకోవటం ద్వారా పురుగుల సంతతి నియంత్రణ
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల కంపెనీ ఆవిష్కరించిన వినూత్న సాంకేతికతతో ఇది సాధ్యమైంది
- కృత్రిమ లింగాకర్షక పేస్ట్‌ను పంట చేలో మొక్కలకు అక్కడక్కడా అంటించడం ద్వారా.. మగ పురుగులను తికమక పెట్టి.. ఆడ-మగ పురుగుల కలయిక జరగకుండా చూడొచ్చు. తద్వారా పొలాల్లో ఆ ప్రత్యేక పురుగుల సంతతి వృద్ధిని 90% వరకు నిరోధించవచ్చు.
- పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు ఉపయోగపడే ఫెరోమోన్ పేస్ట్ ప్రస్తుతం రైతులకు అందుబాటులోకి వచ్చింది
- ఎకరానికి 400 (8%) పత్తి మొక్కలకు నెలకోసారి ఈ పేస్ట్‌ను అంటించాలి. సీజన్‌లో 3 సార్లు పేస్ట్‌ను మొక్కలకు పెడితే చాలు..
- పండ్లు/కూరగాయ పంటల్లో పండు ఈగల సమర్థవంతమైన నివారణకు కూడా జెల్ ల్యూర్ అందుబాటులో ఉంది
- వంగ పంటలో కాయ, కాండం తొలిచే పురుగుల సమర్థ నియంత్రణకు ప్రత్యేక ఫెరోమోన్ పేస్ట్‌లు త్వరలో అందుబాటులోకి..
- 'సాక్షి'తో ఎటిజిసి బయోటెక్ సహ-వ్యవస్థాపకుడు డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి


పత్తి మొక్కలకు పేస్ట్ పెడుతున్న దృశ్యం

పంట పొలాల్లో, పండ్ల తోటల్లో పురుగుల నియంత్రణకు పురుగుమందులు/కషాయాలు చల్లటం కన్నా.. అసలు ఆయా ప్రత్యేక జాతి పురుగుల సంతతినే పెరగకుండా అరికట్టగలిగితే రైతులకు శ్రమ, ఖర్చు తగ్గటంతో పాటు, పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కూడా మేలు జరుగుతుందంటున్నారు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు. వివిధ శాస్త్రవిభాగాల్లో పరిశోధనలు పూర్తిచేసిన శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే వినూత్నమైన ఫెరోమోన్ ఆధారిత అప్లికేషన్లు, ఆవిష్కరణలను వెలువరించారు. కేంద్ర వ్యవసాయ శాఖ నుంచి అగ్రికల్చర్ గ్రాండ్ ఛాలెంజ్ పురస్కారాన్ని అందుకున్న ఈ సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తేవడానికి శాస్త్రవేత్తలు హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో ఎటిజిసి బయోటెక్ అనే కంపెనీని నెలకొల్పారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఇటీవల నిర్వహించిన 'ఎట్‌హోమ్ రిసెప్షన్'లో ఈ సంస్థ సహ-వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి, హెచ్‌సియూ పూర్వ విద్యార్థి డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన అందించిన వివరాల ప్రకారం ఈ వినూత్న సాంకేతికత వివరాలను పరిశీలిద్దాం..

పురుగుల సంతతిని అరికట్టే వ్యూహం

ఆడ రెక్కల పురుగు సంతానోత్పత్తి దశలో మగ రెక్కల పురుగును ఆకర్షించడానికి ప్రత్యేకమైన వాసనతో కూడిన హార్మోన్ వంటి రసాయనాన్ని గాలిలోకి విడుదల చేస్తుంది. మగ పురుగు ఆ ఫెరోమోన్ వాసనను బట్టి ఆడ పురుగు ఉన్న చోటుకు వెళ్లి కలుస్తుంది. ఈ కలయిక సజావుగా జరిగితే ఆడ పురుగు గుడ్లు పెడుతుంది. ఆ విధంగా పురుగుల సంతతి పంట పొలంలో స్వల్ప కాలంలోనే పదులు వందలుగా, వందలు వేలుగా పెరిగిపోయి పంటను ఆశించి దిగుబడిని నష్ట పరచటం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. అయితే, ఆడ-మగ రెక్కల పురుగుల కలయికే జరగకుండా చూడటం ద్వారా సంతతి పెరుగుదలను అరికట్టడం ఇక్కడ వ్యూహం.


ఈ వ్యూహాన్ని అమలుపరచడానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధన శాస్త్రవేత్తలు రూపొందించిన వినూత్న పద్ధతి ఏమిటంటే.. కృత్రిమ ఫెరోమోన్‌తో కూడిన ప్రత్యేక పేస్ట్‌ను రూపొందించటం. ఈ పేస్ట్‌ను పంట పొలంలో మొక్కలకు అక్కడక్కడా అంటిస్తే.. ఆ వాసనకు మగ రెక్కల పురుగు ఆడ పురుగు ఉందనుకొని మొక్కపై ఉన్న పేస్ట్ దగ్గరకు వస్తుంది. తీరా లేకపోయేసరికి తికమకకు గురవుతుంది. ఆడ రెక్కల పురుగులను కలిసే ప్రయత్నంలో నూటికి 90 సార్లు విఫలమవుతుంది. దాంతో ఆ పురుగు సంతానోత్పత్తి ఆ మేరకు పరిమితమవుతుంది. ఈ టెక్నిక్‌ను ఉపయోగించి పురుగు తొలి దశలోనే పేస్ట్‌ను పొలంలో అక్కడక్కడా మొక్కలకు పూస్తే చాలు. పురుగుల్ని నిర్మూలించకుండానే వాటి సంఖ్యను చాలా వరకు అదుపులోకి తేవటం ద్వారా పంట దిగుబడికి పెద్దగా నష్టం జరగకుండా చూసుకోవచ్చు. ఇది సరిగ్గా చేస్తే ఆ పురుగు నిర్మూలనకు రైతులు పురుగుమందు కొట్టే శ్రమ, ఖర్చు, కాలుష్యం ఉండదు.



అయితే, పురుగుల తీవ్రతను తెలుసుకునేందుకు లింగాకర్షక బుట్టలు చాలా కాలంగా రైతులు వాడుతున్నారు. ఫెరమోన్ ఎర వాసనతో వచ్చి లింగాకర్షక బుట్టల్లో పడే మగ రెక్కల పురుగుల సంఖ్యను, పొలంలో అప్పుడు ఆ పురుగు తీవ్రతను గుర్తించి, పురుగు మందులు/కషాయాలు చల్లటం వంటి నియంత్రణ చర్యలను రైతులు చేపడుతున్నారు. ఈ లోగా పురుగుల సంతతి పెరిగిపోతోంది. అయితే, ఈ కొత్త పద్ధతి ద్వారా ఈ పురుగుల సంతతి పెరగకుండా ముందు నుంచే వాటి కలయికను నివారించవచ్చు. పురుగు ఉధృతిని ఎర ఉపయోగించి గమనించవచ్చు.

త్వరలో వంగకు, కత్తెర పురుగుకు కూడా..

ప్రస్తుతానికి పత్తిలో గులాబీ పురుగును నియంత్రించేందుకు పేస్ట్‌ను రైతులకు అందుబాటులోకి తెచ్చాం. వంగ తోటల్లో కాయ/కాండం తొలిచే పురుగుల నియంత్రణకు ప్రత్యేక పేస్ట్‌ను కేంద్ర ప్రభుత్వ అనుమతుల తర్వాత 2-3 నెలల్లో విడుదల చేయబోతున్నాం. ఇది అందుబాటులోకి వస్తే వంగ రైతులకు పురుగు మందుల ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గుతుంది. అంతేకాక వినియోగదారులు పురుగుమందు అవశేషాలు లేని వంకాయలను తినటం సాధ్యమవుతుంది. ఇప్పటికే పండ్లు/కూరగాయ తోటల్లో నష్టం చేస్తున్న పండు ఈగను ఆకర్షించి చంపే జెల్ ల్యూర్ అందుబాటులో ఉంది. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ దీనిపై అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మొక్కజొన్న సహా అనేక పంటలకు నష్టం చేస్తున్న కత్తెర పురుగు నియంత్రణకు వినూత్న పద్ధతి త్వరలోనే అందుబాటులోకి రానుంది. వీటి తయారీలో ఎలాంటి జన్యుమార్పిడి సాంకేతికతను వాడటం లేదు. రైతులు ఈ సాంకేతిక పద్ధతిని పురుగు ఉధృతి పెరిగినాక కాకుండా ముందు జాగ్రత్తగా వినియోగించాల్సి ఉంటుంది. ఒక ప్రాంతంలో రైతులు కలసి వాడితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి.



– డా. విజయ భాస్కర్ రెడ్డి,
ఎటిజిసి బయోటెక్ సహ-వ్యవస్థాపకుడు,
ముఖ్య కార్యనిర్వహణాధికారి,
జీనోమ్ వ్యాలీ, హైదరాబాద్.

పత్తిలో గులాబీ పురుగుకు చెక్

గులాబీ రంగు పురుగు వలన పత్తి రైతులు సగటున ఎకరానికి 6-7 క్వింటాళ్ల పత్తిని నష్టపోతున్నారు. పురుగులను సమర్థవంతంగా అరికట్టడానికి ఫెరొమోన్ పర్యవేక్షణ మాత్రమే సరిపోదు. ఇప్పుడు పర్యవేక్షణే కాకుండా ఫెరొమోన్ ఆధారిత నియంత్రణ విధానం అందుబాటులోకి వచ్చింది. ఇది ఎరను ఉపయోగించకుండా ఫెరొమోన్ పేస్ట్ ద్వారా పురుగులను అరికట్టే సరికొత్త పద్ధతని డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ప్రస్తుతం బీటీ పత్తి పొలాల్లో విజృంభిస్తున్న గులాబీ లద్దె పురుగును అరికట్టేందుకు ప్రత్యేకమైన పేస్ట్‌ను తమ కంపెనీ రూపొందించిందన్నారు. పేటెంట్ కలిగిన ఈ టెక్నాలజీకి కేంద్ర ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాత రైతులకు అందుబాటులోకి తెచ్చిందన్నారు.

పత్తి పంటలో 3 సార్లు..

ఎకరం పత్తి చేనులో అన్ని మొక్కలకూ పేస్ట్‌ను పెట్టక్కర లేదు. 400 మొక్కల (పొలంలో 7-8% మొక్కల)కు ఈ పేస్ట్‌ను బఠాణీ గింజంత అంటించాలి. మొక్క పై నుంచి 10-15 సెం.మీ. కిందికి, కాండం నుంచి కొమ్మ చీలే దగ్గర పెట్టాలి. ఒక సాలులో 4 మీటర్లకు ఒక మొక్కకు పెడితే చాలు. ఒక సాలులో మొక్కలకు పెట్టి, రెండు సాళ్లు వదిలేసి మూడో సాలుకు పెడితే సరిపోతుంది. ఎకరం మొత్తానికి 125 గ్రాముల పేస్ట్ సరిపోతుందని డా. రెడ్డి వివరించారు. ఒక్కో మొక్క కాండంపై 250 నుంచి 300 మిల్లీగ్రాముల మేరకు పెట్టాలి. పత్తి పంట కాలంలో మొత్తం 3 సార్లు పేస్ట్ పెట్టాలి. విత్తనాలు వేసిన తర్వాత (పువ్వు/గూడ ఏర్పడటానికి ముందు) ఇంచుమించుగా 30-35 రోజులకు మొదటిసారి, విత్తిన 60-65 రోజుల తర్వాత రెండోసారి, విత్తిన 90-95 రోజుల తర్వాత మూడవ సారి పెట్టాలి. తుది పంట కోసే వరకు ప్రతి 30-35 రోజుల వ్యవధిలో ఉపయోగించాలి. ఇలా చేస్తే పంట ఖర్చు తగ్గి, దిగుబడి, నాణ్యత పెరుగుతుంది. ఎకరానికి పేస్ట్ ఖర్చు మూడు సార్లకు రూ. 4 వేలు అయినప్పటికీ, రైతు రూ. 30 వేల వరకు అధికాదాయం పొందగలుగుతారని ఆయన అన్నారు.

మిత్రపురుగులు సురక్షితం

ఈ సాంకేతికతలో పురుగుమందులు /హానికరమైన రసాయనాలు లేనందున పర్యావరణానికి హాని కలిగించదని డా. విజయభాస్కర్‌రెడ్డి వివరించారు. నేల, గాలి, నీరు పురుగు మందుల అవశేషాలతో కలుషితం కావు. మిత్ర పురుగులకు, పరాన్న జీవులు వంటి సహజ శత్రువులకు సురక్షితంగా ఉంటాయి. తేనెటీగలు నశించవు. సహజ పరాగ సంపర్కం బాగుంటుంది. రైతుకు, కూలీలకు సురక్షితమైనది. మొక్కకు హాని కలిగించదు. పత్తి నాణ్యత, రంగు మెరుగ్గా ఉంటుంది. మంచి ధరను పొందే అవకాశం కలుగుతుంది అన్నారాయన. దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రయోగాల్లో 90% పైగా పత్తిలో గులాబీ పురుగును ఈ పేస్ట్ నియంత్రిస్తున్నట్లు నిరూపితమైందని ఆయన తెలిపారు. (ఇతర వివరాలకు.. టోల్‌ఫ్రీ నంబర్ 1800 121 2842)

28న అనంతపురంలో డా. ఖాదర్‌వలి సభలు

ఈ నెల 28 (సోమవారం)న ఉ. 8.30 గం.కు అనంతపురం జిల్లా కురుగుంట గ్రామంలోని మహిళా రైతుల సామూహిక వ్యవసాయ క్షేత్రంలో మధుమేహ రహిత గ్రామసభ్యులతో జరిగే చర్చాగోష్టిలో జిల్లా కలెక్టర్ గౌతమి, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.ఖాదర్‌వలి పాల్గొంటారు. వివరాలకు.. 94400 17188. అదేరోజు సా. 6.30 గం.కు అనంతపురం ద్వారకా విల్లాస్ క్లబ్ హౌస్‌లో మధుమేహ రహిత జీవనంపై డా. ఖాదర్‌వలి, ఎస్పీ అమ్మిరెడ్డి ప్రసంగిస్తారు. వివరాలకు.. 93989 64962.

వచ్చే నెల 15 వరకు గోపాలరత్న దరఖాస్తులు

జాతీయ గోపాల రత్న-2023 అవార్డుల ప్రదానం కోసం జాతీయ పశుసంవర్థక, పాడి, మత్స్య పరిశ్రమ శాఖ ఆన్‌లైన్ నామినేషన్లను ఆహ్వానిస్తోంది. వెబ్‌సైట్ ద్వారా ఈ నెల15 నుంచి వచ్చే నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జాతీయ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే దేశీ పశు జాతుల పెంపకందారులకు, పాడి రైతులకు స్థిరమైన జీవనోపాధిని అందించేందుకు ప్రభుత్వం 3 విభాగాల్లో ఈ పురస్కారాలను అందిస్తోంది. గుర్తింపు పొందిన దేశీ గోజాతులు (ఏపీ- ఒంగోలు, పుంగనూరు, మోటు, తెలంగాణ- పొడతూర్పు), గేదెలను శ్రద్ధగా పెంచి పోషించే రైతులు.. ఉత్తమ సేవలందిస్తున్న డెయిరీ సహకార సంఘం లేదా పాల ఉత్పత్తిదారుల కంపెనీ లేదా పాడి రైతు ఉత్పత్తిదారుల సంస్థలు.. ఉత్తమ సేవలందిస్తున్న కృత్రిమ గర్భధారణ సాంకేతిక నిపుణులు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి విభాగంలో మూడు అవార్డులతో పాటు రూ.5, రూ.3, రూ.2 లక్షల నగదు బహుమతులు ఇస్తారు. నవంబర్ 26న జాతీయ పాల దినోత్సవం రోజు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. అర్హత ప్రమాణాలు, నామినేషన్ ఆన్‌లైన్ ప్రక్రియ గురించి మరిన్ని వివరాల కోసం https://awards.gov.in లేదా https://dahd.nic.in వెబ్‌సైట్లను చూడొచ్చు.

డిసెంబర్‌లో సేంద్రియ రైతుల జాతీయ సమ్మేళనం

డిసెంబర్ 28 నుంచి 30 వరకు కేరళ ఎర్నాకుళం జిల్లా అలువలో సేంద్రియ రైతుల 8వ ద్వైవార్షిక జాతీయ సమ్మేళనం జరగనుంది. కేరళ జైవ కర్షక సమితి తోడ్పాటుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి 2 వేల మందికిపైగా రైతులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొంటారని ఆర్గానిక్ ఫార్మింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఒ.ఎఫ్.ఎ.ఐ.) కె పి ఇలియాస్ తెలిపారు. 6వేల దేశీ వంగడాలను సంరక్షిస్తున్న 200 మంది విత్తన సంరక్షకులు, యువ సేంద్రియ రైతుల స్టార్టప్‌లు, ఆక్వా రైతులు, పాడి రైతులు.. పాల్గొంటారన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 2,500. ఇతర వివరాలకు.. 73067 93706, 95399 08509. www.ofai.org

స్పోర్ట్స్



55 ఏళ్ల తర్వాత మరో టీనేజ్ చాంపియన్


సిన్సినాటి ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 మహిళల టెన్నిస్ టోర్నీ ఫైనల్లో అమెరికా టీనేజర్, 19 ఏళ్ల కోకో గాఫ్ 6-3, 6-4తో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి తన కెరీర్‌లో తొలి మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. కోకో గాఫ్‌కు 4,54,500 డాలర్ల (రూ. 3 కోట్ల 77 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది ఈ గెలుపుతో 55 ఏళ్ల తర్వాత ఈ టోర్నీలో టైటిల్ నెగ్గిన టీనేజ్ ప్లేయర్‌గా కోకో గుర్తింపు పొందింది. 1968లో అమెరికాకే చెందిన 17 ఏళ్ల లిండా టుయెరో విజేతగా నిలిచింది.

నిష్కా అగర్వాల్‌కు స్వర్ణం

ఫారోస్ కప్ అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ జిమ్నాస్ట్ నిష్కా అగర్వాల్ స్వర్ణ పతకం నెగ్గింది. కైరోలో జరిగిన ఈ టోర్నీలో నగరంలోని గాడియం స్కూల్ విద్యార్థి అయిన నిష్కా టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో విజేతగా నిలిచింది. కోచ్ మనోజ్ రాణా వద్ద శిక్షణ తీసుకుంటున్న నిష్కా గత ఏడాది కేరళ ఆతిథ్యమిచ్చిన జాతీయ జూనియర్ పోటీల్లోనూ పసిడి పతకం గెలిచింది.



శ్రీకాంత్ పరాజయం



కోపెన్‌హాగెన్: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్లోనే నిష్క్రమించగా... ప్రణయ్, లక్ష్యసేన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. ఆంధ్రప్రదేశ్ స్టార్ షట్లర్ శ్రీకాంత్ 14-21, 14-21తో 14వ సీడ్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయాడు. తొమ్మిదో సీడ్ ప్రణయ్ 24-22, 21-10తో కలే కొలానెన్ (ఫిన్లాండ్)పై, లక్ష్యసేన్ 21-12, 21-7తో జార్జెస్ జులిన్ పాల్ (మారిషస్)పై అలవోక విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 14-21, 22-20, 18-21తో జులి మ్యాక్‌ఫెర్సన్-ఆడమ్ హాల్ (స్కాట్లాండ్) జంట చేతిలో ఓడిపోయింది.

సిఫ్ట్ కౌర్‌కు ఐదో స్థానం



బకూ: ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా ఐదో స్థానంలో నిలిచి ంది. దాంతో భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ లభించింది. ఫైనల్లో సిఫ్ట్ కౌర్ 429.1 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానాన్ని దక్కించుకుంది.

టైగర్స్, వారియర్స్ విజయాలు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో బెజవాడ టైగర్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో టైగర్స్ 7 వికెట్లతో ఉత్తరాంధ్ర లయన్స్‌ను ఓడించింది. లయన్స్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. మహీప్ కుమార్ (77 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), రికీ భుయ్ (41; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కలిసి జట్టును గెలిపించారు. వైజాగ్ వారియర్స్, రాయలసీమ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ 'టై'గా ముగిసింది. అయితే సూపర్ ఓవర్ ద్వారా వారియర్స్ విజేతగా నిలిచింది. వారియర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 171 పరుగులు సాధించింది. ప్రశాంత్ (73; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 171 పరుగులు చేసింది. విహారి (71; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ రెడ్డి (58 రిటైర్డ్‌హర్ట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. సూపర్ ఓవర్‌లో కింగ్స్ 2 వికెట్లు కోల్పోయి ఒకే ఒక పరుగు చేయగా, వారియర్స్ 2 పరుగులు చేసి గెలిచింది.

రాహుల్, శ్రేయస్ పునరాగమనం

వన్డేల్లో తొలిసారి తిలక్ వర్మకు చోటు
- స్పిన్నర్ చహల్‌పై వేటు
- ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన

సొంతగడ్డపై జరిగే వన్డే వరల్డ్ కప్‌కు ముందు రిహార్సల్‌లాంటి ఆసియా కప్ టోర్నీ కోసం భారత బృందం సిద్ధమైంది. సుదీర్ఘ కాలంగా గాయాలతో సహవాసం చేసిన ఆటగాళ్లంతా కోలుకొని జట్టులోకి రాగా... ఇంకా వన్డేలే ఆడని కొత్త ప్లేయర్‌కు కూడా తొలిసారి చోటు లభించింది. అజిత్ అగార్కర్ నాయకత్వంలోని సెలక్షన్ కమిటీ 17 మందితో ఈ టీమ్‌ను ప్రకటించింది. ఇందులో నుంచి ఇద్దరిని తప్పించి 15 మందితో సెప్టెంబర్ 5లోగా వరల్డ్ కప్ టీమ్‌ను ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో అసలు సమరానికి సిద్ధం కావడానికి ఆసియా కప్ కీలకం కానుంది.


రోహిత్ శర్మ, అగార్కర్


రాహుల్, శ్రేయస్

న్యూఢిల్లీ: ఆసియా కప్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టును బీసీసీఐ సెలక్టర్లు సోమవారం ప్రకటించారు. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 17 వరకు పాకిస్తాన్, శ్రీలంకలో ఈ టోర్నీ జరుగుతుంది. గాయాల నుంచి కోలుకొని సుదీర్ఘ విరామం తర్వాత కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఇప్పటికే ఐర్లాండ్‌తో టి20లు ఆడుతున్న బుమ్రా, ప్రసిధ్ కృష్ణలు కూడా వన్డేల్లో పునరాగమనం చేశారు. హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ అరుదైన అవకాశాన్ని దక్కించుకోవడం ఈ సెలక్షన్స్‌లో కీలక పరిణామం. ఇప్పటి వరకు ఇంకా వన్డేల్లో అరంగేట్రం చేయని తిలక్‌కు కీలకమైన ఆసియా కప్ జట్టులో చోటు దక్కింది. మరోవైపు లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చహల్‌ను టీమ్‌లోకి ఎంపిక చేయలేదు. రెగ్యులర్ పేసర్లు షమీ, సిరాజ్, బుమ్రా, ప్రసిధ్ ఉండగా... ఆల్‌రౌండర్లుగా జడేజా, అక్షర్ పటేల్, పాండ్యా, శార్దుల్ కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. బ్యాటింగ్ బృందం విషయంలో ఎలాంటి అనూహ్య ఎంపికలు లేవు. జట్టులో ఒక్క ఆఫ్‌స్పిన్నర్ కూడా లేడు.

వారిద్దరూ సిద్ధం...

రాహుల్ చివరిసారిగా మే 1న ఐపీఎల్ మ్యాచ్ బరిలోకి దిగి తొడ కండరాల గాయంతో ఆటకు దూరం కాగా, మార్చిలో ఆస్ట్రేలియాతో మూడో టెస్టు ఆడుతూ వెన్ను గాయంతో శ్రేయస్ మ్యాచ్ మధ్యలో నుంచి తప్పుకున్నాడు. వీరిద్దరు శస్త్రచికిత్సల అనంతరం ఇప్పటి వరకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రీహాబిలిటేషన్‌లో ఉన్నారు. మిడిలార్డర్‌లో కీలకం కానున్న వీరిద్దరు కోలుకొని మ్యాచ్ ఫిట్‌నెస్‌ను సాధించడంతో మళ్లీ జట్టులోకి ఎంపిక చేశారు. శ్రేయస్ పూర్తి ఫిట్ కాగా, రాహుల్ పాత గాయం నుంచి కోలుకున్నా... స్వల్ప అసౌకర్యంతో ఉన్నాడు. దాంతో ఆసియా కప్ కోసం ముందు జాగ్రత్తగా రిజర్వ్ ఆటగాడిగా సంజు సామ్సన్‌ను కూడా ఎంపిక చేశారు. వన్డేల్లో వరుసగా విఫలమైన పేలవ రికార్డు ఉన్నా... సూర్యకుమార్ యాదవ్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. రాహుల్ తర్వాత రెండో వికెట్ కీపర్‌గా సామ్సన్ కంటే ఇషాన్ కిషన్‌కు ప్రాధాన్యత దక్కింది.

జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, జడేజా, బుమ్రా, కుల్దీప్, సిరాజ్, షమీ, ఇషాన్ కిషన్, శార్దుల్, అక్షర్, సూర్యకుమార్, తిలక్ వర్మ, ప్రసిధ్ కృష్ణ, సంజు సామ్సన్ (రిజర్వ్ ఆటగాడు).

తిలక్‌కు లక్కీ చాన్స్...



హైదరాబాద్‌కు చెందిన నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ ఇటీవల వెస్టిండీస్‌తో 5 మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 173 పరుగులతో భారత్ తరఫున టాపర్‌గా నిలిచాడు. అయితే అతని స్కోర్లకంటే క్రీజ్‌లో అతని ఆత్మవిశ్వాసం, పోరాటతత్వం అందరినీ ఆకట్టుకున్నాయి. అందుకే ఇప్పటి వరకు వన్డేలే ఆడకపోయినా అతనికి అవకాశం దక్కింది. దేశవాళీ వన్డేల్లో తిలక్ రికార్డు చాలా బాగుంది. 25 మ్యాచ్‌లలో 56.18 సగటుతో అతను 1,236 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 5 హాఫ్ సెంచరీలు ఉండగా స్ట్రయిక్‌రేట్ కూడా 101.64 కావడం అతని దూకుడును చూపిస్తోంది.

> ఆఫ్‌స్పిన్నర్‌గా అశ్విన్, సుందర్‌లపై కూడా చర్చ జరిగింది. ఒక పేసర్‌ను తగ్గిస్తేనే చహల్‌ను తీసుకోగలిగేవాళ్లం. కానీ జట్టులో మన పేసర్ల పాత్ర కీలకం కానుంది. అయితే ఎవరికీ దారులు మూసుకుపోలేదు. మున్ముందు ఏదైనా జరగొచ్చు. ఒక ఆటగాడికి ప్రత్యేకంగా ఒకే స్థానం అంటూ ఏమీ ఉండదు. పరిస్థితిని బట్టి ఆర్డర్ మారుతుంది. అందరూ దీనికి సిద్ధంగా ఉండాలని చెప్పాం. అయితే దీనర్థం ఏడో నంబర్ ఆటగాడు ఓపెనర్‌గా, ఓపెనర్ వెళ్లి ఎనిమిదో స్థానంలో ఆడటం కాదు. అలాంటి పిచ్చి పనులు మేం చేయం. టాప్-3 చాలా కాలంగా మారలేదు కాబట్టి మిడిలార్డర్‌లో స్వల్పంగా మార్పులు ఉంటాయని నా ఉద్దేశం. -రోహిత్ శర్మ, భారత కెప్టెన్

> మేం ఇప్పుడు 18 మందిని ఎంపిక చేశాం. ఈ జాబితా నుంచే వరల్డ్ కప్ టీమ్‌ను ఎంచుకోవడం ఖాయం. ఎంపికకు ముందు మన జట్టు ఆసియా కప్‌లో రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. అన్నీ చూశాకే నిర్ణయం తీసుకుంటాం. రాహుల్ రెండో మ్యాచ్ వరకు పూర్తిగా కోలుకోగలడని ఆశిస్తున్నాం. రెండో మణికట్టు స్పిన్నర్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం లేకపోవడంతో యుజువేంద్ర చహల్‌ను పక్కన పెట్టాం. వెస్టిండీస్‌లో తిలక్ ఆట మమ్మల్ని ఆకట్టుకుంది. అతనికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలనే వన్డేల్లో తీసుకున్నాం. ఎడంచేతివాటం కూడా అదనపు అర్హత. -అజిత్ అగార్కర్, చీఫ్ సెలక్టర్

ఫైనల్లో ప్రజ్ఞానంద

సెమీస్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ కరువానాపై సంచలన విజయం
నేటి నుంచి కార్ల్‌సన్‌తో టైటిల్ పోరు • ప్రపంచకప్ చెస్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద పెను సంచలనం సృష్టించాడు. ప్రపంచ కప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ మూడో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన సెమీఫైనల్లో 18 ఏళ్ల ప్రజ్ఞానంద 3.5-2.5తో గెలుపొందాడు. ఫైనల్ చేరడంద్వారా ప్రజ్ఞానంద వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్ టోర్నీకి అధికారికంగా అర్హత సాధించాడు. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ కప్ టోర్నీలో ఫైనల్ చేరిన రెండో భారతీయ ప్లేయర్‌గా ప్రజ్ఞానంద గుర్తింపు పొందాడు. నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌లు ముగిశాక ప్రజ్ఞానంద, కరువానా 1-1తో సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. 25 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లు కూడా 'డ్రా'గా ముగియడంతో స్కోరు 2-2తో సమమైంది. అనంతరం 10 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లను ఆడించారు. తొలి గేమ్‌లో తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద 63 ఎత్తుల్లో గెలిచాడు. ఫైనల్ రేసులో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన రెండో గేమ్‌లో కరువానా 'డ్రా' చేసుకోవడంతో ప్రజ్ఞానంద విజయం ఖరారైంది. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో ప్రజ్ఞానంద ఫైనల్లో తలపడతాడు. రెండు క్లాసికల్ గేమ్‌లలో భాగంగా వీరిద్దరి మధ్య తొలి గేమ్ నేడు జరుగుతుంది.

కప్ కోసం ఆమె... ఆమె కోసం కుటుంబం

- పెను విషాదాన్ని దాచిపెట్టారు
- స్పెయిన్ కెప్టెన్ ఓల్గా కర్మోనా పట్ల విధి వైచిత్రం



మాడ్రిడ్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) మహిళల ప్రపంచకప్‌లో స్పెయిన్ జట్టు తొలి టైటిల్‌తో చరిత్రకెక్కింది. దేశవ్యాప్తంగా మిన్నంటే సంబరాలతో పండగ చేసుకుంది. కానీ కప్‌ను గెలిపించిన ప్లేయర్, గోల్ చేసిన ప్లేయర్, నడిపించిన కెప్టెన్ మాత్రం విలపించింది. ఇందులో ఆశ్చర్యపోవడానికేం లేదు. ఎందుకంటే ఆమె ఇంట పెనువిషాదం అలుముకుంది. గోల్ చేసింది... గెలిపించింది... నడిపించింది ఓల్గా కర్మోనా అయితే... ఫైనల్‌కు రెండు రోజుల ముందే ఆమెకు జన్మనిచ్చిన తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని కుటుంబం ఆమెకు తెలియనివ్వలేదు. ఆమె ప్రపంచకప్ కలకు ఈ విషాదం అడ్డంకి కాకూడదనుకొని చెప్పలేదు. కర్మోనా ట్రోఫీ అందుకున్న తర్వాతే మరణవార్త చెప్పారు. అందరు సంబరాలు చేసుకుంటే... తనుమాత్రం తండ్రి ఇక లేడన్న వార్త తట్టుకోలేక కన్నీటి పర్యంతమైంది.

లెక్క సరిచేసిన జొకోవిచ్



ఒహాయో: సెర్బియా టెన్నిస్ యోధుడు జొకోవిచ్ తన కెరీర్‌లో 39వ మాస్టర్స్ సిరీస్ టైటిల్ సాధించాడు. ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో 3 గంటల 49 నిమిషాలపాటు జరిగిన సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ ఫైనల్లో జొకోవిచ్ 5-7, 7-6 (9/7), 7-6 (7/4)తో గెలుపొందాడు. రెండో సెట్ టైబ్రేక్‌లో జొకోవిచ్ ఒక మ్యాచ్ పాయింట్ కాపాడుకోవడం విశేషం. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 10,19,335 డాలర్ల (రూ. 8 కోట్ల 47 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ గెలుపుతో ఈ ఏడాది వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో అల్‌కరాజ్ చేతిలో ఎదురైన ఓటమికి జొకోవిచ్ బదులు తీర్చుకున్నాడు. ఓవరాల్‌గా జొకోవిచ్ కెరీర్‌లో ఇది 95వ సింగిల్స్ టైటిల్‌కాగా, కెరీర్‌లో 1,069వ విజయం.

సినిమా

జాతి రత్నాలు తర్వాత ఒత్తిడికి గురయ్యాను

- నవీన్ పోలిశెట్టి


• నవీన్ పోలిశెట్టి, ప్రమోద్, మహేశ్‌బాబు

''ఒక యాక్సిడెంట్‌లో గాయాలైన ఒక మహిళా అభిమాని డిప్రెషన్ నుంచి కోలుకునేందుకు నా 'జాతి రత్నాలు' సినిమాని రోజూ చూస్తానని చెప్పింది. ఇంతకంటే సంతృప్తి నటుడిగా నాకు దొరకదు. అందుకే 'జాతి రత్నాలు' హిట్ తర్వాత ఎలాంటి సినిమా చేయాలా అని ఒత్తిడికి గురయ్యాను. ఆ క్రమంలో మహేశ్ చెప్పిన కథ చాలా ఎగ్జయిట్ చేసింది. మానవ సంబంధాల మీద మంచి ఎంటర్‌టైనింగ్ స్టోరీ రాసుకున్నాడు మహేశ్. స్టాండప్ కామెడీ క్యారెక్టర్‌తో ఫుల్ లెంగ్త్ సినిమా తెలుగులో రాలేదు. అది నచ్చింది. అలాగే అనుష్క హీరోయిన్ అనగానే హ్యాపీ ఫీలయ్యా'' అన్నారు నవీన్ పోలిశెట్టి. మిస్ శెట్టిగా అనుష్కా శెట్టి, మిస్టర్ పోలిశెట్టిగా నవీన్ పోలిశెట్టి నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. మహేష్ బాబు పి. దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. సోమవారం ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. ''పెళ్లి ఒక్కటే కాదు.. ప్రతి రిలేషన్‌లో యువత ఆలోచించే తీరు ఎలా ఉంటుంది? అనేది ఈ సినిమాలో చూపిస్తున్నాం'' అన్నారు పి. మహేశ్ బాబు.

లండన్‌లో ఈగల్


• 'ఈగల్' పోస్టర్

రవితేజ మోస్ట్ వాంటెడ్.. హీరోగా ఇండస్ట్రీకి మోస్ట్ వాంటెడ్. 'ఈగల్' సినిమాలో కూడా రవితేజ మోస్ట్ వాంటెడ్. సినిమాలో ఆయన్ను పట్టుకోవడానికి 'రా' ఏజెన్సీ వెతుకుతుంటుంది. కొందరు ఆయన్ను పెయింటర్ అనుకుంటారు.. మరికొందరు రైతు అనుకుంటారు.. ఇంకొందరు ఇంకోటి అనుకుంటారు. సో.. ఈ చిత్రంలో రవితేజ పలు గెటప్స్‌లో కనిపిస్తారని ఊహించవచ్చు. రవితేజ, అనుపమా పరమేశ్వరన్ జంటగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'ఈగల్'. ఈ చిత్రం తాజా షెడ్యూల్ లండన్‌లో ప్రారంభమైంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: దవ్‌జాండ్, కెమెరా-ఎడిటింగ్: కార్తీక్ ఘట్టమనేని, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.


• సమంత

పద్నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఇక్కడ..!

''కలలు కనడానికి న్యూయార్క్ మంచి ప్రదేశం అంటుంటారు. నా కెరీర్‌ని నేనిక్కడే ఆరంభించా. నా తొలి సినిమా ('ఏ మాయ చేశావే') షూటింగ్ ఇక్కడే జరిగింది. అప్పుడు నేనో చిన్న పిల్లని. ఎలా ముందుకెళుతుంది (తనను ఉద్దేశించి) అనే క్లూ అప్పుడు తనకు లేదు. కానీ, పెద్ద కల కనేంత ధైర్యం మాత్రం ఉంది. 14 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడ..'' అంటూ సోషల్ మీడియా వేదికగా సమంత పేర్కొన్నారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరిగిన 41వ వార్షిక భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు సమంత. ఈ సందర్భంగా ఈ బ్యూటీ ఆ నగరంలో 'ఏ మాయ చేశావే' చిత్రీకరించిన రోజులను గుర్తు చేసుకుని పై విధంగా స్పందించారు.

హారర్ నేపథ్యంలో...


• త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆశిష్

'రౌడీ బాయ్స్' ఫేమ్ ఆశిష్ హీరోగా మూడో చిత్రం సోమవారం ఆరంభమైంది. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, నాగార్జున మల్లిడి నిర్మిస్తున్నారు. ''రొమాంటిక్ హారర్ నేపథ్యంలో తెరకెక్కనున్న చిత్రమిది. 'రౌడీ బాయ్స్'తో తనదైన గుర్తింపు సంపాదించుకున్న ఆశిష్ ప్రస్తుతం నటిస్తున్న 'సెల్ఫిష్' 50 శాతానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. మూడో సినిమాగా రూపొందుతున్న ఈ రొమాంటిక్ హారర్ లవ్ స్టోరీ కోసం ఇండస్ట్రీలోని టాప్ టెక్నీషియన్స్ వర్క్ చేస్తున్నారు'' అన్నారు మేకర్స్. ఈ సినిమా ప్రారంభోత్సవానికి డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాతలు చినబాబు, నాగవంశీ తదితరులు హాజరయ్యారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కెమెరా: పీసీ శ్రీరామ్.

కథలో కొత్తదనం ఉండాలి

- నిర్మాత బెన్నీ ముప్పానేని



''ప్రేక్షకుడిగా నేనో సినిమా చూసినప్పుడు కథలో కొత్తదనం ఉండాలని కోరుకుంటాను. 'బెదురులంక 2012' కథలో అలాంటి కొత్తదనాన్ని చూపించారు క్లాక్స్'' అని నిర్మాత బెన్నీ ముప్పానేని అన్నారు. కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా క్లాక్స్ దర్శకత్వం వహించిన చిత్రం 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బెన్నీ ముప్పానేని మాట్లాడుతూ– ''సినిమాలపై ఉన్న ఆసక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి, నిర్మాతగా మారాను. ఓ ఊహాజనిత గ్రామంలో 2012లో 21 రోజులు ఏం జరిగింది? అనేది 'బెదురులంక 2012' చిత్రకథ. మనం చనిపోతాం అని తెలిస్తే చివరి క్షణాల్లో ఎలా ఉంటాం? అనేది సినిమా కోర్ పాయింట్. కార్తికేయ చాలా ప్రొఫెషనల్. అతనితో మరో సినిమా చేద్దామనుకుంటున్నాం. నేహా శెట్టి పల్లెటూరి అమ్మాయి పాత్రలో ఒదిగిపోయారు. మణిశర్మగారు అద్భుతమైన సంగీతం ఇచ్చారు. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారు రాసిన చివరి పాట మా సినిమాలో ఉండటం మా అదృష్టం. మా సినిమా ట్రైలర్ రిలీజ్ చేసిన రామ్‌చరణ్‌గారు కథని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మా బ్యానర్‌లో మూడు ప్రాజెక్ట్స్ ఓకే చేశాం'' అన్నారు.

వారి ప్రేమను తిరిగి ఇస్తాను

- సాక్షీ వైద్య



''తెలుగు ప్రేక్షకులు నన్ను ప్రేమిస్తున్నారు. ఇప్పుడు నాకు తెలుగు కొంచెం కొంచెం అర్థమవుతోంది. తెలుగు భాష నేర్చుకుని అభిమానుల ప్రేమను తిరిగి ఇస్తాను'' అని హీరోయిన్ సాక్షీ వైద్య అన్నారు. వరుణ్ తేజ్ హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాక్షీ వైద్య మాట్లాడుతూ– ''ఏజెంట్' సినిమా రిలీజ్ కాకముందే కొన్ని షాట్స్‌ను ప్రవీణ్ సార్ చూశారు. 'గాండీవధారి అర్జున'లో ఐరా పాత్రకు నేను సెట్ అవుతానని తీసుకున్నారు. నాకు డ్రైవింగ్ అంతగా రాదు. ఈ మూవీలో ఆ సీన్లు చేసేటప్పుడు భయపడ్డాను. ఈ సినిమాలో నా పాత్రకి నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. తెలుగులో సాయిధరమ్ మూవీతో పాటు 'లక్కీ భాస్కర్', 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలు కమిట్ అయ్యాను. రవితేజగారితోనూ నటించే చాన్స్ ఉంది'' అన్నారు.

మాస్ గోట్

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న నాలుగో చిత్రం 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). దివ్య భారతి హీరోయిన్. 'పాగల్' ఫేమ్ నరేష్ కుప్పిలి దర్శకత్వంలో చంద్రశేఖర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం గ్లింప్స్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ వీడియోలో ఒక చేత్తో క్రికెట్ బ్యాట్ పట్టుకుని, మరో చేత్తో సిగరెట్ కాల్చుతూ మాస్ లుక్‌లో కనిపించారు సుధీర్. ''మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి'' అన్నారు చంద్రశేఖర్ రెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: బాలాజీ సుబ్రహ్మణ్యం.


• సుడిగాలి సుధీర్, దివ్యభారతి

ఎడ్యుకేట్ చేయాలి

- జయప్రకాశ్ నారాయణ్


• జయప్రకాశ్ నారాయణ్, అభయ్ నవీన్

''సినిమా అనేది ఎంటర్‌టైన్ చేయడంతో పాటు ఎడ్యుకేట్ చేయాలి. అలా ఎడ్యుకేట్ చేసే సినిమాలను ప్రోత్సహించాలి. యువత రాజకీయాల్లో తిరుగుతూ సరైన నాయకుడిని ఎంచుకోకుండా, జీవితాలు పాడు చేసుకుంటున్నారు. అలాటి అంశానికి వినోదం జోడించి తీసిన 'రామన్న యూత్'ని ఆదరించాలి'' అని లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకులు డా. జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. అభయ్ నవీన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రామన్న యూత్'. సెప్టెంబర్ 15న ఈ చిత్రం విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌ని జయప్రకాశ్ నారాయణ్ ఆవిష్కరించారు. ''గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ నాయకుల కోసం యువత ఎలాంటి త్యాగాలు చేస్తున్నారు? రాజు అనే ఒక యువకుడు పొలిటికల్ లీడర్‌గా ఎదగాలని చేసే ప్రయత్నాలు ఎలాంటి మలుపులు తిరిగాయి? అనేది ఈ చిత్రకథ'' అన్నారు అభయ్ నవీన్.

అందుకే అందరూ కనెక్ట్ అవుతారు

- నితిన్ కృష్ణమూర్తి



''బాయ్స్ హాస్టల్' కథకు యూనివర్సల్ అప్పీల్ ఉంది. ప్రపంచంలో హాస్టల్స్ అన్ని చోట్ల ఉన్నాయి. అందుకే ఇందులోని పాత్రల్ని అందరూ రిలేట్ చేసుకుంటారు. కన్నడలో సూపర్ హిట్టయిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరిస్తుంది'' అని డైరెక్టర్ నితిన్ కృష్ణమూర్తి అన్నారు. ప్రజ్వల్ బీపీ, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'. ఈ నెల 12న కన్నడలో విడుదలైన ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ 'బాయ్స్ హాస్టల్' పేరుతో తెలుగులో ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా నితిన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ– ''దర్శకుడిగా 'బాయ్స్ హాస్టల్' నా తొలి చిత్రం. అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి చక్కని మ్యూజిక్ చేశారు. తెలుగు నేటివిటీ కోసం రష్మి, తరుణ్ భాస్కర్‌గారి పాత్రల్ని రీ షూట్ చేశాం. అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ లాంటి సంస్థల ద్వారా తెలుగులోకి రావడం హ్యాపీగా ఉంది'' అన్నారు.

యువతకి సందేశం


• సావిత్రి, ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర, సావిత్రి కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో 'ఉపేంద్ర గాడి అడ్డా' సినిమా సోమవారం ఆరంభమైంది. కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న ఈ సినిమా తొలి సీన్‌కి నిర్మాత సాయి వెంకట్ కెమెరా స్విచ్చాన్ చేయగా, చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు క్లాప్ ఇచ్చారు. ఆర్యన్ సుభాన్ ఎస్‌కే మాట్లాడుతూ– ''ప్రస్తుతం వరుణ్ సందేశ్‌తో 'కానిస్టేబుల్' చిత్రం చేస్తున్నాను. 'ఉపేంద్ర గాడి అడ్డా' నేటి ట్రెండ్‌కు తగ్గట్టు ఉంటూనే యువతకు సందేశం ఇచ్చేలా ఉంటుంది'' అన్నారు. ''మా అబ్బాయి ఉపేంద్రతో తొమ్మిది చిత్రాలు తీయాలనుకున్నాం. ఇప్పటికే నాలుగు నిర్మాణంలో ఉన్నాయి. 'ఉపేంద్ర గాడి అడ్డా' ఐదో సినిమా'' అన్నారు కంచర్ల అచ్యుతరావు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 267	65,216
నిఫ్టీ ▲ 83	19,394

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,461	▲	171
డోజోన్స్	34,420	▽	80
ఎఫ్‌టీఎస్ఈ 100	7,258	▽	5
డాక్స్	15,603	▲	29
హాంగ్‌సెంగ్	3,093	▽	39
నికాయ్	31,566	▲	115

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో ముంబై	
బంగారం (24 క్యారట్)	58,396
బంగారం (22 క్యారట్)	58,163
వెండి (కేజీ)	70,835

మార్కెట్లకు దిగ్గజాల దన్ను



జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిస్టింగ్ కార్యక్రమం అనంతరం బీఎస్ఈలో ఫొటోలకు పోజులిచ్చిన సంస్థ ఇండిపెండెంట్ డైరెక్టర్, నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కేవీ కామత్

ముంబై: బ్లూచిప్ కంపెనీలు ఇన్ఫోసిస్, ఐటీసీ తదితర దిగ్గజాలకు డిమాండ్ పుట్టడంతో మార్కెట్లు బలపడ్డాయి. వెరసి రెండు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. సెన్సెక్స్ 267 పాయింట్లు ఎగసి 65,216 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 83 పాయింట్లు జంప్‌చేసి 19,394 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్ల ప్రభావంతో తొలుత మార్కెట్లు హుషారుగా ప్రారంభమయ్యాయి. అయితే వెనువెంటనే అమ్మకాలు పెరిగి నీరసించినప్పటికీ యూరోపియన్ మార్కెట్లు సైతం సానుకూలంగా ప్రారంభం కావడంతో తిరిగి జోరందుకున్నాయి. దీంతో ఒక దశలో సెన్సెక్స్ 387 పాయింట్లవరకూ ఎగసి,

- రెండు రోజుల నష్టాలకు చెక్
- సెన్సెక్స్ 267 పాయింట్లు అప్
- 65,216 వద్ద ముగింపు
- నిఫ్టీ 83 పాయింట్లు ప్లస్

65,336కు చేరింది. ఈ బాటలో నిఫ్టీ 19,426 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే తొలుత 19,296 వద్ద కనిష్టాన్నీ చవిచూసింది.

మెటల్స్ ముందడుగు

ఎన్ఎస్ఈలో మెటల్స్, ఐటీ, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్ రంగాలు 1.3–0.6 శాతం మధ్య పుంజుకోగా.. పీఎస్‌యూ బ్యాంక్స్ 0.6 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో బజాజ్ ఫైనాన్స్ ద్వయం, అదానీ పోర్ట్స్, ఎంటర్‌ప్రైజెస్, హిందాల్కో, ఇండస్ఇండ్, ఎన్‌టీపీసీ, ఎయిర్‌టెల్, అపోలో హాస్పిటల్స్, ఐటీసీ, కోల్ ఇండియా, ఎల్‌టీఐఎం, ఇన్ఫోసిస్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ, టైటన్, యాక్సిస్ 2.7–1 శాతం మధ్య లాభపడ్డాయి. దిగ్గజాలలో ఆర్ఐఎల్, ఎంఅండ్ఎం, బ్రిటానియా మాత్రమే ప్రస్తావించదగ్గ స్థాయిలో 1 శాతం చొప్పున బలహీనపడ్డాయి.

చిన్న షేర్లు గుడ్

మార్కెట్ల ప్రోత్సాహంతో చిన్న షేర్లకు డిమాండ్ కనిపించింది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.7 శాతం చొప్పున వృద్ధి చూపాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 2,062 లాభపడగా.. 1,675 నష్టపోయాయి. నగదు విభాగంలో వారాంతాన రూ. 267 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తాజాగా మరో రూ. 1,901 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 626 కోట్లను ఇన్వెస్ట్ చేయడం గమనార్హం! కాగా.. విదేశీ మార్కెట్లలో బ్రెంట్ చమురు బ్యారల్ 0.6 శాతం బలపడి 85.31 డాలర్లకు చేరింది. డాలరుతో మారకంలో రూపాయి మరోసారి చరిత్రాత్మక కనిష్టం 83.12 వద్ద ముగిసింది.

జియో ఫైనాన్షియల్ లిస్టింగ్.. ఫ్ఛ్

5 శాతం నష్టంతో ముగింపు

డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. బీఎస్ఈలో 1.2 శాతం లాభంతో రూ. 265 వద్ద ప్రారంభమైంది. తదుపరి 5 శాతం పతనమై రూ. 252 దిగువన ముగిసింది. ఇది లోయర్ సర్క్యూట్ కాగా.. షేరు ధర నిర్ధారణకు గత నెలలో స్టాక్ ఎక్స్ఛేంజీలు నిర్వహించిన డమ్మీ ట్రేడింగ్‌లో రూ. 265 వద్ద స్థిరపడిన సంగతి తెలిసిందే. ఇక ఎన్ఎస్ఈలోనూ రూ. 262 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 5 శాతం పడిపోయి లోయర్ సర్క్యూట్‌ను తాకింది. రూ. 249 దిగువన నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 1,59,944 కోట్లుగా నమోదైంది. వెరసి టాప్–100 విలువైన కంపెనీలలో 34వ ర్యాంకులో నిలిచింది.



ట్రేడ్ ఫర్ ట్రేడ్ విభాగంలో

ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని గత నెలలో ఆర్ఐఎల్ రిలయన్స్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ప్రత్యేక కంపెనీగా విడదీసింది. ఆపై జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌గా ఈ సంస్థ ఆవిర్భవించింది. ఈ కౌంటర్లో లావాదేవీలను స్టాక్ ఎక్స్ఛేంజీలు 10 రోజులపాటు ట్రేడ్ ఫర్ ట్రేడ్ విభాగంలో అనుమతించాయి. ఈ నేపథ్యంలో 5 శాతం వరకూ షేరు ధర క్షీణించింది. కంపెనీల విడదీతపై సవరించిన నిబంధనల అమలులో భాగంగా సెన్సెక్స్, నిఫ్టీలలో జియో ఫైనాన్షియల్‌కు తాత్కాలికంగా చోటు లభించింది. ఫలితంగా సెన్సెక్స్‌లో 31వ, నిఫ్టీలో 51వ కంపెనీగా ప్రాతినిధ్యం వహించింది. మరోవైపు మాతృ సంస్థ ఆర్ఐఎల్ షేరు 1.5 శాతం నష్టపోయి రూ. 2,518 వద్ద ముగిసింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ల కొనుగోలు



69.87 శాతానికి అదానీ గ్రూప్ వాటా

డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రమోటర్ అదానీ గ్రూప్ వాటాను పెంచుకుంది. ఈ నెల 7–18 మధ్యలో ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 2.22 శాతం వాటాను కొనుగోలు చేసింది. దీంతో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రమోటర్ గ్రూప్ వాటా 67.65 శాతం నుంచి 69.87 శాతానికి బలపడింది. ప్రమోటర్ గ్రూప్ సంస్థ.. కెమ్‌పాస్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ తాజా వాటాను కొనుగోలు చేసింది.

ఐపీవోకు ఏపీజే సురేంద్ర పార్క్ హోటల్స్



పార్క్ బ్రాండ్ కింద హోటల్స్ నిర్వహించే ఏపీజే సురేంద్ర పార్క్ హోటల్స్ తాజాగా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా రూ. 1,050 కోట్లు సమీకరించనుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఆఫర్‌లో భాగంగా రూ. 650 కోట్ల విలువ చేసే షేర్లను కొత్తగా జారీ చేయనుండగా, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద రూ. 400 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు.

విష్ణు ప్రకాష్ ఆఫర్ ధర @ రూ. 94-99

ఈ నెల 24–28 మధ్య ఐపీవో

ఈపీసీ సేవల కంపెనీ విష్ణు ప్రకాష్ ఆర్ పంగ్లియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 24న ప్రారంభంకానుంది. ఇందుకు షేరుకి రూ. 94–99 ధరల శ్రేణిని ప్రకటించింది. 28న ముగియనున్న ఇష్యూలో భాగంగా కంపెనీ 3.12 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. తద్వారా రూ. 309 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇష్యూలో కొంతమేర అర్హతగల ఉద్యోగులకు కేటాయించనుంది.

మార్కెట్లోకి మళ్లీ హానర్ స్మార్ట్‌ఫోన్లు: సీఈవో మాధవ్ సేథ్



న్యూఢిల్లీ: హానర్ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్లు మళ్లీ భారత్ మార్కెట్లోకి రానున్నాయి. చైనా స్మార్ట్ డివైజెస్ సంస్థ హానర్ నుంచి లైసెన్సు పొందిన హానర్‌టెక్ కంపెనీ వీటిని సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో ఉంది. ఈ వ్యాపారానికి సంబంధించి రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. హానర్‌టెక్ సీఈవో మాధవ్ సేథ్ ఈ విషయాలు వెల్లడించారు. వచ్చే ఏడాది ఆఖరు నాటికి 4–5 శాతం మార్కెట్ వాటాను దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నట్లు, తద్వారా రూ. 10,000 కోట్లు ఆదాయం సాధించే అవకాశాలు ఉన్నట్లు ఆయన వివరించారు. హానర్‌టెక్ పూర్తిగా భారత సంస్థ అని, హానర్ నుంచి తీసుకున్న లైసెన్సుతో ఇక్కడే తయారీ నుంచి అమ్మకాల కార్యకలాపాలు నిర్వహించనున్నామని సేథ్ చెప్పారు. చైనా టెలికం దిగ్గజం హువావే అప్పట్లో హానర్ బ్రాండ్‌ను ప్రవేశపెట్టింది. ఆ తర్వాత 2020లో మరో చైనా సంస్థకు దాన్ని విక్రయించింది. మరోవైపు, రియల్‌మి అంతర్జాతీయ వ్యాపారానికి సారథ్యం వహిస్తున్న సేథ్ ఇటీవలే దాన్నుంచి తప్పుకున్నారు. వ్యాపారవేత్త సీపీ ఖండేల్వాల్‌కి చెందిన పీఎస్‌ఏవీ గ్లోబల్‌తో కలిసి హానర్‌టెక్‌ను జాయింట్ వెంచర్‌గా ఏర్పాటు చేశారు.

సన్నీ విల్లా వేలం ప్రక్రియ వెనక్కి



ముంబై: బాలీవుడ్ నటుడు, సిట్టింగ్ ఎంపీ సన్నీ డియోల్‌కు చెందిన విల్లా వేలం ప్రక్రియ నోటీసును బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) ఉపసంహరించుకుంది. బకాయిలన్నీ కట్టేసేందుకు సన్నీ అంగీకరించడమే ఇందుకు కారణమని తెలిపింది. ముంబైలోని సన్నీ విల్లాకు సంబంధించి సన్నీ డియోల్ దాదాపు రూ. 56 కోట్లు బాకీ పడ్డారని, దాన్ని రాబట్టుకునేందుకు ప్రాపర్టీని సెప్టెంబర్ 25న వేలం వేయనున్నామని బీవోబీ ఆదివారం నాడు పబ్లిక్ నోటీసు ఇచ్చింది. వేలానికి రూ. 51.43 కోట్ల రిజర్వ్ ధరను, రూ. 5.14 కోట్ల మొత్తాన్ని బయానాగా నిర్ణయించింది.

ఎల్‌అండ్‌టీకి ఆస్ట్రేలియా యూరియా ప్లాంటు కాంట్రాక్టు



ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం ఎల్‌అండ్‌టీ తాజాగా ఆస్ట్రేలియాలో అతి పెద్ద యూరియా ప్లాంటు నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకుంది. 2.3 మిలియన్ టన్నుల యూరియా ప్లాంటును ఏర్పాటు చేసేందుకు పెర్డమాన్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ నుంచి ఒక 'భారీ' ఆర్డరు లభించినట్లు సంస్థ తెలిపింది. డీల్ విలువ ఎంతనేది మాత్రం వెల్లడించకపోయినా 'గణనీయ స్థాయి ఆర్డరు' అని పేర్కొంది. సాధారణంగా ఈ తరహా ఆర్డరు విలువ సుమారు రూ. 1,000 కోట్ల నుంచి రూ. 2,500 కోట్లుగా ఉంటుంది. ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి విలువ మారే అవకాశం ఉండే డీల్స్ గణాంకాల గురించి ముందుగా వెల్లడించరాదనే విధానాన్ని పాటిస్తున్నట్లు సంస్థ సీఎండీగా నియమితులైన ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు. వ్యయాల భారం, కార్మికుల కొరత కారణంగా ప్లాంటుకు సంబంధించిన ప్రీ–ఫ్యాబ్రికేటెడ్ యూనిట్లను భారత్‌లో తయారు చేసి ఆస్ట్రేలియాలో అసెంబుల్ చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇది ప్రపంచంలోనే అతి పెద్ద యూరియా ప్లాంట్లలో ఒకటి కాగలదని పెర్డమన్ చైర్మన్ వికాస్ రాంబల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/ 100కు రూ.లలో)

22-8-2023	
విశాఖ	470-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	445-00
రిటైల్ ధర (డజను)	72.00
21-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌టీఏ-పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ 2023

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ప్రవేశ పరీక్ష 2023 ప్రకటనను విడుదలచేసింది. ఈ పరీక్ష ద్వారా యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ, బెనారస్ హిందూ యూనివర్శిటీ, బాబా భీమ్‌రావ్ అంబేద్కర్ యూనివర్శిటీల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందవచ్చు.

» **విభాగాలు:** కామర్స్, ఫైనాన్స్, ఆర్ట్ అండ్ కల్చర్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్, సైన్సెస్, ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ తదితరాలు.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేట్/తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** వయోపరిమితి నిబంధనలు లేవు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహిస్తారు. రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి విభాగంలో రీసెర్చ్ మెథడాలజీ, రెండో విభాగంలో సంబంధిత సబ్జెక్టు నుంచి ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 100 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 09.09.2023 నుంచి 11.09.2023 వరకు
» **వెబ్‌సైట్:** https://www.nta.ac.in

ఎస్ఎస్‌సీ-జేహెచ్‌టీ, జేటీ, ఎస్‌హెచ్‌టీ పరీక్ష-2023

స్టాఫ్ సెలక్షన్ సెలక్షన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి నిర్వహించే రాత పరీక్షకు సంబంధించి సంక్షిప్త ప్రకటనను విడుదల చేసింది. దీని ద్వారా సెంట్రల్ సెక్రటేరియట్, రైల్వే బోర్డులు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, సెంట్రల్ హిందీ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో పోస్టులు భర్తీ చేయనున్నారు.

» **అర్హత:** పోస్టును అనుసరించి మాస్టర్ డిగ్రీ(హిందీ/ఇంగ్లిష్) డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లిష్ సబ్జెక్టు పాఠ్యాంశంగా ఉండాలి. దీనితోపాటు ట్రాన్స్‌లేషన్ (హిందీ/ఇంగ్లిష్) డిప్లొమా/సర్టిఫికేట్ కోర్సు చేసి ఉండాలి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థలో రెండేళ్ల ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీతోపాటు మూడేళ్ల ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ/పీజీ(హిందీ/ఇంగ్లిష్) అర్హతతోపాటు తగు అనుభవం ఉండాలి. డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లిష్ సబ్జెక్టు పాఠ్యాంశంగా ఉండాలి. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో సీనియర్ సెకండరీ స్థాయిలో రెండేళ్ల హిందీ బోధన అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(పేపర్-1, పేపర్-2), డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 22.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.09.2023
» **పరీక్ష తేదీలు:** అక్టోబర్/నవంబర్ 2023.
» **వెబ్‌సైట్:** ssc.nic.in

తిరుపతి స్విమ్స్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ).. నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్ యూనివర్శిటీ).. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** అనెస్తీషియాలజీ, గైనకాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెంటల్ సర్జరీ, పాథాలజీ, డెర్మటాలజీ, ఫార్మకాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, సైకియాట్రీ, జనరల్ సర్జరీ, రేడియో డయాగ్నోసిస్, హెమటాలజీ, రేడియోథెరపీ, న్యూక్లియర్ మెడిసిన్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/డీఎం/ఎంసీహెచ్/ఎంఎస్సీ /ఎంపీటీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా సీటు కేటాయిస్తారు. యూజీసీ-నెట్ లేదా యూజీసీ-సీఎస్ఐఆర్ నెట్/జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందిన అభ్యర్థులకు ప్రవేశపరీక్ష నుంచి మినహాయింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్‌సైన్సెస్, స్విమ్స్ యూనివర్శిటీ, అలిపిరి రోడ్, తిరుపతి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.09.2023.
» **వెబ్‌సైట్:** svimstpt.ap.nic.in

» గ్రామీణ్ డాక్ సేవక్ పోస్ట్‌లకు ప్రకటన
» బీపీఎం, ఏబీపీఎం, డాక్ సేవక్ పోస్ట్‌లు
» పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక
» ఏపీలో 1,058 ; తెలంగాణలో 961 పోస్ట్‌లు

పదితోనే.. కేంద్ర కొలువు

ఎలాంటి రాత పరీక్షలు లేకుండానే.. పదో తరగతిలో మార్కుల ఆధారంగా.. కేంద్ర ప్రభుత్వ కొలువు దక్కించుకునే అవకాశం ముంగిటకొచ్చింది. భారత తపాలా శాఖ.. గ్రామీణ్ డాక్ సేవక్ పేరిట.. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్/డాక్ సేవక్‌ల పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా మొత్తం 30,041 పోస్టులకు నియామకాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో.. ఇండియా పోస్ట్స్.. గ్రామీణ్ డాక్ సేవక్ ఉద్యోగాల వివరాలు, ఎంపిక విధానం, విధులు, వేతనాలు తదితర వివరాలు..



భారత తపాలా శాఖ.. మెట్రో నగరాల నుంచి మారుమూల పల్లెల వరకు సేవలందిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వినియోగదారులకు సేవలందించేందుకు వినూత్న విధానలను అవలంబిస్తూ శాఖలను విస్తరిస్తోంది. దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్న గ్రామాల పరిధిలోని ప్రజలకు సేవలు అందించే ఉద్దేశంతో.. గ్రామీణ్ డాక్ సేవక్ పోస్ట్‌లకు గతంలోనే రూపకల్పన చేసింది. ఈ పోస్ట్‌ల్లో నియామకాలకు ప్రతి ఏటా ప్రకటన ఇస్తోంది. తాజాగా 2023కు సంబంధించి గ్రామీణ్ డాక్ సేవక్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్ట్‌ల వివరాలు

గ్రామీణ్ డాక్ సేవక్ పేరిట.. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్ పోస్టులను భర్తీ చేయనుంది. వీరు తమకు కేటాయించిన పోస్ట్ ఆఫీస్ పరిధిలో నిర్దేశిత విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఏపీలో 1,058, తెలంగాణలో 961

తాజా నోటిఫికేషన్ ద్వారా తపాలా శాఖ దేశ వ్యాప్తంగా మొత్తం 30,041 గ్రామీణ్ డాక్ సేవక్ పోస్ట్‌లను భర్తీ చేయనుంది. వీటిలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో 1,058, తెలంగాణ సర్కిల్‌లో 961 పోస్ట్‌లు ఉన్నాయి.

అర్హతలు

- పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లను తప్పనిసరిగా చదివుండాలి. అభ్యర్థులు తమ స్థానిక భాషను చదివుండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, సైక్లింగ్ కూడా అవసరం.
- **వయసు:** ఆగస్ట్ 23,023 నాటికి 18–40 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

పదో తరగతి మెరిట్

బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్..ఈ మూడు పోస్ట్‌లకు కూడా పదో తరగతిలో ప్రతిభ ఆధారంగానే నియామకాలు ఖరారు చేస్తారు. పదో తరగతిలో అభ్యర్థులు పొందిన మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఎలాంటి రాత పరీక్షలు ఉండవు.

ఆకర్షణీయ వేతనం

- బీపీఎం, ఏబీపీఎం, డాక్ సేవక్‌లకు వేతనాలు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి.
- బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లకు రూ.12,000 -రూ.29,380 శ్రేణిలో వేతనం ఉంటుంది. అంటే.. రూ.12 వేల మూల వేతనంతో కెరీర్ ప్రారంభమవుతుంది.
- అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్‌లకు రూ.10,000 -రూ.24,470 శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.
- వీటికి అదనంగా ఈ మూడు పోస్ట్‌లకు డీఏ, అదే విధంగా టైమ్ రిలేటెడ్ కంటిన్యుటీ అలవెన్స్ పేరిట ఇతర భత్యాలు కూడా లభిస్తాయి. మొత్తంగా నెలకు రూ.14 వేలకు పైగా వేతనం పొందొచ్చు.
- వీటితోపాటు ఆఫీస్ నిర్వహణ భత్యం, సైకిల్ నిర్వహణ భత్యం, కంబైన్డ్ డ్యూటీ అలవెన్స్ వంటివి కూడా అందుకునే వీలుంది.

ఆఫీస్ సదుపాయం బాధ్యత

గ్రామీణ్ డాక్ సేవక్‌ల విషయంలో మరో కీలక నిబంధన.. ఈ పోస్ట్‌లకు ఎంపికైన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్స్.. తమ గ్రామ స్థాయిలో కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి వసతి సదుపాయం చూపించాల్సి ఉంటుంది. ఎంపికైన వారు సంబంధిత గ్రామంలోనే నివాసం ఉండాలనే నిబంధన కూడా విధించారు.

విధులు ఇలా

బ్రాంచ్ పోస్ట్ మాస్టర్

ఈ హోదాలో రోజు వారీ తపాలా వ్యవహారాలు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌కు సంబంధించిన విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. తపాలా శాఖ అందిస్తున్న ఉత్పత్తులు, సేవలకు సంబంధించి మార్కెటింగ్, కొత్త కస్టమర్లను చేర్పించడం వంటి బాధ్యతలు సైతం చేపట్టాల్సి ఉంటుంది.

అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్

ఈ హోదాలో స్టాంపులు,స్టేషనరీ విక్రయం, ఉత్తరాల బట్వాడాతోటు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించి కస్టమర్ల నుంచి డిపాజిట్లు, చెల్లింపులు వంటి విధులు నిర్వర్తించాలి. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు సహాయం అందించాలి. అదే విధంగా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ లేని సమయాల్లో బీపీఎం విధులను కూడా ఏబీపీఎం నిర్వర్తించాల్సి ఉంటుంది.

డాక్ సేవక్

వీరిని సబ్ పోస్ట్ ఆఫీస్‌లు, హెడ్ పోస్ట్ ఆఫీస్‌లలో నియమిస్తారు. వీరు విధుల్లో భాగంగా స్టాంపులు, స్టేషనరీ విక్రయాలు, అదే విధంగా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకుకు సంబంధించిన డిపాజిట్లు, చెల్లింపులు, ఇతర కార్యకలాపాలను నిర్వర్తించాలి. వినియోగదారులకు వారి నివాసం వద్దే సేవలు అందించాల్సి ఉంటుంది. అంతేకాకుండా వీరు రైల్వే మెయిల్ సర్వీస్‌లోని సార్టింగ్ ఆఫీస్‌లు,మెయిల్ బ్యాగ్స్ పంపడం వంటి విధులు కూడా నిర్వర్తించాలి.

15 రోజుల్లోపు సమ్మతి

ఎంపికైన అభ్యర్థులు.. ఎంపిక జాబితా వెల్లడైన పదిహేను రోజుల్లోపు ఆయా పోస్ట్‌లలో చేరేందుకు తమ సమ్మతిని తెలపాల్సి ఉంటుంది. లేదంటే వారి పేరుని తొలగించి.. ఆ స్థానంలో మెరిట్ జాబితాలోని ఇతర అభ్యర్థులతో మార్కుల ఆధారంగా రెండో జాబితా విడుదల చేస్తారు.

స్వస్థలంలో పని చేసే అవకాశం

గ్రామీణ్ డాక్ సేవక్ పోస్ట్‌లకు ఎంపికైతే తమ స్వస్థలాల్లోనే పని చేసే అవకాశం లభిస్తుంది. అభ్యర్థులు డివిజన్ వారీగా మాత్రమే పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకోవాలని.. పోస్ట్‌ల వారీగా ప్రాథమ్యతను దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలని స్పష్టం చేశారు. ఆయా సర్కిల్స్ పరిధిలో భాష ప్రాతిపదికగా పోస్ట్‌ల సంఖ్యను పేర్కొన్నారు.

దీంతో.. తెలుగు రాష్ట్రాలకు(ఏపీ, తెలంగాణ) చెందిన అభ్యర్థులు ఈ రాష్ట్రాల్లోని డివిజన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 23.08.2023
- **ఆన్‌లైన్‌లో దరఖాస్తు సవరణ అవకాశం:** ఆగస్ట్ 24 నుంచి 26 వరకు
- **ఎంపిక జాబితా వెల్లడి:** 31.12.2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://indiapo-stgdsonline.gov.in
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://indiapostgdsonline.gov.in/Reg_validation.aspx

క్లుప్తంగా...



'ఎల్బ్రస్'పై జై తెలంగాణ

ఫిట్‌నెస్ ప్రమోషన్‌లో భాగంగా కొత్త ఫీట్

సాక్షి, హైదరాబాద్: 14 డిగ్రీల మైనస్ ఉష్ణోగ్రతలు, 18,600 అడుగుల ఎత్తులో యూరప్‌లోనే అత్యంత ఎత్తైన ఎల్బ్రస్ మంచు శిఖరాన్ని హైదరాబాద్‌కు చెందిన ఫిట్‌నెస్ ట్రైనర్ సిమ్‌లయన్ జయసింహాగౌడ్ బృందం విజయవంతంగా అధిరోహించింది. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో 'ఫిట్‌నెస్' కూడా భాగం కావాలన్న లక్ష్యంతో మొదలైన పర్వతారోహణ కేవలం ఐదు రోజుల్లో పూర్తి చేసినట్లు జయసింహాగౌడ్ సోమవారం హైదరాబాద్‌లో వెల్లడించారు. అనేక ప్రతికూలతల మధ్య తాము భారత పతాకంతో పాటు జై తెలంగాణ పతాకాన్ని ఎగరేసి తమ విజయాన్ని మంత్రి కేటీఆర్‌కు అంకితం చేసినట్లు ఆయన తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇండిగో విమానంలో షార్జా నుంచి వచ్చిన ప్రయాణికుడిని తనిఖీ చేయడంతో 397 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. వాటి విలువ సుమారు రూ.20.59 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మిస్సింగ్ కేసులపై ఫోకస్ పెట్టండి: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నమోదైన వ్యక్తుల మిస్సింగ్ కేసులపై ఫోకస్ పెట్టాలని పోలీస్ అధికారులను, సిబ్బందిని డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. అందుబాటులో ఉన్న రికార్డులతో సరిచూసి అదృశ్యమైన వారి కేసుల్లో పురోగతి సాధించాలని సూచించారు. సోమవారం డీజీపీ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్స్ బ్యూరో, సెంట్రల్ క్రైం రికార్డ్స్ బ్యూరోల సిబ్బందితో అర్ధవార్షిక సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ సమావేశంలో సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, ఐజీలు షానవాజ్ ఖాసీం, చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ అంబర్ కిశోర్ ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ జైళ్ల నుంచి విడుదలైన నేరస్తుల కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. ఫింగర్ ప్రింట్ బ్యూరోలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న సిబ్బందిని డీజీపీ అభినందించారు.

● ఇక్కడ తేళ్లు కుట్టవు!



నారాయణపేట: 'తేలు.. తేలు ఎందుకు కుట్టావ్ అంటే.. నా బంగారు బుట్టలోన వేలు పెడితే కుట్టనా అందట'. కానీ, నారాయణపేట జిల్లా సరిహద్దు కర్ణాటక రాష్ట్రంలోని కందుకూరులో మాత్రం తేళ్లు కుట్టమన్నా కుట్టవట. చిన్నారులు మొదలుకొని పెద్దవాళ్ల వరకు ఎవరైనా తేళ్లను చేతుల్లో పట్టుకొని ముఖం, నాలుక, నెత్తి మీద ఇలా ఎక్కడ పెట్టుకున్నా ఎలాంటి హాని తలపెట్టవు. సోమవారం నాగుల పంచమిని పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లా గుర్మిట్కల్ తాలూకా కందుకూరు గ్రామ సమీపంలోని కొండమవ్వ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాళ్లు, మట్టి కింద ఉన్న తేళ్లను పట్టుకుని సరదాగా గడిపారు. అమ్మవారి మహిమ వల్లే తేళ్లు భక్తులకు హాని చేయవని భక్తుల విశ్వాసం. కొందరు విద్యావంతులు మాత్రం అక్కడ ఉండే వాతావరణ పరిస్థితులు, వనమూలికల కారణంగా తేళ్లు కుట్టలేకపోతున్నాయని అభిప్రాయపడుతున్నారు.




యువకుడి చేతిపై తేలు

రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3,06,42,333

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,06,42,333కు చేరింది. అందులో 1,53,73,066 మంది పురుషులు, 1,52,51,797 మంది మహిళలు, 2,133 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక రెండో సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల ముసాయిదా ఓటర్ల జాబితాలను సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్ రాజ్ ప్రకటించారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు/ కొత్తగా ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 19 వరకు గడువు ఉందని తెలిపారు. సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులను పరిష్కరించి అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఈ ఓటర్ల జాబితానే వినియోగించనున్నారు. ఇక రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాలుండగా, ముసాయిదా జాబితాలో 3,06,26,996 మంది సాధారణ ఓటర్లతో పాటు మరో 2,742 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 15,337 మంది సర్వీసు ఓటర్లున్నారు. 18–19 వయస్సు కలిగిన యువ ఓటర్ల సంఖ్య 4,76,597.

పురుషులు	1,53,73,066
మహిళలు	1,52,51,797
మూడో జెండర్	2,133

అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా విడుదల



కొత్త ఓటర్లు 8,31,520 మంది

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2023లో భాగంగా గత జనవరి 5న ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో మొత్తం 2,99,77,659 మంది ఓటర్లు ఉండగా, ఓటర్ల జాబితా నిరంతర నవీకరణలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 8,31,520 మంది ఓటర్లను నమోదు చేశారు. 1,82,183 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు.

ఓటు తొలగిస్తే 15 రోజుల్లోగా అప్పీల్ చేయాలి

ముసాయిదా జాబితాలో ఎవరిదైన పేరును తప్పుగా తొలగిస్తే బాధిత ఓటర్లు 15 రోజుల గడువులోగా జిల్లా ఎన్నికల అధికారికి అప్పీల్ చేసుకోవాలని సూచించారు. లేకుంటే మళ్లీ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం–6 దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'ఓటర్ల' అధికారుల బదిలీలపై నిషేధం

సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఓటర్ల జాబితా రూపకల్పనలో పాలుపంచుకుంటున్న అధికారుల బదిలీలపై కేంద్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ఓటర్ల జాబితా సవరణలో కీలకమైన జిల్లా ఎన్నికల అధికారులు, ఉప జిల్లా ఎన్నికల అధికారులు, ఓటర్ల నమోదు అధికారులు, సహాయ ఓటర్ల నమోదు అధికారులు తదితర స్థాయి అధికారుల బదిలీలపై ఈ నెల 21 నుంచి అక్టోబర్ 4 వరకు నిషేధం అమల్లోకి ఉండనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓటర్ల జాబితా తయారీ బాధ్యతల్లోని అధికారులను బదిలీ చేస్తే జాబితా నాణ్యతపై ప్రభావం పడుతుందని స్పష్టం చేశారు. ఒకవేళ అత్యవసరంగా ఎవరైనా అధికారిని బదిలీ చేయాల్సివస్తే స్పష్టమైన వివరాలు అందజేసి ఎన్నికల సంఘం నుంచి అనుమతి పొందాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి నుంచి బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) వరకు బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో ఈ నిబంధన లు వర్తిస్తాయన్నారు. దీర్ఘకాలిక సెలవు ల్లో వెళ్లడానికి ముందు ఎన్నికల సంఘం నుంచి అనుమతి పొందాలని అధికారులను సూచించారు.

'కృష్ణా' కమిటీ భేటీకి తెలంగాణ దూరం

- రాష్ట్ర ఈఎన్‌సీ లేకుండానే సమావేశం నిర్వహించిన బోర్డు
- హాజరైన కన్వీనర్, ఏపీ ఈఎన్‌సీ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా బోర్డు నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశానికి తెలంగాణ గైర్హాజరైంది. సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకుండా కృష్ణా బోర్డు ఈ సమావేశాన్ని నిర్వహించింది. త్రిసభ్య కమిటీ కన్వీనర్ డీఎం రాయిపూరే, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి ఈ సమావేశానికి హాజరు కాగా, తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్ దూరంగా ఉండిపోయారు. ఏపీ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 13.2 టీఎంసీలు, హంద్రీ నీవా సుజల స్రవంతికి 9 టీఎంసీలు, సాగర్ కుడి కాల్వకు 9 టీఎంసీలు, సాగర్ ఎడమ కాల్వకు 1.98 టీఎంసీలు కలుపుకుని మొత్తం 30 టీఎంసీలు కేటాయించాలని ఈ సమావేశంలో ఏపీ ఈఎన్‌సీ విజ్ఞప్తి చేశారు. ఏపీ విజ్ఞప్తిపై ఈ సమావేశంలో త్రిసభ్య కమిటీ కన్వీనర్ రాయిపూరే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. త్వరలో మరోసారి సమావేశం నిర్వహించి తెలంగాణతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఏపీకి తెలిపినట్టు తెలిసింది. ఆలోగా తాగునీటి అవసరాలకు నీటిని కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. శ్రీశైలంలో తెలంగాణ విద్యుదుత్పత్తి చేయకుండా కట్టడి చేయాలని ఈ సమావేశంలో ఏపీ మరోసారి కోరింది. కాగా, ప్రస్తుత నీటి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటివరకు 42 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకుందని తెలంగాణ ఆరోపించింది.

వారణాసిలో తెలుగు భక్తులకు సదుపాయాలు

జీవీఎల్ ఎంపీలాడ్స్ నిధులతో అందుబాటులోకి

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు ప్రాంతాల నుంచి ఎక్కువగా వెళ్లే భక్తులకు వారణాసిలో మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. శ్రీ కాశీ విశ్వనాథ్ మందిర్‌లో వృద్ధులైన యాత్రికులు, మహిళలు, దివ్యాంగులు, కాలి నడకన ఆలయానికి చేరుకోలేని వారి సౌలభ్యం కోసం తన ఎంపీలాడ్స్ నిధుల నుంచి బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు బ్యాటరీతో నడిచే గోల్ఫ్‌కార్ట్‌లను అందించారు. సోమవారం ఉదయం వారణాసి మేయర్ అశోక్ తివారీ, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగు ఆశ్రమాల ప్రతినిధులు పాల్గొన్న ప్రత్యేక కార్యక్రమంలో వీటిని జీవీఎల్.. దేవస్థాన అధికారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అవకాశం తనకు వచ్చినందుకు తాను అదృష్టవంతుడినని వ్యాఖ్యానించారు.

సీజేతో ముఖ్యమంత్రి భేటీ

కోర్టుల్లో వసతుల కల్పనపై చర్చ



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం భేటీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా కోర్టుల్లో మౌలిక వసతుల కల్పన, సంబంధిత అంశాలపై సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీఐ)లో జరిగిన సమావేశంలో వీరిరువురూ చర్చించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు జస్టిస్ శ్యామ్ కోషీ, జస్టిస్ అభినందన్ కుమార్ షావిలీ, జస్టిస్ వినోద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ముఖ్యకార్యదర్శి నర్సింగ్ రావు, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తిరుమలాదేవి, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గురుకుల పరీక్షలకు రేపటితో ముగింపు!

ఈ నెల ఒకటిన ప్రారంభమైన పరీక్షలు

- సగటున 78 శాతం మంది అభ్యర్థులు హాజరు
- పరీక్షలు ముగిసిన వెంటనే నియామకాల ప్రక్రియ వేగవంతం



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి నిర్వహిస్తున్న అర్హత పరీక్షల ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. ఐదు గురుకుల సొసైటీల్లో 9,231 ఉద్యోగాల భర్తీకి ఈనెల ఒకటో తేదీన పరీక్షలు ప్రారంభమయ్యాయి. నాలుగు ప్రభుత్వ సెలవు దినాలు మినహా వరుసగా 23వ తేదీ వరకు పరీక్షలు కొనసాగేలా షెడ్యూల్‌ను రూపొందించిన తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) విజయవంతంగా ఈ పరీక్షలను నిర్వహిస్తోంది. పూర్తయిన పరీక్షలకు సగటున 78 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. కాగా, సోమవారం జరిగిన పరీక్షలకు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కాస్త ఆలస్యం జరిగినప్పటికీ అభ్యర్థులకు కేటాయించిన సమయాన్ని పూర్తిస్థాయిలో ఇవ్వడంతో ఎలాంటి ఆందోళనలు చోటుచేసుకోలేదు. పరీక్ష ప్రారంభమైన సమయం నుంచి నిర్దేశించిన రెండు గంటల పాటు సమయం ఇవ్వడంతో అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు బోర్డు అధికారులు వెల్లడించారు.

వడివడిగా నియామకాల ప్రక్రియ..

గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు ఈసారి కొత్తగా ఆన్‌లైన్ పరీక్షల విధానాన్ని ప్రవేశపెట్టింది. అన్ని పరీక్షలను సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పద్ధతిలో నిర్వహించడంతో ఫలితాల ప్రకటన సైతం వేగవంతంగా జరగనుంది. ఓఎంఆర్ ఆధారిత పరీక్షలకు సుదీర్ఘ సమయం పడుతుంది. అభ్యర్థులు జవాబులు రాసిన ఓఎంఆర్ పత్రాలను స్కానింగ్ చేయడం, అనంతరం వాటిని ఆన్‌లైన్లో పొందుపర్చడం, ఆ తర్వాత మూల్యాంకనం చేసి మార్కులు ప్రకటించడం.. వాటిని విశ్లేషించి ఎంపిక జాబితాలు రూపొందించడం వంటి ప్రక్రియకు నెలల తరబడి సమయం పడుతుంది. అదే సీబీటీ పద్ధతిలో నిర్వహించే పరీక్షలకు ఇదంతా లేకుండా నేరుగా మార్కులు ప్రకటిస్తారు. అంతకు ముందు పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ, ఆ తర్వాత తుది కీ ఖరారు.. అదే రోజున మార్కులు వెల్లడించడం ఉంటుంది. ప్రస్తుతం కొనసాగుతున్న పరీక్షలు పూర్తి అయిన వెంటనే ప్రాథమిక కీలు విడుదల చేసే అవకాశాలున్నాయి. అనంతరం అభ్యంతరాలు స్వీకరించడం.. తుది కీ ఖరారు చేసి మార్కులు ప్రకటించడం దాదాపు పది రోజుల్లో జరుగుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తంగా రెండు నెలల్లో నియామకాల ప్రక్రియ సైతం పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

45 మందికి తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలు

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 45 మంది ప్రముఖులకు కీర్తి పురస్కారాలను ప్రకటించింది. తెలుగు వర్సిటీ ఏటా ఈ పురస్కారాలను ఇస్తున్న విషయం తెలిసిందే. వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ తెలిపారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో డాక్టర్ చెన్నమనేని హన్మంతరావు (ఆధ్యాత్మిక సాహిత్యం) డాక్టర్ వెలుదండ వెంకటేశ్వరరావు (ప్రాచీన సాహిత్యం), సంగెనేని రవీంద్ర (సృజనాత్మక సాహిత్యం), ఎన్.గోపాలకృష్ణ (కాల్పనిక సాహిత్యం), చేవూరు సుబ్బారావు (అనువాద సాహిత్యం), డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ (అనువాదం), సంగనభట్ల చిన్న రామకిష్టయ్య (బాలసాహిత్యం), రేగులపాటి విజయలక్ష్మి (ఉత్తమ రచయిత్రి), వసుమతి (ఉత్తమ రచయిత్రి), కె.ప్రభాకర్ (వచన కవిత), చెరుకు సత్యనారాయణరెడ్డి (గేయ కవిత), సందాపురం బిచ్చయ్య (పద్య రచన), డాక్టర్ శాస్త్రుల రఘుపతి (పద్య రచన), కూర చిదంబరం (కథ), చుండూరు సీత (నవల), రాచమల్ల ఉపేందర్ (హాస్య రచన), ఎస్.ఆర్.పృథ్వీ (వివిధ ప్రక్రియలు), నాగబాల సురేశ్ కుమార్ (ఉత్తమ నాటక రచయిత), దొంతి జంగయ్య గౌడ్ (ఉత్తమ నటుడు), బెంగళూరు పద్మ (ఉత్తమ నటి), అభినయ శ్రీనివాస్ (నాటకరంగంలో కృషి), వెంకు (జనరంజక విజ్ఞానం), డాక్టర్ గుంజి వెంకటరత్నం (పరిశోధన), ప్రొఫెసర్ అమరేశం రాజేశ్వరశర్మ (ఛందస్సు), అన్నంరాజు సుబ్బారావు (సాహిత్య విమర్శ), వల్లూరి రమేశ్ (అవధానం), డాక్టర్ సాకే భారతి (మహిళాభ్యుదయం), విన్నకోట మురళీకృష్ణ (లలిత సంగీతం), డాక్టర్ చల్లా విజయలక్ష్మి (శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు), తేలు విజయ (జానపద గాయకులు), గంగాధర్ (జానపద కళలు), డాక్టర్ షేక్ హసీనా (జీవిత చరిత్ర), పరాంకుశం వేణుగోపాలస్వామి (పత్రికా రచన),పేరిణి శ్రీనివాస్ (పేరిణి నృత్యం), చింతారవి బాలకృష్ణ (కూచిపూడి నృత్యం), ధనుంజయ లాడె (సంఘసేవ), టి.రమేశ్ (హేతువాద ప్రచారంలో కృషి), ప్రొఫెసర్ కందిమళ్ల భారతి (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), వేముల శ్రీనివాసులు (గ్రంథాలయకర్త-ముల్కనూరు), వేముల వెంకటేశ్వర్లు (సాంస్కృతిక సంస్థ నిర్వహణ), అలీ (ఇంద్రజాలం), శ్యాంమోహన్ (కార్టూనిస్ట్), డాక్టర్ సంధ్యా లక్ష్మి (జ్యోతిషం), మేకిరి దామోదర్ (ఉత్తమ ఉపాధ్యాయులు) భార్గవి (చిత్రలేఖనం-మహిళ) ఉన్నారు. త్వరలో వర్సిటీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వీరికి పురస్కారాలు అందజేస్తామని రిజిస్ట్రార్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్	నిఫ్టీ
	3
	19,396

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	13,494	5
డోజోన్స్	34,277	186
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,271	13
డాక్స్	15,706	102
షాంఘై	3,120	27
నికాయ్	31,857	291

ముంబై: గత ఆర్థిక సంవత్సరం(2022-23)లో ప్రయివేట్ రంగ విమానయాన కంపెనీ విస్తారా నష్టాలు భారీగా తగ్గాయి. రూ. 1,393 కోట్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం ఏడాది(2021-22)లో నమోదైన రూ. 2,031 కోట్లతో పోలిస్తే 31 శాతంపైగా రికవర్ అయ్యాయి. కార్పొరేట్ వ్యవహారాల శాఖకు దాఖలు చేసిన సమాచారం ప్రకారం టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్(విస్తారా) మొత్తం ఆదాయం రెట్టింపై రూ. 11,784 కోట్లను తాకింది. దీంతో నష్టాలు భారీగా తగ్గినట్లు కంపెనీ పేర్కొంది. అయితే నెట్‌వర్త్ రూ. 1,250 కోట్ల నుంచి రూ. 502 కోట్లకు నీరసించింది. దేశీ విమానయాన పరిశ్రమ గతేడాది పటిష్ట వృద్ధిని సాధించినట్లు విస్తారా తెలియజేసింది. కోవిడ్ ముందుస్థాయిని సైతం అధిగమించినట్లు వెల్లడించింది. గత ఆరు నెలల్లో సగటున ప్రతిరోజూ 4 లక్షల మంది ప్రయాణికులు నమోదవుతున్నట్లు తెలియజేసింది.

ఉమ్మడి నష్టం ఇలా..

టాటా గ్రూప్ వెలువరించిన 2022-23 వార్షిక నివేదిక ప్రకారం గతేడాది గ్రూప్‌లోని ఎయిరిండియా, ఎయిరేషియా, విస్తారాల ఉమ్మడి నష్టం రూ. 15,532 కోట్లుగా నమోదైంది. వెరసి 2021-22లో నష్టం రూ. 13,838 కోట్లు మాత్రమే. అయితే ఈ కాలంలో మూడు సంస్థల ఆదాయం పుంజుకున్నప్పటికీ ఎయిరిండియా విమానాలు, ఇంజిన్ల నిలుపుదల కారణంగా రూ. 5,000 కోట్లమేర అదనపు ప్రొవిజనింగ్ చేపట్టడంతో ఉమ్మడి నష్టాలు పెరిగాయి. టాటా సన్స్ వార్షిక నివేదిక ప్రకారం గతేడాది ఎయిరిండియా ఆదాయం రూ. 31,377 కోట్లను దాటగా.. రూ. 11,388 కోట్ల నష్టం నమోదైంది. ఎయిరేషియా టర్నోవర్ రూ. 4,310 కోట్లుకాగా.. రూ. 2,750 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మాత్రం గతేడాది రూ. 5,669 కోట్ల ఆదాయం సాధించింది. అంతేకాకుండా రూ. 117 కోట్ల నికర లాభం ఆర్జించింది.

రూపాయి రికవరీ

14 పైసలు అప్; 82.99 వద్ద ముగింపు

న్యూఢిల్లీ: డాలరు మారకం విలువ తగ్గిన నేపథ్యంలో దేశీ కరెన్సీ రూపాయి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి నుంచి కోలుకుంది. డాలర్‌తో పోలిస్తే 14 పైసలు బలపడి, 82.99 వద్ద ముగిసింది. అమెరికా డాలరు బలహీనత దీనికి కారణం.